www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'వక్ఫ్' జేపీసీ సమావేశంలో రగడ

గాజునీటి సీసా పగులగొట్టిన 2

తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

చేతికి గాయం, నాలుగు కుట్లు

రెండు సమావేశాల పాటు సస్పెన్షన్



బుధవారం | 23-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 206 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 1.19 తదుపరి అష్టమి; నక్షత్రం: పునర్వసు పూర్తి; వర్జ్యం: రా.5.57-7.35; దుర్ముహూర్తం: ఉ.11.36-12.22; అమృతఘడియలు: తె.3.47-5.25; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.44 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





బాబుసాబ్‌పాళ్యలో కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న భవనం

బెంగళూరు ఆగమాగం

భారీ వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తం.. ఎల్లో అలర్ట్ జారీ

వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

భవనం కూలి ముగ్గురి మృతి.. శిథిలాల కింద 13 మంది

విమానాల రాకపోకలకు అంతరాయం.. సర్వీసుల మళ్లింపు

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరాన్ని వరుణుడు కుదిపేశాడు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నగర వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. ఉత్తర బెంగళూరులోని దొడ్డబొమ్మసంద్ర సరస్సు 17 ఏళ్ల తర్వాత మొదటిసారి పొంగి పొర్లడంతో హెబ్బాళ్ సమీప ప్రాంతాలు జలమయమయ్యాయి. యలహంక

మిగతా 2వ పేజీలో...

'దానా' గండం!.. బంగాళాఖాతంలో వాయుగుండం 14

తండ్రీకూతురు సహా రాష్ట్రంలో పిడుగుపాటుకు ముగ్గురి మృతి

పిడుగుపాటు బాధిత కుటుంబాలకు పరిహారం 12

16 కుటుంబాలకు రూ.96 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం

ఫోర్త్ సిటీలో ఫ్యాషన్ వర్సిటీ

20 ఎకరాల్లో ఏర్పాటుకు యంగ్ వన్ కార్పొరేషన్ సుముఖం

సియోల్‌లో సంస్థ చైర్మన్ కిహాక్ సంగ్‌తో మంత్రులు పొంగులేటి, పొన్నం చర్చలు

టెక్స్‌టైల్ రంగంలో అంతర్జాతీయ స్థాయి మార్పులకు అనుగుణంగా స్థాపన

కేఎంటీపీలో వచ్చే ఏడాది మరో 4 యూనిట్లు

వరంగల్ విమానాశ్రయం ప్రారంభమైతే మరింత పారిశ్రామికాభివృద్ధి: కిహాక్

ఏడాదిన్నరలో అందుబాటులోకి: మంత్రులు



(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ.. ఇప్పుడు ఫోర్త్ సిటీలో మరో యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. అదే.. ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీ! 20 ఎకరాలు కేటాయిస్తే దీనిని ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధమని దక్షిణ కొరియా కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన యంగ్ వన్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్థాయిలో చర్చలు జరిగాయి. తాజాగా సియోల్ పర్యటనలో ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం మంగళవారం అక్కడి యంగ్ వన్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్‌తో మంత్రులు పొంగులేటి, పొన్నం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీపై ఆయన

మిగతా 13వ పేజీలో...

అహో.. హన్! 13

సియోల్ మధ్యలో 75 కిలోమీటర్ల నది

దానిపై తేలియాడే బార్జెస్, హోటళ్లు, మాల్స్

అత్యద్భుత పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు

సియోల్ పర్యాటక, ఆర్థికాభివృద్ధికి జీవనాడి

దాని బాటలోనే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు

పేదలకు న్యాయం చేస్తాం: మంత్రి పొంగులేటి



బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఆలింగనం

సంక్షోభ పరిష్కారానికి చర్చలే మార్గం

- మేం అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నాం
- ఏ సమస్య అయినా శాంతియుత మార్గాల్లో పరిష్కారం కావాలి.. మేం పూర్తిగా సహకరిస్తాం
- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఉద్దేశించి బ్రిక్స్‌లో మోదీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని సమావేశం
- మా బంధం గట్టిది.. అనువాదం వద్దన్న పుతిన్

కజాన్, అక్టోబరు 22: ఎలాంటి సంక్షోభానికైనా చర్చలే పరిష్కార మార్గమని.. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని.. ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అన్నారు. రెండున్నరేళ్లకు పైబడి సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాము అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నామని, శాంతి స్థాపనకు అవసరమైన ఎలాంటి సహకారాన్నైనా అందించేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమయం వస్తే అన్ని విధాలా సహకరిస్తామని.. మానవత్వానికే తమ ప్రాధాన్యమని చెప్పారు. రష్యాలోని కజాన్ నగరంలో మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ.. రష్యా అధినేతతో

మిగతా 2వ పేజీలో...

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడి దారుణ హత్య



జగిత్యాలలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, తదితరులు

బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టి.. కత్తితో దాడి

స్వగ్రామానికి చెందిన వ్యక్తే నిందితుడు

జగిత్యాలలో కలకలం.. ఎమ్మెల్సీ ధర్నా

జీవన్‌రెడ్డికి పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫోన్

నా రాజకీయ జీవితానికి మంచి బహుమతి

అవమానాలు భరించా.. పార్టీలో ఉండను

'క్షమించండి అన్నా'.. అంటూ ఫోన్ కట్

మీకు.. మీ పార్టీకో దండం అని

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో వ్యాఖ్య



గంగారెడ్డి(ఫైల్)

జగిత్యాల/నిజామాబాద్/హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి (58) దారుణ హత్యకు గురయ్యారు. జగిత్యాల నియోజకవర్గం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అయిన గంగారెడ్డి.. నాలుగు దశాబ్దాలుగా జీవన్ రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా కొనసాగుతున్నారు. మంగళవారం ఉదయం తన సొంత గ్రామమైన జాబితాపూర్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్ గౌడ్ అనే యువకుడు కారుతో వెనుకనుంచి ఢీ కొట్టాడు. అదుపు తప్పి కిందపడిన గంగారెడ్డిని అందరూ చూస్తుండగానే కత్తితో ఛాతీతో పాటు కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. అనంతరం నిందితుడు

మిగతా 3వ పేజీలో...



మీడియాతో మాట్లాడుతున్న ఐకాస చైర్మన్ జగదీశ్వర్

సర్కారుకు ఉద్యోగుల ఐకాస అల్టిమేటం

చెప్పేనెల్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటన

నేటి నుంచి జనవరి 30 వరకు..

జనవరి 3, 4 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

21న మౌన ప్రదర్శన, 23న బైక్ ర్యాలీలు, 30న మానవహారాలు

ప్రధానంగా ఆరు డిమాండ్లపై పట్టు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ (ఐకాస) అల్టిమేటం జారీ చేసింది. పెండింగ్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులకు సంబంధించిన 50 డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడింది. ఈ మేరకు నాంపల్లిలోని టీఎన్‌జీవో భవన్‌లో మంగళవారం ఐకాస చైర్మన్

మిగతా 3వ పేజీలో...

మరో 79 విమానాలకు బాంబు బెదిరింపులు

ఒక్కరోజే 50.. ప్రధానంగా అంతర్జాతీయ ఫ్లైట్లకు

వారంలో 169 విమానాలకు బెదిరింపు కాల్స్

ఢిల్లీ పోలీసుల దర్యాప్తు.. 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు

దేశవ్యాప్తంగా సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బెదిరింపులు

ఈ తరహా మెయిళ్లపై కేంద్ర సంస్థల దర్యాప్తు

బెంగళూరు-వారణాసీ విమానం శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

ఆ సమయంలో దిగాల్సినవి విజయవాడకు..

ఢిల్లీ-హైదరాబాద్ సర్వీసు 45 నిమిషాలు గాల్లోనే

ఇదే విమానంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



న్యూఢిల్లీ, అక్టోబరు 22: విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఆగడం లేదు. ఇలాంటి కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు విధించేలా చట్ట సవరణ చేస్తామని, నో ఫ్లై జాబితాలో చేర్చుతామని సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా, ఈ బెదిరింపు కాల్స్ ఆగలేదు. గడిచిన 24 గంటల్లో మరో 79 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో మంగళవారం ఒక్క రోజే 50 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. ప్రధానంగా అంతర్జాతీయ మార్గాల్లో నడిచే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. ఇండిగో విమానాలు 23, విస్తారా 21, ఆకాశ 12, ఎయిరిండియాకు చెందిన 23 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటితో కలిసి వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లయింది. తాజాగా దేశీయ సర్వీసులతో పాటు జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ వంటి అంతర్జాతీయ నగరాలకు వెళ్లే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. 90కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులపై ఢిల్లీ పోలీసులు 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు సీఆర్పీఎఫ్ పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ రావడం గమనార్హం. దేశవ్యాప్తంగా పలు సీఆర్పీఎఫ్ స్కూళ్లకు మంగళవారం బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఢిల్లీలోని రెండు, రోహిణి, ద్వారక, హైదరాబాద్‌లోని పాఠశాలలకు మెయిల్ ద్వారా బెదిరింపు సందేశాలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ మెయిళ్లపై సీఆర్పీఎఫ్, నిఘా విభాగం, ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు

మిగతా 2వ పేజీలో...

బిల్లుకు లంచం

ఏసీబీకి చిక్కిన పెబ్బేరు మునిసిపల్ కమిషనర్ ఆదిశేషు

20 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు 13

ఆదాయానికి మించి ఆస్తులు

రంగారెడ్డి ఏజీసీపై మరో కేసు



12

నిర్మాత శివరామకృష్ణ అరెస్టు

తెలంగాణ ఆర్కైవ్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

84 ఎకరాల్ని కబ్జా చేసిన బూరుగుపల్లి

22 ఏళ్లుగా సర్కారు న్యాయపోరాటం

శివరామకృష్ణను దోషిగా తేల్చిన సుప్రీం

ఆర్కియాలజీ డైరెక్టర్ ఫిర్యాదు.. అరెస్టు



2

నేవీ చేతికి మరో అణ్వస్త్రం!

అమ్ములపొదిలో 3వ స్వదేశీ అణు జలాంతర్గామి

2 నెలల వ్యవధిలో రెండో సబ్‌మెరైన్ ప్రారంభం

విశాఖలో ఈ నెల 16నే ఎస్-4స్టార్ జలప్రవేశం

ఏఈవోలపై కొరడా

160 మంది అధికారుల సస్పెన్షన్ 12

రైతు బీమా మృతుల నమోదు జాప్యంతోనే

వ్యవసాయశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ

ఏఈవోల ధర్నా.. కక్షసాధింపేనని ఆగ్రహం



11

షేర్.. బే(జా)ర్!

స్టాక్ మార్కెట్ భారీ పతనం

సెన్సెక్స్ 930 పాయింట్లు డౌన్

2 వారాల కనిష్ఠ స్థాయికి సూచీ

24,500 దిగువకు జారిన నిఫ్టీ

9.19 లక్షల కోట్ల సంపద ఫట్

'వక్ఫ్' జేపీసీ భేటీలో రగడ

» గ్లాసు పగులగొట్టిన తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

» చేతికి గాయం, నాలుగు కుట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లుపై మంగళవారం జరిగిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. అది చివరకు తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడి సస్పెన్షన్‌కు దారి తీసింది. ఈ సమావేశంలో కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తి, బీజేపీ ఎంపీ అభిజిత్ గంగూలీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. వాదోపవాదాల సందర్భంగా ఆవేశంతో కల్యాణ్ బెనర్జీ తన టేబుల్‌పై ఉన్న గాజు నీటి సీసాను పగులగొట్టారు. ఆయన బొటన వేలు, చూపుడు వేలుకు గాయాలయ్యాయి. దాంతో పగిలిన సీసాను ఆయన కమిటీ చైర్మన్ జగదంబికా పాల్ డెస్క్ వైపు విసిరివేసే ప్రయత్నం చేశారు. అనంతరం కల్యాణ్ చేయికి వైద్యులు చికిత్స చేసి నాలుగు కుట్లు వేశారు. చైర్మన్ డెస్క్ వైపు పగిలిన సీసాను విసిరే ప్రయత్నం చేసినందుకు అధికార పక్ష సభ్యులు తప్పుపట్టారు. లోక్‌సభ నిబంధనావళిలోని 261, 374(1)(2) నిబంధనల ప్రకారం ఆయనను సమావేశాల రెండు సిట్టింగ్‌లతో పాటు ఒకరోజు హాజరు కాకుండా సస్పెండ్ చేశారు. కల్యాణ్‌ను సస్పెండ్ చేయాలంటూ బీజేపీ ఎంపీ నిశికాంత దుబే పెట్టిన తీర్మానానికి 9 మంది అనుకూలంగా, 8 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు.

లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేస్తే కోటి ఇస్తాం

» పోలీసులకు క్షత్రియ కర్ణిసేన రాజ్ షెకావత్ ఆఫర్

న్యూఢిల్లీ, అక్టోబరు 22: జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ని 'ఎన్‌కౌంటర్' చేస్తే రూ. 1.11 కోట్లు ఇస్తామని పోలీసులకు క్షత్రియ కర్ణిసేన ఆఫర్ చేసింది. ఈ మేరకు క్షత్రియ కర్ణిసేన నేత రాజ్ షెకావత్ ప్రకటించారు. నిరుడు డిసెంబరులో ప్రముఖ రాజ్‌పుత్ నేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని బిష్ణోయ్ గ్యాంగ్ కాల్చి చంపడంతో ప్రతీకారంగా ఈ మేరకు నజరానా ఇస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో రాజ్ షెకావత్ మాట్లాడుతూ ఏ పోలీస్ అధికారి అయినా జైల్లో ఉన్న బిష్ణోయ్‌ని చంపితే రూ.1,11,11,111 నగదు ఇస్తామని ప్రకటించారు. ప్రస్తుతం బిష్ణోయ్ మత్తు పదార్థాల స్మగ్లింగ్ ఆరోపణల కేసులో గుజరాత్‌లోని సబర్మతి జైల్లో ఉన్నారు. ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ ముఠా, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని హత్యచేసినట్లు, అండర్ వరల్డ్ నేత దావూద్ ఇబ్రహీంతో ఆయనకు సంబంధాలు ఉండటంతోనే ఈ పనిచేసినట్లు ప్రకటించింది.

హెజ్‌బొల్లా బంకర్‌లో భారీగా నగదు, బంగారం

టెల్ అవీవ్, అక్టోబరు 22: బీరూట్‌లోని ఒక ఆస్పత్రి కింద హెజ్‌బొల్లా రహస్య బంకర్‌లో వందలాది మిలియన్ డాలర్ల నగదు, బంగారం కనుగొన్నామని ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. అయితే ఆ ఆస్పత్రి మీద దాడులు చేయబోమని తెలిపింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలపై దాడులు జరుపుతామని వెల్లడించింది. ఇజ్రాయెల్ మిలటరీ ముఖ్య అధికార ప్రతినిధి రేర్ అడ్మిరల్ డేనియల్ హగారి టీవీలో మాట్లాడుతూ.. హెజ్‌బొల్లా మాజీ నాయకుడు సయ్యద్ హసన్ నస్రల్లా.. అల్ సహెల్ ఆస్పత్రి కింద ఈ బంకర్ నిర్మించినట్లు చెప్పారు. నస్రల్లా గత నెలలో ఇజ్రాయెల్ చేతిలో హతమయ్యాడు. సుదీర్ఘ కాలం మనుషులు ఉండేలా దాన్ని నిర్మించినట్లు హగారి వెల్లడించారు. ప్రస్తుతం అందులో వందలాది మిలియన్ డాలర్ల నగదు, బంగారం ఉందని, లెబనాన్ ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అల్ సహెల్ ఆస్పత్రి డైరెక్టర్ ఫాది అలామె ఈ ఆరోపణలను కొట్టిపారేశారు.

ముస్లింలు మూడో వివాహాన్ని రిజిస్టర్ చేసుకోవచ్చు

» పర్సనల్ లా అందుకు అనుమతి ఇస్తోంది: బాంబే హైకోర్టు

ముంబయి, అక్టోబరు 22: ముస్లింలు ఒకటి కన్నా ఎక్కువ వివాహాలను రిజస్టర్ చేసుకోవచ్చని, ఇందుకు వారి పర్సనల్ లా అనుమతి ఇస్తోందని బాంబే హైకోర్టు తెలిపింది. మూడో వివాహం రిజిస్టర్ చేయాలంటూ ఓ వ్యక్తి చేసిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని థాణె మునిసిపల్ కార్పొరేషన్ అధికార్లకు ఆదేశాలు ఇస్తూ ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఆ వ్యక్తి అల్జీరియాకు చెందిన మహిళను మూడో వివాహం చేసుకున్నాడు. దాన్ని రిజిస్టర్ చేయాల్సిందిగా ఫిబ్రవరిలో థాణె మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మ్యారేజీ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. అయితే మహారాష్ట్ర వివాహ బ్యూరోల నియంత్రణ-వివాహాల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ఒక వివాహాన్ని మాత్రమే రిజిస్టర్ చేసే అవకాశం ఉందని పేర్కొంటూ అతని వినతిని తిరస్కరించారు. దాంతో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా జస్టిస్ బి.పి.కొలాబావాలా, జస్టిస్ సోమశేఖర్ సుదర్శన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. అధికారులు చట్టాన్ని తప్పుగా అన్వయించారని తెలిపింది. పర్సనల్ లా ప్రకారం ముస్లింలు ఒకేసారి నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చని పేర్కొంది. అందువల్ల మూడో వివాహాన్ని రిజిస్టర్ చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదని తెలిపింది. ఆ పిటిషనర్ రెండో వివాహాన్ని రిజిస్టర్ చేసిన అధికారులు మూడో వివాహానికి అభ్యంతరం చెప్పడం ఏమిటని ప్రశ్నించింది. సంబంధిత పత్రాలను సమర్పించిన వెంటనే వ్యక్తిగత వాదనలు విని తగిన ఆదేశాలు ఇవ్వాలని బాంబే హైకోర్టుఆదేశించింది.

రష్యా నుంచి 85 మంది భారతీయులకు విముక్తి

» భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

న్యూఢిల్లీ, అక్టోబరు 22: రష్యా సైన్యంలో అక్రమంగా చేరి ఉక్రెయిన్‌తో పోరాడుతున్న భారతీయుల్లో ఇప్పటి వరకు 85 మందికి విముక్తి లభించిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. మరో 20 మంది కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు సోమవారం మీడియాకు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మోసపూరితంగా కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చిక్కుకున్నారు. వారిని రక్షించి స్వదేశానికి రప్పించడానికి కొన్ని రోజులుగా భారత ప్రభుత్వం కృషి చేస్తోంది.

అత్యంత కాలుష్య నగరంగా లాహోర్

లాహోర్, అక్టోబరు 22: పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. పంట వ్యర్థాల దహనం, పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాల కారణంగా వాయునాణ్యతా దారుణంగా పడిపోయినట్లు ప్రభుత్వం పేర్కొంది. అక్కడి గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) అత్యంత ప్రమాదకర స్థాయిలో 394గా నమోదైంది. సాధారణంగా ఏక్యూఐ సూచీ 150 దాటితేనే ప్రమాదంగా పరిగణిస్తారు. దీంతో మర్యమ్ నవాజ్ సారథ్యంలోని పంజాబ్ ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది.

మరో 79 విమానాలకు బాంబు బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

తరగతి గదుల్లో బాంబులు పేలనున్నాయంటూ సోమవారం అర్ధరాత్రి దాటాక ఆయా పాఠశాలలకు మెయిళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వెలుపల బాంబు పేలుడు జరగడం.. అది తమ పనేనని ఖలిస్థానీ అనుకూల సంస్థ ప్రకటించడం తెలిసిందే. తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న పలు సీఆర్పీఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడం గమనార్హం.

బాంబు బెదిరింపులు.. శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): బెంగళూరు నుంచి వారాణసీకి వెళ్తున్న ఎయిర్ ఆకాశ్ (క్యూపీ 1612) విమానానికి బాంబు బెదిరింపు రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా దించారు. మంగళవారం సాయంత్రం 5:10 గంటలకు అత్యవసర ల్యాండింగ్ చేశారు. బాంబు తనిఖీ బృందాలు చేరుకుని, సోదాలు చేసి బాంబు లేదని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి జోద్‌పూర్ వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు రావడంతో జోద్‌పూర్‌లో దిగిన వెంటనే భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ బాంబు బెదిరింపు కాల్స్ కారణంగా హైదరాబాద్‌లో దిగాల్సిన రెండు విమానాలను విజయవాడకు తరలించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్న ఎయిరిండియా విమానం 45 నిమిషాలు గాల్లో చక్కర్లు కొట్టింది. బాంబు బెదిరింపుల కారణంగా శంషాబాద్‌లో విమానాలను అత్యవసరంగా దించారని, వాతావరణం కూడా అనుకూలించనందున విజయవాడకు తరలిస్తున్నట్లు ప్రయాణికులకు తెలిపారు. ఏటీసీ అనుమతి రావడంతో ఇంధనం నింపుకున్న తర్వాత విజయవాడ నుంచి బయల్దేరి రాత్రి 7:30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ విమానంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. గాల్లో చక్కర్లు కొట్టడంతో భయాందోళనకు గురయ్యామని సుప్రీంకోర్టు న్యాయవాది గీత తెలిపారు. అలాగే గోవా నుంచి మధ్యాహ్నం హైదరాబాద్ బయల్దేరిన ఇండిగో విమానాన్ని కూడా విజయవాడకు మళ్లించారు. అది రాత్రి 7 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంది.

వయనాడ్‌లో ప్రియాంకతో నవ్య ఢీ

» బీజేపీ అభ్యర్థిగా మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

» పదేళ్లుగా కోలికోడ్ కౌన్సిలర్‌గా సేవలు





వయనాడ్, అక్టోబరు 22: కేరళలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖాళీచేసిన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆయన చెల్లెలు ప్రియాంకాగాంధీ వాద్రాపై బీజేపీ ఓ మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బరిలోకి దించింది. ఆ పార్టీ తరపున కోలికోడ్ (క్యాలికట్) కార్పొరేషన్ కౌన్సిలర్‌గా పదేళ్లుగా పనిచేస్తున్న నవ్య హరిదాస్ పోటీచేస్తున్నారు. నెహ్రూ కుటుంబ సభ్యురాలిగా ప్రియాంకకు జాతీయ స్థాయిలో పేరు ఉండిఉండొచ్చని.. అయితే ఆమె కంటే తనకే ఎక్కువ రాజకీయానుభవం ఉందని నవ్య మంగళవారం వ్యాఖ్యానించారు. వయనాడ్‌లో త్రిముఖ పోటీ నెలకొంది. ఎల్‌డీఎఫ్ అభ్యర్థిగా సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకేరీ పోటీచేస్తున్నారు. నవ్య 2009లో మెరైన్ ఇంజనీర్ శోభిన్ శ్యామ్‌ను పెళ్లి చేసుకుని సింగపూర్ వెళ్లారు. అక్కడ నాలుగేళ్లు పని చేశారు. అనంతరం నెదర్లాండ్స్, అజార్‌బైజాన్‌లోనూ పనిచేశారు. 2015లో సెలవుపై కోలికోడ్ వచ్చారు. ఆ సమయంలో కోలికోడ్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ ఆమెకు కరపరంబ వార్డు టికెట్ ఇచ్చింది. ఆమె కుటుంబానికి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉండడమే దీనికి కారణం. వరుసగా రెండు దఫాలు గెలిచి పదేళ్లుగా ఆమె కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. 2021లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వయనాడ్ లోక్‌సభ స్థానంలో తమ పార్టీకి సంస్థాగత బలం ఎక్కువగా లేదని ఆమె అంగీకరించారు. అయితే ప్రధాని మోదీ అభివృద్ధి ఎజెండా తనను కచ్చితంగా విజయతీరానికి చేరుస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. కాగా, తన చెల్లెలు ప్రియాంక కంటే మంచి ప్రతినిధి వయనాడ్‌కు ఉండరని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. 'వయనాడ్ ప్రజలకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది. వారికి ప్రియాంక కంటే ఉత్తమ ప్రతినిధిగా మరెవరినీ నేను ఊహించలేను. వయనాడ్ అవసరాలను తీర్చడంలో ఆమె ముందుంటారు. పార్లమెంటులో గట్టిగా తన వాణి వినిపిస్తారు' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

లోకం తీరు



బెంగళూరు ఆగమాగం

(మొదటి పేజీ తరువాయి)



బెంగళూరు నగరంలోని కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

ప్రాంతంలో కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ చుట్టూ పెద్దఎత్తున వరద నీరు పోటెత్తింది. ఇక్కడి నుంచి సుమారు 2,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహకార నగర పరిధిలోని టాటా నగర్, బాలాజీ లేఔట్ ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు భయాందోళన చెందారు. టాటా లేఔట్ ప్రాంతంలో సుమారు 600 ఇళ్లలోకి నీరు చేరింది. కింది ఫ్లోర్‌లో నివసించే వారు ఇళ్లను వదిలి పై అంతస్తుల్లోకి వెళ్లారు. కోగిలు క్రాస్ మెయిన్ రోడ్డుపైకి వరద నీరు చేరడంతో పలువురిని బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, బెంగళూరులో రోడ్ల దుస్థితిపై సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. ఐటీ హబ్‌గా పేరొందిన నగరంలో మౌలిక సదుపాయాలు దారుణంగా ఉన్నాయని, వరద నీటిలో చిక్కుకున్న వాహనాలపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ మంత్రి కృష్ణ బైరె గౌడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, బెంగళూరుకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించింది. అలాగే ఐటీ, బీటీ, ప్రైవేటు కంపెనీలు తమ ఉద్యోగులకు బుధవారం ఇంటి నుంచి పని చేయడానికి అనుమతించాలని సూచించింది. ఈ సెలవు కారణంగా కోల్పోయిన బోధనా సమయాన్ని భర్తీ చేయడానికి శనివారం మధ్యాహ్నం లేదా ఆదివారం అదనపు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. బెంగళూరు అర్బన్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు జిల్లా కమిషనర్ జగదీశ్ సెలవు ప్రకటించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు నీట మునిగిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. మరోవైపు ఈ నెల 23 నుంచి 26 వరకూ దక్షిణ, కోస్తా కర్ణాటకల్లో భారీ వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. హెచ్చరికలు జారీ చేసింది. చిక్కబళ్లాపూర్, చిక్కమగళూరు, కోలార్, బెంగళూరు అర్బన్, రూరల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.



నాలుగు విమానాలు దారిమళ్లింపు

సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవనహళ్లిలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వివిధ దేశాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు నడుస్తున్న ఎయిరిండియా విమానం, ఢిల్లీ, హైదరాబాద్, చండీగఢ్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన మూడు ఇండిగో విమానాలను చెన్నై విమానాశ్రయానికి మళ్లించారు. మరో 20 విమానాలు ఆలస్యంగా నడిచాయి. విమానాశ్రయం పరిసరాల్లో 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బెంగళూరులో ఘోర ప్రమాదం

ఎడతెరిపిలేని వర్షాల కారణంగా బెంగళూరులో ఘోర ప్రమాదం జరిగింది. కేఆర్ పుర-హెణ్ణూరు మార్గంలోని బాబుసాబ్‌పాళ్యలో నిర్మాణ దశలో ఉన్న ఓ భవనం మంగళవారం సాయంత్రం సుమారు 4గంటల సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో సుమారు 16 మంది కార్మికులు నిర్మాణ పనుల్లో ఉన్నారు. ఒక్కసారిగా ఈ భవనం కుప్పకూలిపోయింది. అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని శిథిలాల నుంచి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. శిథిలాల కింద మరో 13 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పెద్ద ఎత్తున యంత్రాలను ఉపయోగించి శిథిలాలను తొలగిస్తున్నారు.

తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభన తొలగినట్టే!

» భారత్‌తో ఒప్పందాన్ని నిర్ధారించిన చైనా

» అమలు కోసం కలిసి పనిచేస్తామని వెల్లడి

» విశ్వాసం పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నామన్న భారత ఆర్మీ చీఫ్

బీజింగ్, అక్టోబరు 22: తూర్పు లద్దాఖ్‌లో నాలుగేళ్లుగా భారత సైన్యంతో కొనసాగుతున్న ప్రతిష్టంభన తొలగినట్టేనని చైనా వెల్లడించింది. సరిహద్దు గస్తీపై ఇరుదేశాలూ ఒక ఒప్పందానికి వచ్చాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిశ్రీ సోమవారం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, మంగళవారం వరకూ దీనిపై చైనా నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మంగళవారం రష్యాకు పయనమైన తర్వాత చైనా నుంచి తాజా ఒప్పందంపై ప్రకటన వెలువడింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మంగళవారం బీజింగ్‌లో మీడియా అడిగిన ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఒప్పందం అమలు కోసం భారత్‌తో కలిసి చైనా పనిచేస్తుందని ఆయన చెప్పారు. బ్రిక్స్ సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉందా? అని మీడియా ప్రశ్నించగా, అలాంటిది ఏమైనా ఉంటే తెలియజేస్తామని లిన్ సమాధానమిచ్చారు. కాగా, సరిహద్దు గస్తీపై భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు విశ్వాసం పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నామని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. దీని కోసం ఇరుపక్షాలూ ఒకరికొకరు భరోసా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మాట్లాడారు.

చర్చలే మార్గం

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపారు. జూలైలో ఇరు దేశాల 22వ శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధాని మోదీ మాస్కోలో పర్యటించిన సంగతి తెలిసిందే. మూడు నెలల వ్యవధిలోనే ఆయన రష్యాలో రెండోసారి పర్యటించడం గమనార్హం. అప్పటిలాగానే.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మంగళవారం సైతం రష్యా అధ్యక్షుడిని మోదీ ఆలింగనం చేసుకున్నారు. మూడు నెలల్లోపే రష్యాలో రెండోసారి పర్యటిస్తుండడాన్ని ప్రస్తావించి.. ఇది రెండు దే శాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు, ప్రగాఢమై న విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. బ్రిక్స్ సదస్సుకు సారథ్యం వహించడమే కాక.. మరి కొన్ని దే శాలూ చేరేలా చొరవ చూపినందుకు పుతిన్‌కు అభినందనలు తెలిపారు. సదస్సు ముగింపు సందర్భంగా.. ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యూఏఈలను సభ్యదేశాలుగా చేర్చుకుంటూ 'కజాన్ డిక్లరేషన్'ను ప్రకటించనున్నారు. దీంతో సభ్యదేశాల సంఖ్య 10కి పెరగనుంది. కాగా, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం తదితర కీలక విషయాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు బ్రిక్స్ ప్రధాన వేదికగా మారిందని మోదీ పేర్కొన్నారు. కజాన్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని.. రష్యాతో చరిత్రాత్మక సంబంధాలను గుర్తు చేశారు. అలాగే.. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు.



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

మా బంధం దృఢమైనది: పుతిన్

భారత్‌తో సంబంధాలను అత్యంత విశిష్టమైనవిగా పుతిన్ అభివర్ణించారు. ఈ బంధం చెక్కుచెదరని.. స్నేహం నిరంతరం మెరుగవుతూనే ఉంటుందని పేర్కొన్నారు. తన భాషను మోదీ అర్థం చేసుకుంటారని.. ఈ సమావేశంలో అనువాదం అవసరం లేదని వ్యాఖ్యానించారు. దీనికి మోదీ చిరునవ్వులు చిందించారు. కాగా, జూలైలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలను పుతిన్ ప్రస్తావించారు. మోదీ, తాను ఎన్నోసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు చెప్పారు. తన ఆహ్వానాన్ని మన్నించి కజాన్‌కు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ బుధవారం భేటీ కానున్నట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. గడిచిన ఐదేళ్లకాలంలో మోదీ, జిన్‌పింగ్ పలు వేదికలపై కలిసి కనిపించినప్పటికీ.. ముఖాముఖి భేటీ కావడం మాత్రం ఇదే తొలిసారి. 2019లో కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో వీరిద్దరూ ముఖాముఖి మాట్లాడుకున్నారు. ఆ తర్వాత 2020లో గల్వాన్‌లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలూ ఇన్నాళ్లుగా ఏకాంతచర్చలు జరపలేదు.

కృష్ణభక్తుల స్వాగతం

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు కజాన్‌కు వెళ్లిన ప్రధాని మోదీకి.. ఆయన బస చేసిన హోటల్ వద్ద ఇస్కాన్ సభ్యులు కృష్ణుడి భజనలతో, సంస్కృత గీతంతో స్వాగతం పలికారు. వారు కృష్ణ భజన చేస్తున్నంత సేపూ మోదీ రెండు చేతులూ జోడించి అలా ఉండిపోయారు. అలాగే, కొందరు రష్యా కళాకారులు.. తమ సంప్రదాయ నృత్యాలతో మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని రాక సందర్భంగా ఆ హోటల్ వద్దకు వచ్చిన పలువురు భారతీయులు చేతిలో మువ్వన్నెల పతాకాలను పట్టుకుని, ఉత్సాహంగా ఊపుతూ ఆయన్ను పలకరించారు. వారిలో చాలా మందితో మోదీ కరచాలనం చేశారు. పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు.

రష్యాకు ఉ.కొరియా సైన్యంపై ద.కొరియా ఆందోళన

సియోల్, న్యూయార్క్, అక్టోబరు 22: ఉక్రెయిన్‌పై చేస్తున్న యుద్ధంలో రష్యా తరఫున పాల్గొనేందుకు ఉత్తర కొరియా తన సైనికులను పంపించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చర్య తమ భద్రతకు, అంతర్జాతీయ సమాజానికి ముప్పు కలిగిస్తుందని దక్షిణ కొరియా తెలిపింది. అందువల్ల ఉత్తర కొరియా సైనికులను వెంటనే వెనక్కి పిలిపించాలని డిమాండు చేసింది. ఈ నెల మొదట్లో ఉత్తర కొరియా 1,500 మంది ప్రత్యేక ఆపరేషన్ దళాల సిబ్బందిని రష్యాకు పంపించినట్లు దక్షిణ కొరియా నిఘా వర్గాలు తెలిపాయి. 10వేల మంది ఉత్తర కొరియా సైనికులు రష్యాకు మద్దతుగా వస్తారన్న సమాచారం తనకు అందిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. నవంబరు ఒకటో తేదీన ఆ సైనికులు యుద్ధభూమికి వెళ్లే అవకాశం ఉందని అమెరికా అంచనా వేస్తోంది. ప్రస్తుతం వారు రష్యాలోని తూర్పు ప్రాంతంలో శిక్షణ పొందుతూ వాతావరణ పరిస్థితులకు అలవాటు పడుతున్నారని భావిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం దక్షిణ కొరియా విదేశాంగ శాఖ ఉప మంత్రి కిమ్ హోంగ్ కిన్ తమ దేశంలోని రష్యా రాయబారి గ్రెగోరీ జినోవివ్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపారు. మరోవైపు ఉత్తర కొరియా నిర్ణయం 'ప్రమాదకరం...తీవ్ర ఆందోళనకర పరిణామం' అని అమెరికా అభిప్రాయపడింది. ఈ 'నాటకీయ పరిణామం'పై మిత్రపక్షాలతో చర్చలు జరిపినట్లు తెలిపింది. ఇందుకు ఉత్తర కొరియాకు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని అమెరికా, బ్రిటన్‌లు కలిసి రష్యాను హెచ్చరించాయి.

నేవీ చేతికి మరో అణ్వస్త్రం..!

భారత్ అమ్ముల పొదిలో మూడో స్వదేశీ అణు జలాంతర్గామి.. రెండు నెలల వ్యవధిలో రెండో సబ్‌మెరైన్ ప్రారంభం



విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే స్వదేశీ అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను అట్టహాసంగా ప్రారంభించిన భారత్.. రెండు నెలల వ్యవధిలోనే మరో న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను జలప్రవేశం చేయించి ప్రపంచం నివ్వెరపోయేలా చేసింది. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో చైనా సముద్ర కార్యకలాపాలు పెచ్చుమీరుతున్న తరుణంలో.. భారత్ తన సముద్ర అణ్వాయుధ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా మరో అణు జలాంతర్గామిని రంగంలోకి దించింది. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) నుంచి ఈ నెల 16నే తన నాలుగో అణు జలాంతర్గామి ఎస్4స్టార్‌ను గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభించింది. విశాఖపట్నం కేంద్రంగా అణు జలాంతర్గాముల నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడి వ్యవహారాలన్నీ నేరుగా ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయమే పర్యవేక్షిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 29న ఇదే ఎస్‌బీసీ నుంచి కొత్త అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇది జరిగి రెండు నెలలైనా కాకముందే మరో శక్తిమంతమైన, అంతకంటే మెరుగైన అణు జలాంతర్గామిని సిద్ధం చేయడంపై ప్రపంచ దేశాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. పైగా ఇది 75శాతానికి పైగా దేశీయంగా తయారైనది కావడం విశేషం.

దేశీయంగా మూడోది.. మొత్తంగా నాలుగోది

భారత నౌకాదళం తొలుత రష్యా నుంచి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్రను లీజుకు తీసుకుంది. అది విశాఖపట్నం కేంద్రంగానే పనిచేస్తోంది. ఆ తర్వాత విశాఖలోని తూర్పు నౌకాదళాన్ని నేవీ సబ్‌మెరైన్ల కేంద్రంగా ప్రకటించి, ఇక్కడే అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెహికల్ (ఏటీవీ) ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా నాలుగు అణు జలాంతర్గాములు నిర్మించాలని నిర్ణయించారు. తొలుత ఐఎన్ఎస్ అరిహంత్‌ను నిర్మించారు. ఇది 2009లో సముద్ర పరీక్షలకు వెళ్లి 2016 నుంచి నేవీకి సేవలందించడం ప్రారంభించింది. దానికి పరీక్షలు జరుగుతున్న సమయంలోనే ఐఎన్ఎస్ అరిఘాత్ నిర్మాణం ప్రారంభించారు. ఇది 2017 నుంచి సీ ట్రయల్స్‌కు వెళుతూ రెండు నెలల క్రితమే నేవీలో చేరింది. తాజాగా వారం రోజుల క్రితం ఎస్‌బీసీ నుంచి మూడో అణు జలాంతర్గామి ఎస్4స్టార్ సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. దీనికి ఐఎన్ఎస్ అరిధమన్‌గా పేరు పెడతారని విశ్వసనీయ సమాచారం.

ఎస్-1 నుంచి ఎస్-4 వరకు

అణు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే వీటిని స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్లు (ఎస్ఎస్‌బీఎన్)గా వ్యవహరిస్తున్నారు. రష్యా నుంచి లీజుకు తీసుకున్న ఐఎన్ఎస్ చక్రను ఎస్-1గా, అరిహంత్‌ను ఎస్-2గా, అరిఘాత్‌ను ఎస్-3గా, తాజాగా జలప్రవేశం చేసిన దానిని ఎస్-4స్టార్‌గా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఎస్‌బీసీలో ఇప్పటివరకూ నిర్మితమైనవి మూడు మాత్రమే.

అరిహంత్ క్లాసులోనే భారీ తేడా

ఏటీవీ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న సబ్‌మెరైన్లను అరిహంత్ క్లాస్‌గా వ్యవహరిస్తున్నారు. అరిహంత్ సబ్‌మెరైన్ నుంచి కె-15 బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించగలుగుతున్నారు. ఇవి 750 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదిస్తాయి. అరిఘాత్ విషయానికి వస్తే 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలిగే కే-4 మిస్సైళ్లను ప్రయోగించేలా తీర్చిదిద్దారు. ఇది సముద్రం లోపల గంటకు 44కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రెండింటిలో నాలుగు మిస్సైల్ ట్యూబులు ఉన్నాయి. కాగా, వీటికి అప్‌గ్రేడ్ వెర్షన్‌గా రూపొందించిన ఎస్-4స్టార్‌లో ఎనిమిది మిస్సైల్ ట్యూబులు ఉంటాయి. దీని నుంచి మిస్సైళ్లను నిట్టనిలువుగా కూడా ప్రయోగించే అవకాశం ఉంది. ఇవి కూడా 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తాయి. ఈ అణు జలాంతర్గాములు సముద్రంలో ఎంత దూరమైనా ప్రయాణించగలవు. వీటికి పరిమితి లేదు. వాటికి అవసరమైన ఇంధనం, సమయానుసారం నిర్వహణ, లోపల ఉండే సిబ్బందికి అవసరమైన ఆహారం, ఆరోగ్య సహకారం అందించగలిగితే సముద్రంలో ఎంత దూరమైనా ప్రయాణిస్తాయి. అరిహంత్, అరిఘాత్ రెండూ ప్రస్తుతం భారత జలాల సరిహద్దు పరిరక్షణకు పహారా కాస్తున్నాయి.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

సంతోష్ గౌడ్ తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కొద్ది దూరంలో పడేసి వేరే కారులో అనుచరులతో కలిసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం ధర్నాలో పాల్గొని పోలీసుల తీరుపై మండిపడ్డారు. అక్కడికి చేరుకున్న ఎస్పీ అశోక్ వారితో మాట్లాడారు. కాగా, జాబితాపూర్ గ్రామానికే చెందిన నిందితుడు సంతోష్ గౌడ్, గంగారెడ్డిల మధ్య వ్యక్తిగతంగా విభేదాలున్నట్లు సమాచారం. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సంతోష్ గౌడ్ తర్వాత కాంగ్రెస్‌లో చేరాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

4 నెలలుగా అవమానాలు ఎదుర్కొంటున్నా: జీవన్ రెడ్డి

కాంగ్రెస్ నాయకుడి హత్య విషయాన్ని తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఈ సమయంలో జీవన్ రెడ్డి పీసీసీ చీఫ్‌తో అసహనంగా మాట్లాడారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ మంచి బహుమతి ఇచ్చిందని వ్యాఖ్యానించారు. పార్టీలో కొనసాగడం సాధ్యం కాదని, ఇంత కాలం మానసికంగా అవమానాలకు గురైనా భరించానని, ఇప్పుడు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆయనతో పేర్కొన్నారు. దయచేసి నన్ను క్షమించండి అన్నా అంటూ ఫోన్‌కాల్ కట్ చేశారు. అంతకు ముందు విప్ లక్ష్మణ్ కుమార్‌తో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. 'మీ పార్టీకి.. మీకు ఓ దండం.. మీ పార్టీలో నేను ఇక ఉండను.. ఇక నైనా బతకనివ్వండి' అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా విలేకరులతో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సంతోషపడాలా, అనుచరుడు హత్యకు గురైనందుకు బాధపడాలా అర్థంకావడం లేదన్నారు. నియోజకవర్గంలో కొందరు నేతలు కాంగ్రెస్ ముసుగులో దాడులకు పాల్పడుతున్నారని, బీఆర్ఎస్ అరాచకాలు సృష్టిస్తోందని ఆరోపించారు. నాలుగు నెలలుగా నియోజకవర్గంలో రాజకీయంగా అవమానాలు ఎదుర్కొంటున్నానని, కానీ ప్రస్తుతం భౌతికదాడులకు దిగడంతో కాంగ్రెస్‌లోనే కాదు.. రాజకీయ జీవితంలోనూ కొనసాగడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాగా, హైదరాబాద్ పర్యటనలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్.. గంగారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించారు.



జగిత్యాలలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, తదితరులు

ఇది తెలంగాణ సంస్కృతి కాదు: మహేష్ కుమార్‌గౌడ్

హత్యారాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యారాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదన్నారు. హత్యారాజకీయాలను ఎవరు ప్రేరేపించినా.. ప్రభుత్వం ఉపేక్షించబోదని చెప్పారు. మరోవైపు.. నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మహేష్‌కుమార్ గౌడ్ జగిత్యాల పోలీసులను కోరారు.

తొమ్మిది కాలేజీల్లో
ఈవెనింగ్ బీటెక్

- పలు కోర్సులకు జేఎన్‌టీయూ అనుమతి
- 660 సీట్ల భర్తీకి సెంట్రలైజ్డ్ స్పాట్ అడ్మిషన్లు
- త్వరగా చేపట్టాలని రిజిస్ట్రార్ ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు చేసేవారి(వర్కింగ్ ప్రొఫెషనల్స్) కోసం సాయంత్రం వేళ బీటెక్ కోర్సులు నిర్వహించేందుకు తొమ్మిది ఇంజనీరింగ్ కళాశాలలకు జేఎన్‌టీయూ అనుమతినిచ్చింది. ఆ కోర్సులకు సంబంధించి త్వరితగతిన ప్రవేశాల ప్రక్రియలను చేపట్టాలని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు. ఈవెనింగ్ బీటెక్‌కు ఆయా కళాశాలల్లో పలు కోర్సుల్లో మొత్తం 660 సీట్ల భర్తీకై జేఎన్‌టీయూ అడ్మిషన్ల విభాగంలో సెంట్రలైజ్డ్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆయా కళాశాలలకు ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులనే ఈవెనింగ్ బీటెక్ కోర్సులకు కూడా వర్తింపజేశారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఈసెట్ ద్వారా లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు వర్తించే అర్హతా నిబంధనలే వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు.

ఒక సెమిస్టర్ అదనం:

ఈవెనింగ్ బీటెక్‌లో ప్రవేశాలు కోరుకునే అభ్యర్థులు కనీసం ఏడాది పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పరిశ్రమలు లేదా విద్యా సంస్థల్లో పనిచేసి ఉండాలి. అలాగే తాము పనిచేస్తున్న సంస్థ నుంచి 75 కిలోమీటర్ల పరిధిలోనే కళాశాలను ఎంచుకోవాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు బీటెక్ కోర్సు మూడేళ్లు కాగా, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఒక సెమిస్టర్ అదనంగా కోర్సు మూడున్నరేళ్లు పడుతుంది. రెగ్యులర్ విద్యార్థులకు మాదిరిగానే వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అన్ని తరగతులు, ప్రయోగాలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆయా కళాశాలల్లో ఏదైనా కోర్సుకు కేటాయించిన సీట్లలో మూడోవంతు సీట్లు భర్తీ అయితేనే కోర్సును ప్రారంభించాలని అధికారులు స్పష్టం చేశారు.

పీల్చే గాలి ప్రాణం తీస్తోంది!

వాయు కాలుష్యంతో ఏటా 33 వేల మరణాలు! .. 10 నగరాల్లో ప్రమాదకర పరిస్థితి

- హైదరాబాద్‌లో 5.6 శాతం మరణాలు కాలుష్యం వల్లే...
- తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డుకు ఎన్‌జీటీ నోటీసులు



న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో వాయు కాలుష్యంతో ప్రతి ఏటా 33 వేల మంది మరణించడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని వాయు కాలుష్యంపై ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ స్టడీ, టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురితమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల నివేదికలను ఎన్‌జీటీ సుమోటోగా స్వీకరించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, జ్యుడీషియల్ సభ్యులు, జస్టిస్ సుధీర్ అగర్వాల్, జస్టిస్ ఎ. సెంథిల్ వేల్‌తో కూడిన ట్రిబ్యునల్ దీనిపై విచారణ నిర్వహించనుంది. ఈమేరకు సోమవారం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ), కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలతోపాటు తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డులకు నోటీసులు జారీ చేసింది. వీటికి సంబంధించిన కేసును బుధవారమే విచారించనున్నట్లు ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. అలాగే.. తూర్పు ఢిల్లీ, లూధియానా, పంచకులలో అత్యధిక వాయు కాలుష్యం ఉన్నట్లు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనాన్ని సుమోటోగా స్వీకరించిన ట్రిబ్యునల్.. ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ(డీపీసీసీ), పంజాబ్ కాలుష్య నియంత్రణ మండలి(పీపీసీబీ), సీపీసీబీ, ఎంఈఎఫ్‌సీసీ, సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసును వచ్చే ఏడాది ఫిబ్రవరి 6న విచారించనున్నట్లు ట్రిబ్యునల్ స్పష్టం చేసింది.

ప్రామాణిక పరిమితులను మించిన కాలుష్యం!

దేశంలో వాయు కాలుష్యం తీవ్రతపై లాన్సెట్ నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్ సహా పది నగరాల్లో రోజువారీ మరణాల్లో సగటున 7 శాతానికి పైగా వాయు కాలుష్యం వల్లే సంభవిస్తున్నాయని తెలిపింది. 2008 నుంచి 2019 మధ్య పదకొండేళ్ల కాలంలో సంభవించిన దాదాపు 36 లక్షల మరణాలను అధ్యయనంలో విశ్లేషించారు. రోజువారి మరణాలు, వాయు కాలుష్యం మధ్య ఉన్న సంబంధాలపై హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, పుణె, సిమ్లా, వారణాసిల్లో అధ్యయనం చేసినట్టు లాన్సెట్ తెలిపింది. ఈ అధ్యయనంలో అంతర్జాతీయ నిపుణులతోపాటు భారత శాస్త్రవేత్తలు పాల్గొన్నట్టు వెల్లడించింది. పది నగరాల్లో పీఎం 2.5 కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రామాణిక పరిమితులను మించిందని నివేదిక వెల్లడించింది. పీఎం 2.5 స్థాయిలు ప్రతి ఘనపు మీటరుకు 10 మైక్రోగ్రాములు పెరిగిన కొద్దీ మరణాలు 1.42 శాతం అధికమైనట్లు అధ్యయనం గుర్తించింది. పది నగరాల డేటాను కలిపినప్పుడు ఈ పరిస్థితి ఉందని వెల్లడించింది. అయితే.. వేర్వేరుగా గమనిస్తే నగరాల మధ్య వ్యత్యాసం భారీగానే ఉందని నివేదిక స్పష్టం చేసింది. పీఎం 2.5 రేణువులు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాలు ఢిల్లీలో 0.31 శాతం, బెంగళూరులో 3.06 శాతం మేర పెరిగినట్లు వెల్లడించింది. అయితే.. హైదరాబాద్ విషయాన్ని పరిశీలిస్తే మొత్తం మరణాల్లో 5.6 శాతం కాలుష్యం వల్ల జరిగినవేనని అధ్యయనం తెలిపింది. ఏడాదిలో వాయు కాలుష్యం వల్ల 1,597 మరణాలు సంభవించాయని లాన్సెట్ తన నివేదికలో వెల్లడించింది.

ఆర్టీసీ కండక్టర్‌గా డ్యూటీ చేయలేకపోతున్నా..

- కోరుకున్న ఉద్యోగం రాలేదని యువకుడి మనస్తాపం
- విధుల్లో చేరిన 20 రోజులకే ఆత్మహత్య



చక్రవర్తి(ఫైల్)

కనగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం చేయడం ఇష్టం లేక విధుల్లో చేరిన 20రోజులకే ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీఎడవల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. 'ఈ ఉద్యోగం నాకు ఇష్టం లేదు.. నేను డ్యూటీ చేయలేకపోతున్నాను' అని విధుల్లో చేరినప్పటి నుంచీ ఫోన్ చేసి చెప్పేవాడంటూ ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని జీఎడవల్లికి చెందిన నీలకంఠం వెంకటేశం ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ 2018లో కంటి చూపు తగ్గిన కారణంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందాడు. ఆయన స్థానంలో పెద్ద కుమారుడు నీలకంఠం చక్రవర్తి(25) యాదగిరిగుట్ట డిపోలో ఈనెల 2న కండక్టర్‌గా చేరాడు. డిగ్రీ చదివిన చక్రవర్తికి పెళ్లి కాలేదు. రెండో కుమారుడు సురేశ్ కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. తాను కోరుకున్న కానిస్టేబుల్ ఉద్యోగం రాకపోవడంతో నిరాశగా ఉన్న చక్రవర్తి తప్పని పరిస్థితుల్లో యాదగిరిగుట్ట డిపోలో కండక్టర్‌గా చేరాడు. సోమవారం ఉదయం 11గంటలకు డ్యూటీని ముగించుకుని ఇంటికొచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసిన చక్రవర్తి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకుంటానని తల్లి నాగమణికి చెప్పి బయటికెళ్లాడు. రాత్రి 8 గంటలు దాటినా చక్రవర్తి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ అని రావడంతో అనుమానించిన చక్రవర్తి తమ్ముడు సురేశ్.. స్నేహితులతో కలిసి ఆచూకీ కోసం గ్రామంలో వెతికాడు. గ్రామ శివారులోని వారి పొలం వద్దే చక్రవర్తి మృతదేహం కనిపించింది. మృతదేహం పక్కన కూల్‌డ్రింక్ బాటిల్ ఉండటం.. పక్కన వాంతులు చేసుకున్నట్లు ఆనవాళ్లు లభించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు.

సర్కారుకు ఉద్యోగుల ఐకాస అల్టిమేటం

(మొదటి పేజీ తరువాయి)

మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు నేతృత్వంలోని ఐకాస ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. సుమారు 10 లక్షల మంది ఉద్యోగులను కలిగి ఉన్న తమ సంఘం పది నెలలుగా డిమాండ్లను పరిష్కరించాలని కోరినా స్పందించలేదంటూ శుక్రవారం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. తమ డిమాండ్లపై 21లోపు ప్రకటన చేయకపోతే 22న ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామనీ అల్టిమేటం జారీ చేసింది. అన్నట్లుగానే ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. అక్టోబరు 23 నుంచి 30 వరకు 33 జిల్లాల్లో తెలంగాణ ఉద్యోగుల ఐకాస కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపింది. అక్టోబరు 28న రాష్ట్ర ఐకాస ఆధ్వర్యంలో సీఎస్, ముఖ్యమంత్రికి కార్యాచరణ లేఖలు అందిస్తామని, నవంబరు 2న అన్ని జిల్లాల ఐకాసల ఆధ్వర్యంలో భారీ ర్యాలీల ద్వారా కలెక్టర్లకు లేఖలను అందజేస్తామని వివరించింది. నవంబరు 4, 5 తేదీల్లో ర్యాలీల ద్వారా ఆయా జిల్లాల్లో ఉండే ప్రజాప్రతినిధులకు లేఖలు అందజేస్తామని, 6న ఐకాస రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని తెలిపింది.

ఆరు డిమాండ్లపై పట్టు


మొత్తం 50 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టిన ఐకాస ఆరు డిమాండ్లను ముఖ్యంగా పరిగణనలోకి తీసుకోవాలని మంగళవారం జరిగిన సమావేశంలో తీర్మానించింది. వాటిలో మొదటిది 5 డీఏల విడుదల, బకాయిలను నగదు రూపంలో చెల్లించడం, రెండోది.. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఈ-కుబేర్ వ్యవస్థ రద్దు, మూడోది.. ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు, 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్‌సీ అమలు, నాలుగోది.. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఐదోది.. సీపీఎస్ రద్దు, పాత పింఛను విధానం అమలు, ఆరోది.. జీవో 317ను సమీక్షించి, ఉద్యోగుల ఫిర్యాదులన్నీ పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడం.

పది జిల్లాల్లో సభలు

నవంబరు 7 నుంచి డిసెంబరు 27 వరకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 10 జిల్లాల్లో ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన సదస్సులు నిర్వహిస్తారు. నవంబరు 7న కరీంనగర్, 14న ఖమ్మం, 19న వరంగల్, 26న మహబూబ్‌నగర్, డిసెంబరు 3న నల్గొండ, 10న సంగారెడ్డి, 16వ తేదీన ఆదిలాబాద్, 21న నిజామాబాద్, 27న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సమావేశం జరుగుతుంది. జనవరి 3 నుంచి 4 వరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారు. భోజన విరామ సమయంలో నిరసన, ప్రదర్శనలు చేపడతారు. జనవరి 21న రాష్ట్రవ్యాప్తంగా మౌన ప్రదర్శనలు, 23న అన్ని జిల్లాల్లో బైక్ ర్యాలీలు, 30న రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు ఏర్పాటు చేసి నిరసన తెలిపేలా కార్యాచరణ రూపొందించారు.

డ్రోన్ క్యాపిటల్‌గా అమరావతి

ఏపీలో 15 రోజుల్లో పాలసీ తీసుకువస్తాం.. డ్రోన్ డీరెగ్యులేషన్ సాధిస్తాం: చంద్రబాబు



అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ .. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు తాను ఉండగా సాంకేతికతలో ఇండియాను ఎవరూ తాకలేరని, ఆంధ్రప్రదేశ్‌ను ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం అమరావతి డ్రోన్ సమ్మిట్-2024కు ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. చైనా, జపాన్, యూరోపియన్ దేశాల్లో యువత సంఖ్య తగ్గుతోందన్నారు. భారతదేశంలో యువత గణనీయంగా ఉండటమే ఆర్థికంగా దేశ ఎదుగుదలకు కారణమవుతుందని చెప్పారు. "రాష్ట్రాన్ని భవిష్యత్తు గేమ్ చేంజర్‌గా డ్రోన్‌లు మారుస్తాయి. అమరావతిని డ్రోన్ కేపిటల్‌గా మలుస్తాం. డ్రోన్ సమ్మిట్‌లో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి 15రోజుల్లో డ్రోన్ పాలసీ తీసుకువస్తాం. దీని సేవలు విస్తృతంగా వినియోగించుకునేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అనుసంధానిస్తాం. వ్యవసాయం, మౌలిక సదుపాయలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్యసేవలకు డ్రోన్‌లను వినియోగించుకునేలా పరిశోధనలు సాగాలి" అని సీఎం అన్నారు. కాగా, సాయంత్రం డ్రోన్ షోను వీక్షించటం కోసం వచ్చిన జనంతో కృష్ణానదీ తీరం పులకించింది. ప్రధాన వేదిక పున్నమిఘాట్ కి క్యూకట్టింది. అమరావతి డ్రోన్ ఐదు విభాగాలలో గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. ఆకాశంలో నక్షత్రాలుగా 5,500 డ్రోన్లు పైకి లేచాయి. ఈ డ్రోన్లను సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వీక్షించారు.

డ్రోన్లకు మరిన్ని రెక్కలు..

"రాష్ట్రంలో డ్రోన్ వినియోగాన్ని విస్తృతపరుస్తాం. విద్యా సంస్థలు చదువులతోపాటు ప్రయోగాత్మకంగా సాంకేతిక నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి. వీటి వినియోగం పెరిగితే ధరలు తగ్గుతాయి. సేవల వినియోగం పెరుగుతుంది. డ్రోన్ల ఎగరవేతపై ఆంక్షలు తగ్గించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రయత్నించాలి. ఈ సమ్మిట్ రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా మారుతుంది. డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాలను డ్రోన్ అకాడమీ, తయారీ, పైలట్ శిక్షణా కేంద్రాల కోసం కేటాయిస్తాం" అని చంద్రబాబు అన్నారు.

ఏపీలో వాట్సాప్‌లోనే సర్టిఫికెట్లు

- మంత్రి లోకేశ్ సమక్షంలో మెటాతో ఎంఓయూ

న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కులం, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారానే వాటిని పొందే విధానం ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో అందుబాటులోకి రానుంది. వివిధ రకాల బిల్లులు కూడా వాట్సాప్ ద్వారానే చెల్లించవచ్చు. ప్రజలకు ప్రభుత్వం నుంచి పౌర సేవలు వాట్సాప్ బిజినెస్ ద్వారా అందించేందుకు ఈ మేరకు మెటా అంగీకరించింది. రాష్ట్ర ఐటీ, విద్య, ఆర్టీజీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మెటా ఈదిశగా నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఢిల్లీలోని వన్ జన్‌పథ్‌లో మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మెటా ఇండియా ప్రతినిధులు, ఏపీ అధికారులు ఎంఓయూ చేసుకున్నారు.

కులం, మతం వివరాలు ఇవ్వకపోయినా
బడిలో ప్రవేశాలు: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రవేశాలు, టీసీ, ఎస్‌ఎస్‌సీ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ ఫాంలు, ఇతర ప్రభుత్వ దరఖాస్తుల్లో కులం, మతం వివరాలు అడిగిన చోట 'నో రిలీజియన్.. నో క్యాస్ట్' అని రాయవచ్చునని.. కులం, మతం వివరాలు ఇవ్వకపోయినంత మాత్రాన స్కూల్ అడ్మిషన్ తిరస్కరణకు గురికాబోదని హైకోర్టు స్పష్టం చేసింది. 'నో రిలీజియన్.. నో క్యాస్ట్' అని రాయవచ్చునని పాఠశాల విద్యాశాఖ పేర్కొంటున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పింది. జనన, మరణాలు, పాఠశాల అడ్మిషన్లు తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన దరఖాస్తుల్లో 'నో రిలీజియన్.. నో క్యాస్ట్' కాలం ఉండేలా ఆదేశాలివ్వాలని జర్నలిస్టు డీవీ రామకృష్ణారావు, ప్రభుత్వ ఉద్యోగి సలాడి క్లారెన్స్ 2017లో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం
Email: knrcmnr@rediffmail.com
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నం. E1/DB/MCK/8201/190/2024-25 తేది: 21.10.2024
8 నం.ల పనులు – MCK పరిధిలో దీపావళి పండుగ 2024 మరియు ఆల్ సోల్స్ డే కోసం తాత్కాలిక ఏర్పాట్లు. అంచనా వ్యయం: రూ.11.40 లక్షలు MGF క్రింద. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 22.10.2024 సా.04.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 24.10.2024 సా.04.00 గం. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- కమీషనర్, కరీంనగర్ నగర పాలక సంస్థ
DIPR RO No.5663-PP/CL/ADVT/1/2024-25, తేది: 22.10.2024

PROFESSOR JAYASHANKAR TELANGANA AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar: Hyderabad-30 Telangana State, India
ADMISSION NOTIFICATION UNDER SPECIAL QUOTA FOR AY 2024-25
Advt.No.159/Exams/2024(2) Date:22-10-2024
The University has decreased the fee under SPECIAL quota (earlier Self-Financing quota) and increased the intake in this regard,ONLINE applications are invited from eligible candidates for admission into following UG courses under SPECIAL quota for the AY 2024-25.the candidates who have already applied for Combined counselling are all eligible for SPECIAL quota, they need not apply again.

Bi.P.C. Stream Courses	B.Sc. (Hons.) Agriculture, B.Sc. (Hons.) Community Science, B.Tech.(Food Technology)	PJTAU
	B.Sc. (Hons.) Horticulture	SKLTGHU

Online Applications, Prospectus, Instructions, Fee Structure and other details for each course are available on the University website www.pjtsau.edu.in.
DIPR RO No:5700-PP/CL/ADVT/1/2024-25- Date: 22-10-2024 D.SHIVAJI, REGISTRAR

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: 6-3-655/1/ఎ, పౌరసరఫరాల భవన్, సోమాజిగూడ, హైదరాబాద్-82,
డి.ఎస్.చౌహాన్, ఐ.పి.ఎస్., వి.సి. & మేనేజింగ్ డైరెక్టర్
టెండరు ప్రకటన
No.P.Admn.A4/5210/2018, తేది: 22.10.2024 తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయానికి అద్దె వాహనాల సరఫరా కోసం ప్రఖ్యాత ట్రావెల్ ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ 23.10.2024 నుండి ఉ.11.00 కి ప్రారంభమవుతుంది. టెండరు పత్రాల హార్డ్ కాపీల దాఖలు 23.10.2024 ఉ.11.00 నుండి 30.10.2024 సా.05.00 గంటల లోపు చేయవలెను. ప్రీ బిడ్ సమావేశం 26.04.2024న మ.12.00 గం.లకు 6-3-655/1/ఎ, పౌరసరఫరాల భవన్, సోమాజిగూడ, హైదరాబాద్ వద్ద ఆసక్తి గల టెండర్‌దారులతో నిర్వహించబడును. సంప్రదింపు వివరాలు: 7995050706, మరిన్ని వివరాల కోసం https://tscscl.telangana.gov.in మరియు https://tender.telangana.gov.in// కు లాగిన్ చేయండి. సం/- వి.సి. & మేనేజింగ్ డైరెక్టర్ తరఫున
DIPR RO.No.5711-PP/CL/ADVT/1/2024-25, Dt: 22.10.2024

క్యాతన్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయం :: మంచిర్యాల జిల్లా
టెండర్లు కోరుతూ ప్రకటన
No.E1/16/e-Tender/Kytply/2024-25, తేది: 22.10.2024. పట్టణ ప్రగతి గ్రాంట్స్ క్రింద రూ.50.00 లక్షల వ్యయంతో (8) నం.ల పనులు నిర్వహించుట (రీకాల్), SDF గ్రాంట్స్ క్రింద రూ.27.00 లక్షల వ్యయంతో (2) నం.ల పనులు నిర్వహించుట (రీకాల్), SAP గ్రాంట్స్ క్రింద రూ.9.44 లక్షల వ్యయంతో (3) నం.ల పనులు నిర్వహించుట, మునిసిపల్ జనరల్ ఫండ్స్ క్రింద రూ.5.00 లక్షల వ్యయంతో (2) నం.ల పనులు నిర్వహించుటకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం.E1/16/e-Tender/Kytply/2024-25, తేది: 22.10.2024 ప్రకారం తెలిపిన విధంగా అర్హతగల సివిల్ కాంట్రాక్టర్లు మరియు సంస్థల నుండి మునిసిపల్ కమిషనర్, క్యాతన్‌పల్లి, పురపాలక సంఘం వారిచే "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో 24.10.2024 (ఉ.10.30 గం.) నుండి 01.11.2024 (మ.3.30 గం.) మధ్య లభిస్తాయి. ఏవేని తదుపరి వివరాలకు సంప్రదించండి: మునిసిపల్ కమిషనర్/ మునిసిపల్ ఇంజనీర్, క్యాతన్‌పల్లి, ఫోన్ నం: 9121283460/ 9849986750/ 7893683300 (లేదా) వెబ్‌సైట్ www.Telangana e procurement.gov.in దర్శించండి.
సం/- కమిషనర్, క్యాతన్‌పల్లి పురపాలక సంఘం
DIPR RO No.5681-PP/CL/ADVT/1/2024-25, తేది: 22.10.2024

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
Union Bank of India
A Government of India Undertaking
మీ భవిష్యత్తుకు సాధికారత కల్పించుట

దేశ వ్యాప్తంగా బ్యాంకింగ్ నెట్‌వర్క్ కలిగివుండి ముంబయిలో కేంద్ర కార్యాలయం గల అగ్రగామి పిఎస్‌యు బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ క్రింది పోస్ట్ కోసం భారతీయ పౌరుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది:-

హోదా పేరు	మొత్తం ఖాళీలు
లోకల్ బ్యాంక్ ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్‌కి సమానంగా)	1500

అర్హత ప్రామాణికత (వయస్సు, విద్యార్హతలు, ఫీజు, తదితరవి) మరియు ఇతర వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్ www.unionbankofindia.co.in లో నోటిఫికేషన్ ద్వారా లభిస్తున్నాయి.
దరఖాస్తు చేయడానికి ముందు తమ అర్హతను మరియు ఇతర వివరాలను నిర్ధారించుకుంటూ సవివరమైన నోటిఫికేషన్‌ని చదవవలసిందిగా అభ్యర్థులకు సలహా ఇవ్వడమైనది.
ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపేందుకు మరియు ఫీజు చెల్లించేందుకు తేదీ: 24.10.2024 నుంచి 13.11.2024
(టోల్ ఫ్రీ నం.) 1800 208 2244 / 1800 425 1515 / 1800 425 3555 | 9666606060 | www.unionbankofindia.co.in



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సయోధ్య దిశగా...!

ప్రధాని నరేంద్రమోదీ బ్రిక్స్ సదస్సుకు బయలుదేరడానికి ఒక రోజుముందు భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఓ అడుగుపడింది. వాస్తవాధీనరేఖ వద్ద బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరుదేశాలూ ఓ ఒప్పందానికి వచ్చాయని, ఎల్ఏసీ వద్ద మళ్ళీ గస్తీ ఆరంభమవుతుందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. అనేక వారాలుగా రెండుదేశాల మధ్యా జరుగుతున్న చర్చలు ఫలించి ఈ బలగాల ఉపసంహరణ నిర్ణయం జరిగిందని, నాలుగేళ్ళుగా రగులుతున్న సరిహద్దు సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందని అన్నారాయన. దౌత్య, సైనికమార్గాల్లో రెండుదేశాల మధ్యా చర్చోపచర్చలు జరిగాయని, ఒప్పందం నిజమేనని చైనా మంగళవారం ధ్రువీకరించింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో భారత ప్రధాని భేటీకి ఈ పరిణామం వీలు కల్పిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం.

సరిహద్దుల్లో తిరిగి ప్రశాంతత నెలకొంటుందంటే కచ్చితంగా స్వాగతించవలసిందే. 2020 గల్వాన్ లోయ ఘర్షణ రెండుదేశాల మధ్య వైషమ్యాలను పెంచింది. ఘర్షణలో కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు మరణించారు. తుపాకులు, పేలుడు పదార్థాలు ఉపయోగించకూడదని 1996 నాటి ఒప్పందం చెబుతున్నందున, ఇరుదేశాల సైనికులు కర్రలతోనూ, రాళ్ళతోనూ తీవ్రంగా దాడిచేసుకున్నారు. చైనా భారీగా సైనికులను కోల్పోయినప్పటికీ కొన్ని నెలలపాటు ఆ వివరాల జోలికి పోలేదు. చాలాకాలం తరువాత ఐదుగురు చనిపోయినట్టు అంగీకరించినా ఆ సంఖ్య నిజం కాదన్న అనుమానాలున్నాయి. 2021లో ఉత్తర సిక్కింలో, మరుసటి ఏడాది తవాంగ్ సెక్టార్ సరిహద్దుల్లో ఇరుదేశాల సైనికుల మధ్యా ఘర్షణలు జరిగాయి. రెండుదేశాలు అధీనరేఖ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్–చైనా మధ్య దాదాపు మూడున్నరవేల కిలోమీటర్ల అత్యంత కఠినమైన, వివాదాస్పద సరిహద్దు ఉంది. వైషమ్యాలు హెచ్చుతున్న కొద్దీ ఉభయదేశాలు సరిహద్దు వెంబడి రోడ్లు, వంతెనలు నిర్మిస్తూ పోతున్నాయి. చైనా ఏకంగా కొత్త గ్రామాలనే స్థిరపరుస్తోంది.

ఈ నేపథ్యంలో, ఈ కీలకమైన ఒప్పందంతో 2020 పూర్వస్థితికి వెళ్ళాం, బలగాల ఉపసంహరణ కూడా దాదాపుగా ముగిసింది, ఇదొక అద్భుతమైన పరిణామం అని విదేశాంగమంత్రి ఒక చానెల్ చర్చల్లో ఉత్సాహంగా వ్యాఖ్యానించినప్పటికీ, ఒప్పందంలో ఉన్నదేమిటో తెలిస్తే కానీ, అది అద్భుతమో కాదో చెప్పలేమని విపక్షాలు అంటున్నాయి. గల్వాన్ ఘటన జరిగినప్పటి నుంచి విపక్షాలు నరేంద్ర మోదీ ప్రభుత్వంమీద విమర్శలతోపాటు, అనుమానాలు వెలిబుచ్చడం కూడా జరుగుతోంది. చైనా మన భూభాగంలోకి అంగుళం కూడా రాలేదంటూ మోదీ ప్రభుత్వం దబాయిస్తున్న విషయం తెలిసిందే. భారత భూభాగంలోకి ఏ ఒక్కరూ చొరబడలేదు, ఒక్క పోస్టును కూడా చెరబట్టలేదు అని ప్రధాని స్వయంగా చేసిన ప్రకటనతో మనకు జరిగిన అన్యాయం వెనక్కుపోయి, మన వాదన వీగిపోయిందని కాంగ్రెస్ మండిపడుతోంది. చైనా ఎన్ని వీరంగాలు వేసినా, సరిహద్దు వెంబడి అనేక చొరబాట్లకు పాల్పడినా, కొద్దికొద్దిగా మన భూభాగాన్ని మింగివేసినా భారత ప్రభుత్వం దేశప్రజలకు నిజాలు తెలియనివ్వలేదని, చట్టసభల్లో చర్చకు మోకాలడ్డుతూ విపక్షాల నోరుమూయించే ప్రయత్నం చేసిందని దాని విమర్శ.

చైనా చొరబాట్లు, దుందుడుకు వైఖరి కారణంగా ఇప్పటికే మనకు జరిగిన నష్టాన్ని ఈ ఒప్పందం ఏ మేరకు పూడుస్తుందో, దురాక్రమించుకున్న ప్రాంతాల నుంచి అది ఎంతమేరకు వైదొలుగుతున్నదో చూడాలి. అన్ని పాయింట్ల నుంచి చైనా వెనక్కు తగ్గి, గతంలో మనం గస్తీ తిరిగినవన్నీ తిరిగి దక్కడం ముఖ్యం. ఉత్తర లద్దాఖ్‌లోని డెప్సాంగ్, దక్షిణంలోని డెమ్‌చోక్ వంటి ప్రాంతాల్లో పెట్రోలింగ్ హక్కులు వస్తే సైనికపరంగా మనకు ఎంతో ఉపయోగం. కొత్త ఒప్పందంలో భాగంగా కీలకమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ వివరాలను రెండుదేశాలు ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకుంటాయట. త్వరలోనే మరిన్ని వివరాలు తెలియవచ్చునేమో కానీ, ఈ ఒప్పందం కుదిరినంతమాత్రాన రెండుదేశాల మధ్యా సయోధ్య ఏర్పడినట్టు, సత్సంబంధాలు నెలకొన్నట్టూ కాదు. రెండుదేశాల మధ్యా అవిశ్వాసం ఉన్నంతకాలం ఉభయపక్షాలకూ ఏకాభిప్రాయం లేని వేలకిలోమీటర్ల సరిహద్దులో అవసరమైనప్పుడల్లా అగ్గిరాజేయగలిగే అవకాశం ఎప్పుడూ ఉంటుంది.

'మహా' యుద్ధంలో గెలుపు ఎవరిది?



> మహారాష్ట్ర శాసనసభతోపాటు వివిధ రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో పోటీ చేస్తున్న 156 సీట్లతో పాటు ఉపఎన్నికలు జరగనున్న సీట్లలో అత్యధిక సీట్లను, ఓట్ల శాతాన్ని దక్కించుకున్నప్పుడే దేశంలో బీజేపీ హవా తగ్గలేదని చెప్పడానికి ఆస్కారం ఉంటుంది. ఈ కారణంగా ఈ ఎన్నికలపై దేశ ప్రజల దృష్టి కేంద్రీకృతమైంది.

హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత సర్వేలు నిర్వహించేవారు చాలా స్తబ్ధంగా కనపడుతున్నారు. నవంబర్ 20న జరిగే మహారాష్ట్ర ఎన్నికల గురించి అడిగితే చాలా ఆచితూచి స్పందిస్తున్నారు. సర్వేలు నిర్వహించేవారు మాత్రమే కాదు, ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే వారికి కూడా ఏమీ అంతుబట్టడం లేదు. మహారాష్ట్రలో వారు యథా ప్రకారం ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే సాహసం చేస్తారా లేదా అన్నది చెప్పలేం. హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఒక్క సర్వే కానీ, ఎగ్జిట్‌పోల్స్ కానీ వెల్లడించలేదు. అదే విధంగా జమ్ముకశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేసినవారు కూడా నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తుందని ఊహించలేకపోయాయి. ఇప్పుడే కాదు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన 12 సంస్థలు ఎన్డీఏ 400 సీట్లు దాటుతుందని చెప్పి బోల్తా పడ్డాయి. అసలు మన దేశంలో ఎగ్జిట్‌పోల్స్, సర్వే సంస్థలు ఎందుకు విశ్వసనీయత కోల్పోతున్నాయి? గల్లీకొక్కటిగా పుట్టగొడుగుల్లా ఏర్పడిన సంస్థల గురించి పెద్దగా మాట్లాడనక్కర్లేదు కాని ఒకప్పుడు కచ్చితంగా అంచనా వేయగలవని గుర్తింపు తెచ్చుకున్న సంస్థలు కూడా ఎందుకు విఫలమవుతున్నాయి? వాటిలో వృత్తి నైపుణ్యం లోపించిందా? లేదా ఈ సంస్థలు కూడా సోషల్ మీడియా సంస్థల్లాగా గాలివాటంగా జనంలో వినపడుతున్నది బయటకు వదిలేస్తున్నాయా? అన్న అనుమానం వస్తోంది. యూట్యూబ్‌ల్లో సర్వేరాయుళ్లు, ఏదో ఒకటి మాట్లాడే విశ్లేషకులు ఆవిర్భవించాక వారిని కూడా మేనేజ్ చేసే నేతల పీఆర్ బృందాలు బయలుదేరాయి. 'మీరు ఆయనను గొప్ప విశ్లేషకుడు అనుకుంటారు.. ఆయనకు గత ఎన్నికల్లో ఎంత చెల్లించామో తెలుసా?' అని రాష్ట్రంలో ఒక నేతకు పనిచేసిన పీఆర్వో ఒకరు అడిగారు. అందువల్ల మనకు వచ్చే సమాచారం విశ్వసనీయతను గ్రహించడం చాలా కష్టం.

రాజకీయ నాయకులు తమ పార్టీని, అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రైవేట్ సంస్థల్ని నియమించుకుని విజయం కోసం ప్రయత్నించే ప్రక్రియ మన దేశ రాజకీయాల్లో ఆలస్యంగా ప్రవేశించింది. కాని సంస్థల్ని నిర్వహించే వ్యూహకర్తల విశ్వసనీయత కూడా క్రమక్రమంగా తగ్గడం ప్రారంభమైంది. గత ఎన్నికల్లో ఏపీలో వైసీపీ తాను అఖండ విజయం సాధిస్తానని భావించింది. తమ తరఫున వ్యూహరచన చేసిన సంస్థ ప్రతినిధులను వైసీపీ అధినేత ఫలితాలు రాకముందే సత్కరించారు. కాని వైసీపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన ఒక ప్రైవేట్ వ్యూహకర్తకు సలహాదారుగా కేబినెట్ హోదా కూడా కల్పించారు. నేతలు టిక్కెట్ల కోసం ఆయన చుట్టూ తిరిగారు. కాని రాజస్థాన్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఆయన వ్యూహం ఫలించలేదు. సర్వేల ఆధారంగా టిక్కెట్లు పొందినవారు అనేకమంది పరాజయం పాలయ్యారు. ఇందుకు వ్యూహకర్తనే తప్పుపట్టలేం కాని ఇలా ఎందుకు జరుగుతోంది? నిజానికి ఏపీలో ఏ వ్యూహకర్తతో నిమిత్తం లేకుండా ప్రజలు తీర్పు చెప్పారు. తెలంగాణలో కూడా కేసీఆర్ చేసిన తప్పిదాల వల్ల బీఆర్ఎస్ ఓటమి పాలైందని స్పష్టంగా తేలింది కాని ఏ వ్యూహకర్తవల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పలేం. ప్రజలు వ్యూహకర్తలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాలనపై, రాజకీయ పార్టీల తీరుతెన్నులపై ఆధారపడి తీర్పునిస్తారన్న విషయం అనేక సందర్భాల్లో వెల్లడైంది. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ విజయానికి ఏ వ్యూహకర్తా కారణం కాలేదు. 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభంజనానికి కానీ, 2024లో బీజేపీ సీట్లు తగ్గడానికి కూడా పూర్తిగా వ్యూహకర్తలు కారణమని చెప్పలేము. కాకపోతే ఒక పార్టీకి ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉంటే ఆ వాతావరణాన్ని సంఘటితం చేసేందుకు కొన్ని సంస్థలు తోడ్పడవచ్చు కాని ఈ సంస్థలే రాజకీయ పార్టీల తలరాతల్ని నిర్ణయించలేవు. అందువల్ల నేతలు ఎప్పుడూ ప్రజలతో నిత్యసంబంధాలు ఏర్పర్చుకుంటూ, వారి కోసం పనిచేస్తూ ఉండక తప్పదు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో మహారాష్ట్రలో ఏ కూటమి గెలుస్తుంది అన్న విషయంపై అనేకమంది రాజకీయ పరిశీలకుల్లోనే అయోమయం నెలకొన్నది. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లలో కేవలం 9 సీట్లలోనే బీజేపీ విజయం సాధిస్తే ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 7, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి ఒక సీటు లభించాయి. మరో వైపు కాంగ్రెస్‌కు 12, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేనకు 9, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి 8 సీట్లు లభించాయి. ఉత్తరప్రదేశ్‌లో మాదిరి మహారాష్ట్రలో కూడా మోదీ ప్రభంజనం అంతగా పనిచేయలేదు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఈ ఎన్నికల్లో 12 సీట్లు కోల్పోయింది. దేశంలో రెండుసార్లు బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించిన సందర్భాల్లో కూడా మోదీ మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం రాకుండా చేయలేకపోయారు. 1995 నుంచి దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే కొనసాగుతున్నాయి. కేవలం ఒకే ఒక్కసారి బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. రెండోసారి దొడ్డిదారిన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించి ఐదు రోజుల్లోనే ఇంటి దారి పట్టింది. ఆ తర్వాత శివసేనను, ఎన్‌సీపీని చీల్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినా అధికారం మాత్రం శివసేన చీలిక వర్గానికి చెందిన ఏకనాథ్ షిండేకు అప్పగించక తప్పలేదు. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన దేవేంద్రనాథ్ ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి పదవితో సంతృప్తిపడాల్సి వచ్చింది. ఇప్పుడైనా ఒకవేళ బీజేపీ అత్యధిక సీట్లు సాధించి గెలిచినా మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలదా? లేదా ఏక్‌నాథ్ షిండేకే మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించక తప్పదా?

లోక్‌సభ ఎన్నికల ఫలితాల తీరు తెన్నులను బట్టి చూస్తే షిండే ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతితో పోలిస్తే ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అగాడి బలంగా ఉన్నదని చెప్పవచ్చు. శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చిన తీరు, ప్రతిపక్షాలపై ఈడీ, ఆదాయపు పన్ను కేసులు మోపిన తీరు పట్ల జనం తమ వ్యతిరేకతను లోక్‌సభ ఎన్నికల్లో ప్రదర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగంతో పాటు వ్యవసాయ సంక్షోభం, మంచి నీటి కొరత, మరాఠా కోటా, ధారవి మురికివాడల అభివృద్ధి పథకం వంటి స్థానిక సమస్యలు అనేకం ఉన్నాయి.

కాని హరియాణాలో అనూహ్యంగా బీజేపీ గెలిచిన తర్వాత మహారాష్ట్ర గురించి ఇదమిత్థంగా చెప్పేందుకు అనేకమంది పరిశీలకులు వెనుకాడుతున్నారు. హరియాణాలో మాదిరి కాంగ్రెస్ విజయావకాశాలు చేజార్చుకోవడం, శివసేనతో సీట్ల ఒప్పందం తేలకపోవడం, ముఖ్యమంత్రి సీటు కోసం కాంగ్రెస్ నేతలు పోటీ పడడం మొదలైనవి కాంగ్రెస్‌కు ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గం స్థానిక కాంగ్రెస్ నేతలతో కాకుండా ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో చర్చలు జరుపుతోంది.

మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు మహాయుతి కూటమి వరాల వర్షం కురిపిస్తోంది. ఉచితాలను వ్యతిరేకిస్తూ మోదీ అనేక ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ దేశ వాణిజ్య రాజధాని అయిన మహారాష్ట్రలో అధికారం కైవసం చేసుకునేందుకు బీజేపీ రాజీపడక తప్పడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండగానే తేలికపాటి మోటార్ వెహికల్స్‌కు టోల్ రాయితీతో పాటు దాదాపు 1500 నిర్ణయాల అమలు ప్రారంభించింది. అన్నిటి కన్నా ముఖ్యమైనది రూ. 46వేల కోట్ల లడ్కీ బహనా యోజన. ఈ పథకం క్రింద మహారాష్ట్రలోని 4.5 కోట్ల మంది మహిళల్లో 2.5 కోట్ల మందికి నెలకు రూ. 1500 చొప్పున చెల్లిస్తారు. ఇప్పటికే మహిళలకు రూ. 7500 చొప్పున అయిదు నెలల అడ్వాన్స్‌ను వారి ఖాతాల్లో జమ చేశారు. దీన్నే 'గేమ్ ఛేంజర్'గా పరిశీలకులు భావిస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలు వల్ల ఏక్‌నాథ్ షిండే సర్కార్‌పై ప్రజల్లో సానుకూలత ఏర్పడిందని తాజాగా లోక్‌నీతి–సిఎస్‌డిఎస్–తదితర సంస్థలు నిర్వహించిన సర్వేలో తేలింది. అయితే ఎన్నికల్లో ఏ కూటమి గెలుస్తుందో మాత్రం ఈ సంస్థలు తేల్చలేదు.

హరియాణా ఎన్నికల ఫలితాల వల్ల కాంగ్రెస్ శిబిరంలో ఆత్మవిశ్వాసం తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించినప్పటికీ హరియాణాలో ముఖాముఖి పోటీలో బీజేపీకి వ్యతిరేకంగా పోటీ చేసిన సీట్లలో ఓడిపోవడం వల్ల మిత్రపక్షాల్లో ఆ పార్టీ విలువ తగ్గిపోయింది. అందువల్ల ఉద్ధవ్ థాక్రే శివసేనతో సీట్ల విషయంలో కాంగ్రెస్ ధైర్యంగా బేరసారాలు జరుపలేకపోతోంది. అయితే అదే సమయంలో హరియాణా ఎన్నికలు ఒకరకంగా కాంగ్రెస్‌కు, మిత్రపక్షాలకు గుణపాఠం నేర్పాయనే చెప్పవచ్చు. ఐకమత్యంతో పనిచేస్తేనే మోదీని ఢీకొనగలమని వారికి అర్థమయ్యే ఉంటుంది. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఒంటరిగా కాక ఇతర పార్టీలతో కలిసి పనిచేయడం వల్ల హరియాణా ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయని చెప్పలేం.

కేవలం 90 సీట్లున్న హరియాణాలో బీజేపీ గెలవడం ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల తర్వాత నైతిక స్ఫూర్తిని ఇచ్చి ఉండవచ్చు కాని ఒక శాతం కంటే ఎక్కువ ఓట్లతో మాత్రమే అక్కడ బీజేపీ అధికారం చేజిక్కించుకుంది. అంతే కాదు, మహారాష్ట్రతో పాటు 48 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో యూపీలోని 9, రాజస్థాన్‌లోని 7 సీట్లు బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైనవి. అందువల్ల మహారాష్ట్రలో పోటీ చేస్తున్న 156 సీట్లతో పాటు ఉపఎన్నికలు జరుగుతున్న సీట్లలో అత్యధిక సీట్లను, ఓట్ల శాతాన్ని దక్కించుకున్నప్పుడే దేశంలో బీజేపీ హవా తగ్గలేదని చెప్పడానికి ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ ఎన్నికలపై దేశం దృష్టి కేంద్రీకృతమైంది. దేశమంతటా ప్రతి ఏడాదీ ఎన్నికల వాతావరణం ఏర్పడడం ఒకరకంగా మంచిదే. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తన గ్రాఫ్ పడిపోతుందో లేదో ఎప్పటికప్పుడు తేల్చుకోవడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'హైడ్రా'పై రాజకీయ కుట్రలు మానండి!

ఆంధ్ర తెలంగాణ కలిసిన తర్వాత అందరి దృష్టి హైదరాబాద్ మీద పడింది. అంచనాకు మించిన జనం, కంపెనీలు వేగంగా తరలిరావడంతో దాని ప్రభావం మూసీ నది మీద పడింది. 1990 నాటికి మూసీలోకి మానవ వ్యర్థాలు, ఫ్యాక్టరీ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు కలగలిసి వచ్చి మూసీ కాలుష్య కాసారంగా మారింది. అప్పటికే ప్రధాన జలాశయాలుగా ఉన్న ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సరస్సులను ఈ కాలుష్య కోరల నుంచి కాపాడాలన్న ప్రధాన లక్ష్యంతో నాటి పాలకులు 1996లో జీవో నెంబర్ 111 తీసుకొచ్చారు. ఈ జీవో ప్రకారం ఈ రెండు సరస్సుల చుట్టూ 10కిమీ మేర అంటే దాదాపు 1,30,000 ఎకరాల భూమి కలిగిన 84 గ్రామాలలో ఆంక్షలు విధించబడ్డాయి. వీటి ప్రకారం– వ్యవసాయ భూముల్ని పారిశ్రామీకరించడానికి వీలులేదు; భారీ కాలుష్యకారక పరిశ్రమలు, పెద్ద పెద్ద హోటళ్లు, విశాల నివాస స్థలాలు, భారీ వినోద కేంద్రాలు నిర్మించకూడదు. నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో చిక్కి, ధనార్జనే పరమావధిగా భావించి జీవో నెంబర్ 111 ఎత్తివేసింది. దీంతోటే అభివృద్ధికి బాటలు పడ్డాయని అబద్ధపు ఢంకా మోగించి ప్రజల కళ్లల్లో మరింత మురికి మట్టిని కొట్టింది.



> దాదాపు పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ నాయకులు నాడు మూసీ ప్రక్షాళనపై కల్లబొల్లి మాటలతో మభ్య పెట్టారు. కనీసం ఒక్క అడుగు కూడా కార్యరూపం దాల్చలేదు. ఒక సంవత్సరం కూడా నిండని రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం వేగంగా అడుగులేస్తుంటే ఇప్పుడు వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించిన విలాసరాయుళ్లు ఇప్పుడు కన్నీళ్లు మింగుతున్నారు.

నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం దగ్గరికి పర్మిషన్ల కోసం వినతులు, అలాగే పర్మిషన్లు వద్దని ప్రజల నుంచి నిరసనలు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై దృష్టి సారించారు. సుందరమైన హైదరాబాద్ కల నిజం కావాలంటే మూసీ నది ప్రక్షాళన జరగాలని, దానికోసం 111 లాంటి జీవోనే ఉండాలని, అప్పుడే అందమైన ఆరోగ్యకరమైన భవిష్యత్ హైదరాబాద్ సాధ్యమవుతుందని అంచనాకి వచ్చారు. ఈ ఆలోచనల పరంపర నుంచే హైడ్రా ఉద్భవించింది.

అభివృద్ధి వైపు వేగంగా పరుగులు పెట్టించే గొప్ప వ్యూహంగా మూసీ ప్రక్షాళన కోసం హైడ్రాను ఏర్పాటు చేశారు. రూ. 1,50,000కోట్ల అంచనా వ్యయంతో, కేవలం 36 నెలల్లోనే మూసీ ప్రాజెక్టును పునర్నిర్మించి సుందరీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో కొనసాగుతున్నారు. నది పొడవునా వాణిజ్య, వినోద, పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించనున్నారు. ఈ గొప్ప కార్యం కోసం ప్రత్యేక కమిషన్‌ను తయారు చేశారు. దీనికి చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. సభ్యులుగా ఉమ్మడి రంగారెడ్డి–హైదరాబాద్ జిల్లాల మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్ఎంసీ మేయర్‌లు ఉంటారు. ఇట్లా పటిష్ఠమైన నిర్మాణం, స్పష్టమైన లక్ష్యంతో హైడ్రా ముందుకు సాగుతున్నది.

దాదాపు పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ నాయకులు నాడు మూసీ ప్రక్షాళనపై కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టారు. కనీసం ఒక్క అడుగు కూడా కార్యరూపం దాల్చలేదు. ఒక సంవత్సరం కూడా నిండని రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం వేగంగా అడుగులేస్తుంటే ఇప్పుడు వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించిన విలాసరాయుళ్లు ఇప్పుడు కన్నీళ్లు మింగుతున్నారు. జన్వాడ ఫామ్ తమది కాదని, అది లీజు మాత్రమే అని తేలు కుట్టిన దొంగల్లాగా కొత్త రాగం అందుకుంటున్నారు. మరో బీఆర్ఎస్ నేత తన చుట్టూ ఉన్న చెరువు ఆక్రమించుకొని ఇంజనీరింగ్ కాలేజీ కట్టాడు. అనంతరం దానిని యూనివర్సిటీగా కూడా మార్చాడు. ఇప్పుడు కోర్టుకెళ్లి 'నా యూనివర్సిటీని కాపాడండి మహాప్రభో' అని పొర్లు దండాలు పెడుతున్నాడు. మరొక నేత అక్షర జ్ఞానం లేకున్నా భూకబ్జాలలో ఘనాపాటి. ఆయన తన 'మెడికల్ కాలేజ్‌ను ఇప్పుడే కూల్చవద్దు, కాస్త సమయం ఇవ్వండి' అంటూ గగ్గోలు పెడుతున్నాడు. ఇంకా మిగతా నేతల వివరాల్లోకి వెళ్తే ఇక్కడ చాట భారతం అవుతుంది. ఆక్రమించుకున్న కోట్ల విలువ చేసే భూములు తమవి కాకుండా పోతున్నవనే సరికి సినీ ప్రముఖులు, పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, బీఆర్ఎస్ నేతలు ఒకే జట్టుకట్టి ప్రభుత్వం పైన దుమ్మెత్తిపోసే కుట్రకు తెరతీశారు. వీరికి ఇప్పుడు పేదలపై విపరీతమైన ప్రేమానురాగాలు వస్తున్నాయి. అరవై గజాలకు మించని జాగాలో ఈగలూ దోమల బాధతో, రోగాలతో చెత్తాచెదారం మధ్యన, మూసీ మురుగు ప్రక్కన బతుకుతున్న వీరి కనీస అవసరాలు ఇన్నాళ్లూ ఏ మాత్రం పట్టించుకోని వాళ్లు, వీరికై పక్కా ఆవాసాలు నిర్మించని వాళ్లు ఇప్పుడు పేదలకు న్యాయం చేయాలంటూ సరికొత్త నాటకానికి శ్రీకారం చుట్టారు. హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్ భూమిని గుర్తించి అక్కడ ఎఫ్‌టీఎల్ అని రాస్తే ఆ స్థానంలో కేసీఆర్ అని రాసుకోవాలని ప్రజలను రెచ్చగొట్టి కేసులపాలు చేయచూస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిమంది కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ప్రతిపక్షాలతో కుమ్మక్కై ప్రభుత్వానికి నష్టం చేయ చూశారు. హైడ్రా పనులకు విఘాతం కలిగిస్తున్నప్పుడు ప్రభుత్వం వారిపైన కూడా కేసులను నమోదు చేయించి తన నిష్పక్షపాతాన్ని చాటుకుంది.

హైదరాబాద్ సుందరీకరణ అభివృద్ధిని, మూసీ మురుగు కాలువ జీవితాలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు వారి గురించి మాట్లాడే నైతికత ఉందా అనేది బుద్ధిజీవుల నుంచి ఉద్భవిస్తున్న ప్రశ్న. పేదల విషయంలో రేవంత్‌రెడ్డి గారి మాటలు "ఇళ్ళు పోగొట్టుకున్న పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు అందజేస్తాం. దాంతోపాటు కొంత ఆర్థిక సాయం కూడా అందిస్తాం" అన్నవి స్పష్టంగానే ఉన్నాయి.

చివరిగా ఒక్క విషయాన్ని తప్పక చర్చించి తీరాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ సంబంధిత సాగునీరు ప్రధానంగా మూసీపైనే ఆధారపడి ఉంది. హైదరాబాద్ నుంచి వచ్చే మురుగు పెరగడం వలన ఉమ్మడి నల్లగొండ పొడవునా ఉన్న మూసీ కూడా కాలుష్యమైంది. బోర్లు, కాలువలు, చెరువుల ద్వారా వచ్చే సాగునీరు కలుషితం కావడం వల్ల పంట దిగుబడి సమృద్ధిగా లేదు. పైగా విషతుల్యమైన నీటి ద్వారా వచ్చే పంట కూడా విషతుల్యమవుతుందనే వాదన సహేతుకమైనది. ఇది కేవలం నల్లగొండకే పరిమితం కాదు, హైదరాబాద్ మూసీ పరివాహక ప్రాంతంలో కూడా అనేక పంటలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ కలుషిత నీళ్లతో పండిన ఆహారాన్ని తినడం ద్వారా జరిగే ఇబ్బందులను ఊహించలేం. మూసీ సుందరీకరణ కోసమే కాదు, మానవ మనుగడ కోసం సైతం జరుగుతున్న మహా యజ్ఞం–ఈ హైడ్రా. ఎలాంటి కుటిల రాజకీయాలు లేకుండా ఈ మహా యజ్ఞంలో అందరూ పాలుపంచుకోవాలి.

● చనగాని దయాకర్
టీపీసీసీ ప్రతినిధి

కొత్త విద్యావెలుగులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో ఎప్పుడు లేని విధంగా కేవలం 70 రోజుల్లోనే కొత్త టీచర్ల నియామక ప్రక్రియ పూర్తిచేసి అటు నిరుద్యోగుల కుటుంబాల్లో ఇటు ప్రభుత్వ బడుల్లో అభ్యసించే విద్యార్థుల భవిష్యత్‌కి కొత్త వెలుగులు తీసుకువచ్చింది. 11,062 కొత్త టీచర్లతో కలిపి రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల టీచర్ల ప్రమోషన్స్ ద్వారా ఏర్పడిన ఖాళీలు, ఉద్యోగ విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలు కలిపి మరొక 15 వేల ఖాళీలు ఉన్నాయి. గత ఆగస్టులో అసెంబ్లీలో వెల్లడించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి లేదా మార్చిలో మరొక డీఎస్సీ జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 6 వేల ఖాళీలతో నోటిఫికేషన్ జారీ చేస్తామని ఉపముఖ్యమంత్రి కూడా వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత 10 సంవత్సరాల్లో ఒకే ఒక్క డీఎస్సీ 2017 (టీఆర్టీ) ద్వారా 8,792 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి అందులో 8 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారు. ఆ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు వందలసార్లు ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. చివరకు సుప్రీంకోర్టులో డి.ఎడ్, బి.ఎడ్ అభ్యర్థుల సంఘం పిటిషన్ దాఖలు చేస్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తేనే అప్పటి ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత అభ్యర్థులు 2021 నుండి అనేక ఆందోళనలు చేస్తే అసెంబ్లీ ఎన్నికల ముందు 5,089 అరకొర పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అభ్యర్థులు ఒత్తిడి చేయగానే లోక్‌సభ ఎన్నికల ముందు పాత నోటిఫికేషన్ రద్దు చేసి 11,062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహించి ఫలితాల వెల్లడి నియామక ప్రక్రియ రికార్డ్ సమయంలో పూర్తి చేసి నిరుద్యోగ కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారు. మరొక వెయ్యి పోస్టులకు నియమాక ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

– రావుల రామ్మోహన్ రెడ్డి

మూసీ నదిపై రచనల ఆహ్వానం

మూసీ నదిపై త్వరలో 'చంద్రికా గ్రంథ మండలి' ఒక పుస్తకాన్ని ప్రచురించనున్నది. విశ్వనగరమైన హైదరాబాద్‌లో ప్రవహించే మూసీ నది సుందరీకరణ, మూసీ ప్రక్షాళన, మూసీ పునరుజ్జీవం అంశాలపై వాద ప్రతివాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాం. దీని కోసం మూసీ నదిపై కవిత, కథ, పద్యం, గేయం, పాట... ఇలా ఏదైనా సాహిత్య ప్రక్రియలో రచన చేసి అక్టోబర్ 30లోపు cgmts2017@gmail.comకు మెయిల్ చేయాలి. వివరాలకు: 92908 26988

– ఎస్. విజయ భాస్కర్, అధ్యక్షులు, చంద్రికా గ్రంథ మండలి

చట్టం మారిస్తేనే ఫిరాయింపులు ఆగేది!

దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సుస్థిరత కోసం, ప్రజాస్వామ్య సంస్థల శ్రేష్ఠతను కాపాడేందుకుగాను పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించారు. 1985లో ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దీనిపై విస్తృతమైన చర్చ జరుగుతూనే ఉన్నది. ప్రభుత్వాల మనుగడను ప్రశ్నార్థకం చేసే పార్టీ ఫిరాయింపులను అడ్డుకోవటానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. కాలక్రమంలో కొంత మేర ఫిరాయింపులు తగ్గినప్పటికీ అందులో లోపాలు క్రమంగా బయటపడుతున్నాయి. అందుకే ఈ చట్టంలో సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నది.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఈ ఫిరాయింపుల జాడ్యం ఉన్నది. స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా పార్టీ మారటం అనే జాడ్యం వల్ల చాలా ప్రభుత్వాలు కూలిపోయాయి. ఈ ఫిరాయింపులు కేవలం ఎన్నికలపైనే కాకుండా ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిపైనా నైతిక ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ చట్టాని కంటే ముందు చాలా తీవ్రంగా ఫిరాయింపులు జరిగాయి. ఆర్థిక లాభం, పదవుల కోసం ప్రజాప్రతినిధులు పార్టీలు మారేవారు. దీనివల్ల ప్రభుత్వాలు మెజారిటీని కోల్పోయి, ఎన్నికలు జరుగకుండానే కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యేవి. 1960లో హర్యానాలో గయారాం అనే ఎమ్మెల్యే ఒకే రోజులో చాలా పార్టీలు మారటం వల్లనే 'ఆయారాం, గయారాం' అనే పదం స్థిరపడిపోయింది. ఇలాంటి సంఘటనల వల్లనే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అవసరం ఏర్పడింది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కాలంలో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా, 10వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో పొందుపర్చారు. ఈ చట్టం ద్వారా పార్టీ మారిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అవకాశం లభించింది. సభ్యులు పార్టీ విప్ ధిక్కరించినా, స్వచ్ఛందంగా పార్టీని వదిలిపెట్టినా అనర్హతకు గురవుతారు. ఈ చట్ట ముఖ్య ఉద్దేశ్యం సుస్థిర ప్రభుత్వాల ఏర్పాటు, సభ్యులు ఎన్నికైన పార్టీలోనే కొనసాగటం. మొదట్లో పార్టీ ఫిరాయింపులు ఆగినప్పటికీ ఆ తర్వాత ఈ చట్టంలోని లోపాలు బయటపడ్డాయి. అందులో మొదటిది– ఏదైనా పార్టీలో చీలిక వచ్చి మూడో వంతు సభ్యులు పార్టీ మారవచ్చనే నిబంధన. దీన్ని నివారించటానికి రెండింట మూడు వంతుల మంది సభ్యులు అంగీకరిస్తేనే విలీనం జరిగేలా 2003లో 91వ రాజ్యాంగ సవరణ చేశారు. దీనివల్ల తక్కువ మంది సభ్యుల ఫిరాయింపు ఆగిపోయింది.

ఈ చట్టం అమలుపై అనేక విమర్శలు, సవాళ్లు ఎదురయ్యాయి. అందులో ముఖ్యమైనది, స్పీకర్ లేదా సభాధ్యక్షుడు అనర్హతపై నిర్ణయం తీసుకోవటం. లోక్‌సభ లేదా అసెంబ్లీ, రాజ్యసభ లేదా మండలిలో అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం. ఈ బాధ్యతను కొందరు ఆలస్యం చేయటం లేదా దుర్వినియోగం చేయటం వల్ల జవాబుదారీతనం లేకుండా పోయింది. కొన్ని సందర్భాల్లో స్పీకర్ లేదా సభాధ్యక్షులు, సంవత్సరాలు లేదా నెలల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా చట్ట స్ఫూర్తికి తూట్లు పొడిచారు. నిర్ణయంలో ఆలస్యం వల్ల కొందరు పార్టీ మారినా ఎలాంటి అనర్హత, చర్యలు లేకుండా తప్పించుకోలిగారు. సభాధ్యక్షులపై పెట్టిన ఈ బాధ్యతకు ఎలాంటి కాల వ్యవధి లేకపోవటం ఈ చట్టంలో అతిపెద్ద లోపంగా మారింది. మరోవైపు పార్టీ విప్‌లు జారీచేయటంలో ఎలాంటి నిబంధనలు లేకపోవటం సమస్యగా మారింది. విప్‌లు ఆయా పార్టీ ప్రతినిధులకు సభలో జరిగే ఓటింగ్‌లపై క్రమశిక్షణ చర్యలు కీలకమైనవి. కానీ, విప్‌ల జారీ వివాదాస్పదంగా మారి, సభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అడ్డంకులుగా తయారయ్యాయి. స్పీకర్ నిర్ణయం, న్యాయ సమీక్షకు లోబడి ఉన్నప్పటికీ చాలాసార్లు న్యాయస్థానాలు శాసన సంబంధిత విషయాల్లో తలదూర్చేందుకు ఆసక్తి చూపట్లేదు. ఇది అతిపెద్ద ప్రతిబంధకంగా మారింది. అందుకోసమే ఈ చట్టంలో ఉన్న సవాళ్లను తొలగించాలి.

> ఒకే దేశం ఒకే ఎన్నికను జరపాలనుకుంటున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకంటే ముందుగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ సవరణ ద్వారా బలోపేతం చేయాలి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్/ సభాధ్యక్షులకే ఉండాలి. అది కూడా నిర్దిష్ట సమయంలోనే. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో అనర్హత వేటు వేసినప్పుడే సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడి ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.



స్పీకర్ లేదా సభాధ్యక్షులు అనర్హత వేటుపై నిర్ణయం తీసుకోవటానికి సమయాన్ని నిర్దేశించాలి. చట్టంలో నిర్దేశిత సమయాన్ని చేర్చకపోవటం వల్ల అనవసరమైన ఆలస్యం, అధికార దుర్వినియోగం జరుగుతున్నది. తద్వారా ప్రజాప్రతినిధులు తమ పదవుల్లో కొనసాగేందుకు ఆస్కారం ఏర్పడుతున్నది. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకునేలా చట్ట సవరణ చేసి, ఆ బాధ్యతను స్పీకర్లు/ సభాధ్యక్షులపై పెట్టడం వల్ల సమస్యను అధిగమించవచ్చు. ఈ బాధ్యత వల్ల స్పీకర్లు/ సభాధ్యక్షులు నిర్దేశిత సమయంలో నిర్ణయాలు తీసుకొని ప్రజాస్వామిక పద్ధతులను పాటించేలా చేయవచ్చు.


విప్‌ల జారీ పార్టీల అంతర్గత విషయమైనప్పటికీ, సభ్యులకు తగిన విధంగా విప్ జారీ చేశారా లేదా అన్న విషయం వివాదాస్పదమవుతున్నది. విప్‌ల జారీని బహిరంగం చేసి మీడియాలో ప్రచారం చేసేలా చర్యలు తీసుకోవాలి. దీని వల్ల పార్టీ సభ్యులు ఆదేశాలను తగిన విధంగా అర్థం చేసుకొని జవాబుదారీతనంతో మెలిగేలా చట్టం సహకరిస్తుంది. ఏదైనా వివాదం చెలరేగినప్పుడు ప్రజా బాహుళ్యంలోనే తేల్చుకునే అవకాశం ఉంటుంది. పార్టీ ఆదేశాలను సక్రమంగా పాటించేలా సభ్యులకు ఒక దిశా నిర్దేశం వలె పనిచేస్తుంది. కీలక అంశాల్లో పార్టీ నిర్ణయాలు ప్రజలకు అర్థమయ్యేందుకు ఈ సవరణ దోహదపడుతుంది. విప్‌లను ధిక్కరించే సభ్యులు ప్రజల దృష్టిలో పడేలా ఉపయోగపడుతుంది. సభ్యుల్లో క్రమశిక్షణ, శాసనవ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అంతేకాకుండా, భారత ప్రభుత్వం 1990లో దినేశ్ గోస్వామి, 1994లో హాశీం అబ్దుల్ హలీమ్, 1999లో 170వ లా కమిషన్, రాజ్యాంగ సమీక్ష కమిషన్ చేసిన పార్టీ ఫిరాయింపులను నిరోధించటానికి చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎన్నికల పవిత్రతను, ప్రభుత్వాల సుస్థిరతను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంతగానో దోహదపడింది. కానీ, ఈ చట్టం అమలులో ఉన్న లోపాలను నివారించి పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నది. నిర్దేశిత సమయంలో నిర్ణయం తీసుకోవటం, పార్టీ విప్‌లను ప్రజల్లోకి వెలువరించటం లాంటి సవరణలు ఈ చట్టాన్ని బలోపేతం చేస్తాయి.

అయితే ఇక్కడ ఓ చోద్యం చూడండి.. రాజ్యాంగంలో పొందుపర్చిన షెడ్యూల్ 10 ప్రకారం ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్/ సభాధ్యక్షులకే ఉండాలి. కానీ, 2020లో సుప్రీంకోర్టు జస్టిస్ నారీమన్ బెంచ్ కేశం మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ మణిపూర్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఒక తీర్పు నిచ్చింది. ఆ తీర్పులో ఫిరాయించిన వారిపై చర్యలు తీసుకునే అధికారం ఎలక్షన్ కమిషన్‌కు ఉండాలని, లేదా వారిపై ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. చట్టసభలపై ఎలక్షన్ కమిషన్ లేదా, ట్రిబ్యునల్ ఆధిపత్యం చెలాయించడం సరికాదు. అలాచేస్తే ఫిరాయింపుల నిరోధక చట్టం మొత్తానికే నీరుగారిపోయే ప్రమాదం కూడా పొంచి ఉన్నది.

ఒకే దేశం ఒకే ఎన్నికను జరపాలనుకుంటున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకంటే ముందుగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ సవరణ ద్వారా బలోపేతం చేయాలి. దీనివల్ల ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీలు మారకుండా, క్రమశిక్షణతో మెలిగి ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుంది. ప్రధానమంత్రి, లోక్‌సభా నాయకుడు నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చట్ట సవరణ జరిగేలా కృషిచేయాలి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్/ సభాధ్యక్షులకే ఉండాలి. అది కూడా నిర్దిష్ట సమయంలోనే. కాబట్టి నాలుగు వారాల్లోనే ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసినప్పుడే సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడి ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.



■ బోయినపల్లి వినోద్‌కుమార్
మాజీ పార్లమెంట్ సభ్యులు





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- హనుమకొండ జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్, కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్, కలెక్టర్ పి.ప్రావీణ్య వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ (డీఆర్ఎస్‌సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణాల పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. వరంగల్ ఎన్ఐటీతో ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, రోడ్లు, భవనాల శాఖ ఈఈ సురేష్ బాబు, డీసీపీలు రవీందర్, సలీమా, ఏసీపీలు కిశోర్ కుమార్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, సత్యనారాయణతో పాటు ఆర్అండ్‌బీ, పోలీస్, రవాణా, మున్సిపల్, ఆర్టీసీ, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత అధికారులు సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు.



ఖాకీలు కన్నేస్తే!

- ఐదారేళ్లుగా ఆ విభాగంలో తిష్టవేసి మరీ దందా
- రేషన్ బియ్యం, బెల్లం, గుట్కా తదితర అక్రమాలను చక్కబెట్టడంలో దిట్ట
- మాట వినకుంటే అక్రమ కేసుల్లో ఇరికిస్తామంటూ బెదిరింపులు
- పై అధికారుల పేరు చెప్పి.. నెలనెలా రూ.లక్షల్లో వసూళ్లు
- శాఖకు వచ్చే సమాచారాన్ని ముందే అక్రమార్కులకు చేరవేత
- ఇటీవల 12మంది సిబ్బంది బదిలీ అయినా.. వారు మాత్రం సేఫ్

టాస్క్‌ఫోర్సులో 'ఆ నలుగురు' వసూల్ రాజాలు

బిజినెస్ ఏదైనా సరే... ఆ నలుగురు ఖాకీల కన్ను పడిందంటే చాలు. మామూళ్లు ముట్టజెప్పాల్సిందే. అడిగినంత ఇవ్వకున్నా.. ససేమిరా అన్నా.. వేధింపులు, బెదిరింపులు తప్పవు. ఇదీ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు వసూల్ రాజాల తీరు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న నలుగురు కలిసి ఓ గ్యాంగ్‌లా తయారైనట్టు ప్రచారం జరుగుతోంది. రేషన్ బియ్యం, నల్లబెల్లం, నిషేధిత గుట్కా దందా చేస్తున్న వ్యాపారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీళ్ల వ్యవహారాలకు పై స్థాయి అండదండలున్నాయనే ప్రచారంతో సలాం కొట్టేవాళ్లే తప్పితే.. వీరికి అడ్డు చెప్పేవారే లేకుండా పోయారనే చర్చ జరుగుతోంది. అయితే ఇటీవలి బదిలీల్లో వీరికంటే జూనియర్లకు స్థానచలనం జరిగినా.. ఐదారేళ్లుగా తిష్టవేసుకుని ఉన్న వీరు మాత్రం టాస్క్‌ఫోర్సును వీడకపోవడంతో.. వారికి ఏమేరకు పలుకుబడి ఉందో అర్థమవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవున్నాయి. ఏదేమైనా పోలీసు శాఖలో ఎంతో కీలకమైన టాస్క్‌ఫోర్స్ విభాగంలో జరుగుతున్న అక్రమాల తంతు ఆ శాఖ కీర్తిప్రతిష్టలకు భంగం కలిగిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

6

నిర్ణీత ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- అక్యుపెన్సీ భవన అనుమతులకు క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల కోసం నిర్ణీత ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు, భవన నిర్మాణ అనుమతుల కోసం పలువురు దరఖాస్తు చేసిన నేపథ్యంలో మంగళవారం నగరంలోని పలు భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతోకలిసి కొలతలు కొలిచి క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఎక్సైజ్‌కాలనీ, వడ్డేపల్లి, మడికొండ, ఎల్బీనగర్, దేశాయిపేట ప్రాంతాలలో నిర్మాణాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సరైన ధృవపత్రాలు జతచేసిన కట్టడాల కొలతలు సరిపోతే అనుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఏసీపీ ఇర్షాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్ పాల్గొన్నారు.



దేశాయిపేటలో కొలతలతో పరిశీలిస్తున్న కమిషనర్

నకిలీ తుపాకీతో బెదిరింపులు

- మాజీ నక్సలైట్‌ను పట్టుకున్న గ్రామస్థులు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ ఇ.కిషోర్‌కుమార్, (ఇన్‌సెట్‌లో) డమ్మీ ఎయిర్ గన్

దామెర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ తుపాకీ (డమ్మీ ఎయిర్‌గన్)తో బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న మాజీ నక్సలైట్‌ను గ్రామస్థులు పట్టుకోగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండ లం ఊరుగొండలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన రాయల వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి 12 గంటలకు ఊరుగొండలోని కందికొండ సంపత్ కిరాణాషాపునకు వెళ్లాడు. తనకు సిగరేట్ కావాలంటూ అడిగాడు. దీంతో సంపత్ సిగరేట్ ఇచ్చే క్రమంలోనే వెంకటేశ్వర్లు తన జేబులో ఉన్న నకిలీ తుపాకీ తీసి సంపత్‌కు చూపించి తాను మాజీ నక్సలైట్‌ను అని, డబ్బులు కావాలని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని సంపత్ చెప్పడంతో కాళ్లతో తన్ని కింద పడేశాడు. షాపులోని గళ్ల పెట్టెలో ఉన్న రూ.2000 తీసుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే మళ్లీ మధ్య రాత్రి ఎప్పుడైనా వచ్చి చంపేస్తా.. అంటూ బెదిరించాడు. ఈ క్రమంలో షాపు యజమాని సంపత్ వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని అరవడంతో చుట్టు పక్కల వారు వచ్చి నకిలీ తపాకీని లాక్కొని అతడి పట్టుకున్నారు. వెంటనే 100కు డయల్ చేయగా, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడిపై పలు కేసులు : ఏసీపీ

తుపాకీ చూపించి బెదిరించిన రాయల వెంకటేశ్వర్లు మాజీ నక్సలైట్ అని, అతడిపై పలు కేసులు ఉన్నాయని పరకాల ఏసీపీ ఇ.కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం దామెర మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కొంక అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజా ప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పని చేసి, తర్వాత 2007లో అప్పటి ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. ఆ తరువాత డబ్బుల కోసం ఖమ్మం జిల్లాలోని కిరాణా షాపుల వద్ద మాజీ నక్సలైట్‌నని చెప్పి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించినట్టు చెప్పాడు. అక్కడి పోలీస్‌స్టేషన్లలో 10కి పైగా కేసులు నమోదు చేశారన్నారు. ఈ నెల 21న ఊరుగొండ గ్రామ రోడ్డు పక్కన ఉన్న కందికొండ సంపత్ కిరాణా షాపులో చోరీకి పాల్పడ్డాడని ఏసీపీ కిషోర్‌కుమార్ వివరించారు. కిరాణా షాపు యజమాని సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సమావేశంలో పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, పోలీసు సిబ్బంది రాము, సత్యనారాయణ, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహా

వరంగల్ మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) హాస్పిటళ్ల పని తీరు, టీవీవీపీని సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా బలోపేతం చేయడానికి అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన ప్రతిపాదనలపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష నిర్వహించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో క్రిస్టినా జడ్ చొంగ్తూ, హేమంత్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆస్కి కన్సల్టెంట్స్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ.. టీవీవీపీ పరిధిలో ఉన్న జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనే ఎక్కువ మంది రోగులు చికిత్స పొందుతున్నారని, ఈ నేపథ్యంలో ఆయా ఆస్పత్రులలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని కేఎంసీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ, కంటి ఆస్పత్రులపై మంత్రి సమీక్షించారు. త్వరలోనే ఈ ఆస్పత్రులను సందర్శించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ మురళీ, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ షర్మిల పాల్గొన్నారు.

సూచన

బాణసంచా వ్యాపారం భద్రంగా నిర్వహించుకోవాలి

- వ్యాపారులతో వరంగల్ ఏసీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రతా ప్రమాణాలను పాటిస్తూ జాగ్రత్తగా బాణాసంచా వ్యాపారం చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వ్యాపారులకు సూచించారు. దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ కమిషనరేట్ పరిధిలోని బాణాసంచా విక్రయదారులతో మంగళవారం సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అగ్నిమాపక, పోలీసు అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. బాణాసంచా విక్రయాలు జరిపేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. ముందుగా అగ్నిమాపక విభాగం అధికారుల నుంచి ఎన్‌వోసీని పొందాలన్నారు. స్థల యజమాని నుంచి అనుమతితోపాటు ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి, పక్కా భవనాల్లో అయితే భవన ఇరుపక్కల ఇంటి యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. భవనం బ్లూప్రింట్ రూ.800 ప్రభుత్వ బ్యాంకు చలానాతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాణా విక్రయాలు జరిపే ప్రదేశంలో అగ్ని ప్రమాద నివారణకు వినియోగించే ఇసుక, నీరు, ఇతర అగ్ని ప్రమాద నిరోధక సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాపారులు తమ వ్యాపారాన్ని విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని అన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా వ్యాపారం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్‌రెడ్డి, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా , ఆందోళన చేస్తున్న బీసీ సంఘాల నేతలు

జీవో 29ను రద్దు చేయాలి

- బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్
- అంబేద్కర్ సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) 22: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో బీసీలకు అన్యాయం చేసే జీవో 29ను వెంటనే రద్దు చేయాలని బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. బీసీలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గుదిబండగా మారిన జీవో 29ను వెంటనే రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీసీ పొలిటికల్ జాక్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతలు ప్రొఫెసర్ గడ్డం బాస్కర్, డాక్టర్ కాశీప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్, సాయిని నరేందర్ మాట్లాడుతూ.. జీవో 29ను ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 సెలక్షన్ విధానంలో కొత్తగా తీసుకొచ్చిన జీవో 29 వల్ల బీసీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులకు జీవో 29 మరణ శాసనాన్ని లిఖిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలు ఇలాగే కొనసాగితే బీసీలు సంఘటితమై ప్రభుత్వంపై దండెత్తాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీసీసంఘాల నేతలు తాడిశెట్టి క్రాంతికుమార్, పులి రజినీకాంత్ ముదిరాజ్, గంగారపు వేణు, గోలి సుధాకర్, గుళ్లపల్లి చిరంజీవి, యశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా మరమ్మతులేవి..?

- పత్తాలేని పీఆర్ ఏఈ
- ఐనవోలు ఎంపీడీవో కార్యాలయ మరమ్మతు పనులు చేసేదేవరు..?

7











హనుమకొండను స్వచ్ఛ భారత్ జిల్లాగా చేయడమే లక్ష్యం

కె. నాగపద్మజ, డీఆర్‌డీవో హనుమకొండ

ఫేస్‌టు ఫేస్



ఆంధ్రజ్యోతి: గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

డీఆర్‌డీవో: జిల్లాలోని 208 గ్రామపంచాయతీలలో కొత్తగా నిర్మించిన గృహాలను గుర్తించి అర్హులైన వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు అయ్యే విధంగా చూస్తున్నాం. అలాగే కొత్తగా 4954 మరుగుదొడ్లను గుర్తించాం. వాటిని జిల్లా కలెక్టర్ అప్రూవల్ తీసుకుని నిర్ణీత సమయంలోగా పూర్తిచేస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ప్లాస్టిక్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

డీఆర్‌డీవో: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించి స్టీల్ వస్తువులను వాడే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ప్రతీ మండలానికి ఒక ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్ నిర్మించి గ్రామాల్లో వచ్చే ప్లాస్టిక్‌ని రీయూజ్ చేసి రీసేల్ కోసం చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జనసమృద్ధి ప్రాంతాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఆర్‌డీవో: ఇప్పటివరకు మన జిల్లాలో 106 సామాజిక మరుగుదొడ్లు నిర్మించాం. అలాగే ఇప్పుడు ఉన్న పర్యాటక ప్రాంతాలు, జనసమృద్ధి ప్రాంతాలను గుర్తించి అవసరమైన సామాజిక మరుగుదొడ్లను కలెక్టర్ అనుమతితో పూర్తిచేస్తాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల కోసం మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి:

డీఆర్‌డీవో: గ్రామపంచాయతీలలో ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా మొత్తంలో ఇప్పటివరకు ప్రతీ గ్రామపంచాయతీకి 4 కమ్యూనిటీ ఇంకుడు గుంతల చొప్పున 1040 టార్గెట్ ఇచ్చాం. వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తాం.


ఆంధ్రజ్యోతి: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఆర్‌డీవో: అన్ని గ్రామ పంచాయతీలలో వచ్చినటువంటి తడి, పొడి చెత్త సేకరణ చేసి గ్రామాల్లో ఉన్న షెడ్‌లలో తడి చెత్త ద్వారా ఎరువు తయారు చేస్తున్నాం. పొడి చెత్తను రీసేల్ చేస్తున్నాం.

- హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

ఖాకీలు కన్నేస్తే..!

టాస్క్‌ఫోర్సులో 'ఆ నలుగురు' వసూల్ రాజాలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పోలీస్‌శాఖలో అత్యంత కీలకమైంది టాస్క్‌ఫోర్స్ విభాగం. ఈ పేరు వింటేనే అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతుంది. రాష్ట్రంలో 1981 జనవరి 1వ తేదీన పోలీసుశాఖ టాస్క్‌ఫోర్సును ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేసింది. ఆ తరువాత అవసరాల నిమిత్తం ఆయా జిల్లాల్లో, పోలీస్ కమిషరేట్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఎంతో కీలకమైన ఈ విభాగం బెల్లం, మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపుల్లో మద్యం అక్రమ అమ్మకాలు, పేదలకిచ్చే రేషన్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు, నిషేధిత గుట్కా, గంజాయి, డ్రగ్స్ తదితర ఉత్పత్తుల రవాణా, వ్యాపారంపై ఉక్కుపాదం మోపడం లాంటివి చేస్తుంది. రౌడీయిజం, మత విద్వేషాలు రెచ్చకొట్టేవారిపై నిఘా పెడుతుంది. పోలీస్ శాఖకు నిఘా విభాగంతో పాటు స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు అత్యంత కీలకమైనవి. ఇందులో పని చేయడం పోలీసులు చాలా మంది సవాల్‌గా, గర్వంగా భావిస్తుంటారు. అయితే దారి తప్పిన కొందరితో టాస్క్‌ఫోర్సుపై నమ్మకం పోతోందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో టాస్క్‌ఫోర్సు అధికారులు బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపారు. భారీ ఎత్తున మద్యం పట్టుకుని ఎక్సైజ్‌శాఖకు సవాల్ చేశారు.

కాసులిచ్చుకో.. వ్యాపారం చేసుకో..

అక్రమార్కుల వెన్నులో వణకు పుట్టించే టాస్క్‌ఫోర్స్‌లో వసూల్ రాజాలు తమ హవా చాటుతున్నారు. ఏళ్ల తరబడి ఈ విభాగంలో తిష్ట వేసి అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఓ నలుగురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు ఓ ముఠాగా ఏర్పడిన అక్రమ వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. వరంగల్ మహానగర సమీప ప్రాంతాలతో పాటు ఇతర మండలాల్లోని కొన్ని మిల్లులకు రేషన్ బియ్యం చేరుతుండటాన్ని ఖాకీ ముఠా తమకు అనుకూలంగా మలుచుకుని కొన్నేళ్లుగా వసూళ్ల దందాకు పాల్పడుతోందని, ఆ నలుగురిలో ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతాన్ని పంచుకుని వసూళ్లకు దిగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని పది రుపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి, మిల్లర్లకు కిలో రూ.20లకు విక్రయిస్తున్నారని, ఈ రేషన్ బియ్యాన్నే కొందరు మిల్లర్లు రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ చేసి ప్రభుత్వానికి అంటగడుతున్నారనే ప్రచారం ఉంది. భారీ ఎత్తున జరుగుతున్న ఈ రేషన్ దందాపై సదరు ఖాకీలు కన్నేశారు. మిల్లర్లను, అక్రమ రేషన్ బియ్యం వ్యాపారులను బెదిరించి నెల నెల మాముళ్లు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటు రేషన్ బియ్యం వ్యాపారి, ఇటు అక్రమాలకు పాల్పడే మిల్లర్ల నుంచి నెల నెలా రూ.లక్షల్లో వసూళ్లు చేస్తు న్నారనే ప్రచారం జరుగుతుండగా.. బియ్యంతో పాటు నిషేధిత గుట్కా వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లకు దిగుతున్నారని తెలుస్తోంది. వరంగల్ పాత బీట్ బజారు, పోచమ్మమైదాన్, కాశీబుగ్గ, హంటర్‌రోడ్డు, ఉర్సు ప్రాంతాల్లోని గుట్కా వ్యాపారులను కూడా ఈ బ్యాచ్ తమ గుప్పిట్లో పెట్టుకుందనే ప్రచారం జరుగుతోంది. గుట్కా ముఠాతో పాటు బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి సైతం వసూళ్లకు దిగుతున్నారని సమాచారం. నెల నెల ఆ అక్రమ వ్యాపారులే స్వయంగా వచ్చి వీరికి మాముళ్లు అప్పగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకవేళ నెలలో సమయానికి గీతం అందకపోతే దాడులు నిర్వహించటం లేదంటే అక్రమ కేసుల్లో ఇరికిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని సమాచారం.

ముందే సమాచారమిస్తారు..

అక్రమ దందాపై పౌరులు తమకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని, నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ పదే పదే ప్రకటనలు జారీ చేస్తుంది. వీటిపై సమాచారాన్ని సేకరించేందుకు నిఘా టీమ్‌ను సైతం రంగంలోకి దింపుతుంది. అయితే అక్రమాలపై టాస్క్‌ఫోర్సుకు సమాచారం వస్తే.. ముందుగానే అక్రమ వ్యాపారులకు ఈ ఖాకీ బ్యాచ్ చేరవేస్తుందనే చర్చ ఉంది. టాస్క్‌ఫోర్సు బాస్ కంటే ముందే వీరికి ఆయా విభాగాల నుంచి సమాచారం చేరుతోందని, దీంతో టాస్క్‌ఫోర్సు బృందం అక్రమార్కుల అడ్డాకు చేరే వరకే అంతా సెటిల్‌రైట్ చేసుకుంటున్నారనినే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా అవసరమైతే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల నుంచి టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫోన్ చేయించి ఒత్తిళ్లు చేయిస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే తాము దాడులకు వెళ్లే విషయం ఎలా లీక్ అవుతుందా? అనే కోణంలో కూడా ఏసీపీ స్థాయిలో ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇటీవల టాస్క్‌ఫోర్స్ దాడులు కూడా భారీగా తగ్గ టానికి ఈ లీక్‌వీరులే కారణమనే అభిప్రాయాలున్నాయి.

బదిలీల్లోనూ కదలలే..

టాస్క్‌ఫోర్స్‌లో కొంతమంది సిబ్బంది ఏళ్ల తరబడి తిష్ట వేస్తున్నారు. ఈ విభాగంలో 52మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఎవరికి పెద్దగా పని ఉండటం లేదట. దీంతో వారం కిందట సీపీ అంబర్ కిషోర్‌ఝూ టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని సందర్శించి.. ఇంత మంది సిబ్బంది ఉన్నా ఏం పని చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. కొందరు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించినట్టు సమాచారం. సీపీ ఆదేశాలతో 12మందిని ఇతర విభాగాల్లోకి బదిలీ చేయగా.. ఆయా అధికారులు టాస్క్‌ఫోర్సు నుంచి ట్రాఫిక్‌తో పాటు ఇతర విభాగాలకు బదిలీపై వెళ్లారు. అయితే వీరిలో చాలామంది రెండు మూడేళ్ల క్రితమే టాస్క్‌ఫోర్సులో చేరిన వారున్నారని, కానీ ఐదారేళ్లకు పైగా తిష్టవేసిన సిబ్బందికి మాత్రం బదిలీలు జరగలేదనేది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ఆ నలుగురు బదిలీల నుంచి తప్పించుకున్నారనే చర్చ జరుగుతోంది. వీరికి పై స్థాయిలో అండదండలున్నాయన్న అనుమానాలు పోలీసు వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కొందరు సిన్సియర్‌గా పని చేస్తున్నవారు కూడా ఉండగా, ఈ నలుగురితో పాటు మరికొందరు సంపాదించుకునే పనిలోనే ఉన్నారని, ఇప్పటికైనా సీపీ టాస్క్‌ఫోర్సు సిబ్బందిపై ప్రత్యేక దృష్టి పెట్టి, అక్రమ దందాకు చెక్ పడేలా ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శిశు గృహలో అరకొర వసతులు

మహబూబాబాద్ తరలించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

కాళోజీ జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ ప్రత్యేక దత్తత విభాగం అయిన శిశు గృహను మంగళవారం కలెక్టర్ పి.ప్రావీణ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె శిశు గృహలోని వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి, బాలల సంక్షేమ సమితి, బాలల పరిరక్షణ విభాగం, శిశు గృహ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శిశు గృహలో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి వదిలేసిన పిల్లలకు, సరెండర్ చేసిన పిల్లలకు, రక్షణ, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు ఆయా జిల్లాల బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాల మేరకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు సంక్షేమ అధికారి జె.జయంతి కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం 11 మంది పిల్లలు శిశుగృహలో ఆశ్రయం పొందుతున్నారని, ఒకరు దత్తత ప్రక్రియకు ఎంపిక కాగా, మరో ఇద్దరు టైం లైన్‌లో ఉన్నారని, మిగతా వారు రక్షణ, సంరక్షణ అవస రం ఉన్న పిల్లలని తెలిపారు. ప్రస్తుతం ఒకే శిశు గృహలో రెండు యూనిట్లు కొనసాగుతున్నాయని, నిబంధనల ప్రకారం కెపాసిటీ సరిపోదని కలెక్టర్‌కు వివరించారు.



శిశుగృహను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విషయం తెలుసుకున్న కలెక్టర్ హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలను కలిపి హనుమకొండ సెంటర్ పాయింట్‌గా ఒక యూనిట్‌ను, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలను మరో యూనిట్‌గా కలిపి మహబూబాబాద్ జిల్లాను సెంటర్ పాయింట్‌గా చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల గురించి రాష్ట్ర సంచాలకులకు తెలియజేసి నియామక ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మదర్ మిల్క్ బ్యాంకు నుంచి శిశు గృహ పిల్లలకు పాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.లలితాదేవి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ఎస్. ప్రవీణ్‌కుమార్, శిశు గృహ మేనేజర్ దూడం నగేష్ పాల్గొన్నారు.

11 నుంచి దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎక్స్ అభ్యర్థుల పీజీ కోర్సుల అభ్యర్థుల నవంబరు 11 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంహెచ్‌ఆర్ఎం, ఆర్‌డీ తదితర పీజీ కోర్సుల మొదటి ఏడాది ఎక్స్ అభ్యర్థులకు నవంబరు 11, 13, 19, 21, 23 తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే పీజీ కోర్సుల రెండో ఏడాది ఎక్స్ అభ్యర్థుల పరీక్షలు నవంబరు 12, 14, 20, 22, 25 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. మొదటి, రెండో ఏడాది పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

కేయూ క్యాంపస్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నవంబరు 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జల్గాం కేసీబీ నార్త్ మహారాష్ట్రలో జరిగే వెస్ట్ జోన్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు 6గురు కేయూ వలంటీర్ల ఎంపికైనట్లు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మంగళవారం తెలిపారు. జి.వెంకన్న (ఆర్ట్సకళాశాల, సుబేదారి), కోనేటి నాగరాజు (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి, ఖమ్మం), టి.రామ్‌చరణ్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ) టి.అంజలిదేవి(మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), బానోత్ దివ్య (ఎల్‌బీ డిగ్రీ కళాశాల, వరంగల్), బానోతు హిందుప్రియ (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం)లున్నట్లు తెలిపారు. వీరికి కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణలు అభినందనలు తెలిపారు.

ఎంజీఎంలో చోరీ

వరంగల్ మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్ సమీపంలోని బయోమెట్రిక్ డివైజ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం రెండు బయోమెట్రిక్ డివైజ్‌లను ఎత్తుకెళ్లారు. ఎంజీఎంలో పనిచేసే వందలాది మంది ఉద్యోగులు ఈ యంత్రాల ద్వారానే తమ హాజరును నమోదు చేసుకుంటారు. సోమవారం రాత్రి విధులకు హాజరైన ఉద్యోగులు థంబ్ వేసేందుకు వెళ్లగా అపహరణ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. కాగా, ఇంత పెద్ద ఆస్పత్రిలో ఈ ఘటనతో సెక్యూరిటీ వైఫల్యానికి నిదర్శనమని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇక రోగులు వారి సహాయకుల రక్షణ గాలిలో దీపంగా మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎంజీఎం వైద్యాధికారులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనాన్ని నిర్ధారించారు. మట్టెవాడ పోలీసులకు ఆర్ఎంవో ఫిర్యాదు చేశారు. ఔట్‌సోర్సింగ్ సంస్థలకు నోటీసులు ఇచ్చే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది.

కేయూ ప్రాంగణ నియామకాల్లో 10 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 10 మంది హైదరాబాద్‌లోని ట్రాక్ 3డీఏఐ సంస్థలో ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు మంగళవారం ప్రాంగణ నియామకాల్లో విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.7లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. డిసెంబరు నుంచి వీరికి ఇంటర్న్‌షిప్‌కు హాజరు అవుతారని తెలిపారు. జూన్-2025 నుంచి పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో జమల్పూరి అక్షిత, ఉదారి చిన్నారి, సనవోని శృతి, ఎం.చందన, కందుల మేఘన, పసునూటి శ్రీలక్ష్మి, మౌనిక రెడ్డి, వేల్పుల జాహ్నవి, భూక్య షైబు, జన్ను సౌమ్యశ్రీలున్నట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షాలు పరిపాలన భవనంలో పుష్పగుచ్ఛం, ఉద్యోగాల పత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, స్వప్న, వెంకటేశ్, వాణిశ్రీ పాల్గొన్నారు.



WANTED

★ M.Sc (Nursing) and B.Sc(Nursing) Faculty and Full Time Warden (Female) to Work in Rohini College of Nunrsing Attractive Salary. Cell : 9390100859, 7330976O534.

AJW-27711

WANTED

★ ప్రముఖ బార్ & రెస్టారెంట్‌లో పనిచేయుటకు క్యాషియర్స్,-2, మరియు పెట్రోల్ పంపులో పనిచేయుటకు ఫిల్లింగ్ బాయ్స్-2 కావలెను సం॥ప్ర॥ 9849662162, 9121301007

AJM-12431

WANTED

★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సం॥ప్ర॥ 8247771016, 8247771525

AJW-3954

WANTED

★ జేబీఎస్ లైఫ్ హాస్పిటల్, కాకాజీ కాలనీ రోడ్ నెంబర్. 1 లో పని చేయుటకు ఫుల్ టైం మరియు పార్ట్ టైం కొరకు ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, సిస్టర్స్,రిసెప్షనిస్ట్ మరియు స్వీపర్ కావలెను. సం॥ప్ర॥ 9032753764

AJW-199341

WANTED OFFICE STAFF

★ టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు. సిబ్బంది కావలెను. సం॥ప్ర॥ 9618607796, 9393114929 (వాట్సాప్)

AJW-7620

ఆఫీస్ అసిస్టెంట్ కావలెను

★ సెక్యూరిటీ గార్డుగా అనుభవం గల ఆఫీస్ అసిస్టెంట్ వెంటనే కావలెను. (స్వంత వాహనం కలవారు) మరియు సెక్యూరిటీ గార్డ్సు కావలెను. జీతం : 10,000/- to 15,000/- + ESI, EPF సం॥ప్ర॥ 9848022608, 8978459111

AJW-442

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు **రూ. 250/-** మాత్రమే. అదనపు లైనుకు **రూ. 45/-**

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

WANTED

★ గత 10 సం॥లుగా నగరంలో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాచ్‌మెన్-క్లీనర్‌గా పనిచేయుటకు భార్యాభర్తలు కావలెను. (నివాస వసతి కలదు) మగవారికి బైక్ డ్రైవింగ్ వచ్చి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలెను. అడ్రస్ : VJL IT AUGMENTS PVT.,LTD. సంతోషిమాత గుడి వెనుక, హంటర్ రోడ్, వరంగల్. సెల్ : 9849404363

AJW-199376

PLOT FOR SALE

★ KLN Reddy Colony DCB Bank ప్రక్కన గల 50 Feet రోడ్ Taching లో 600Yards, Commercial Plot అమ్మకానికి కలదు జెన్యూన్ Parties Can Contact : 9959710075.

AJ W-199342

HOUSE FOR SALE

★ KU'X' రోడ్ Dream Land ఫంక్షన్ హాల్ ఎదురుగ అక్షర కాలనీలో 200 చ॥గ॥ లో నూతనంగా నిర్మించబడుతున్న G+2 అన్ని వసతులు గల ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును సం॥ప్ర॥ 9849007864

AJW-199344

CHANGE OF NAME

★ I, HASHMI Also Known As AKBER MOHAMMED ABDULLAH (Old Name), H.No : 2-4-707, Ram Nagar, Hanumakonda, T.G. Have Changed My Name From HASHMI also Known as AKBER MOHAMMED ABDULLAH to ABDULLAH HASHMI MOHAMMAD (New Name). S/o. AFZAL MOHAMMAD in all My Records

AJW-199381

రామభద్ర వాటర్ ప్రూఫింగ్

★ రూఫ్, స్లాబ్, ఓపెన్ టెర్రస్ బాల్కనీ, సైడ్ వాల్స్, ట్యాంక్స్, బాత్ రూమ్స్, బిల్డింగ్ లీకేజీ సమస్యలను అత్యాధునిక కెమికల్స్‌తో ఇంజక్షన్స్ గ్రౌట్ ద్వారా 10 సం.ల గ్యారంటీతో చేయబడును. ఫోన్: 8985714713

AJH-811

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273

వరంగల్
9985406150
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9985418040

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

3+2 స్కీం కలదు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి శిక్ష

మరో 100 మందికి రూ.1,42,400 జరిమానా

హనుమకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ట్రాఫిక్ డివిజన్‌లోని మూడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 197 మందిని కోర్టు ముందు హాజరు పరచగా వీరిలో 100 మందికి మెజిస్ట్రేట్ రూ.1,42,400 జరిమానా విధించారని. మిగతా ఏడుగురికి రెండు రోజులు సమాజ సేవ చేయాల్సిందిగా తీర్పునిచ్చారని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పుట్ట శ్రీను, రేవోజు శ్రీనివాస్, మున్నా అలం, జల్లి యాకూబ్ మట్టుపల్లి శివ, కుమ్మరి శ్రీకాంత్, అన్నారపు కిషన్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా వరంగల్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారులను పరీక్షించగా పెద్ద స్థాయిలో మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో వీరిని మంగళవారం రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రెండు రోజులు సమాజ సేవ చేయాల్సిందిగా తీర్పునిచ్చారు. ఈ తీర్పును అనుసరించి స్థానిక కాజీపేట సర్కిల్, హనుమకొండ మునిసిపల్ అధికారుల ఎదుట హాజరుపరిచారు. కాగా, లైసెన్సు లేకుండా వాహనం నడిపిన 14మంది వ్యక్తులకు రూ.12వేల జరిమానా కూడా న్యాయమూర్తి విధించారని సత్యనారాయణ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి



సంజీవ్ (ఫైల్)

గిర్మాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హోంకేర్ సర్వీసు అందించడానికి వరంగల్‌కు వచ్చి తిరిగి వెళ్లేందుకు పుష్‌పుల్ రైలు ఎక్కబోతూ పట్టుతప్పి రైలు కిందపడి కల్వల సంజీవ్ (33) దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటన సోమవారం అర్ధరాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. మంగళవారం రాత్రి వరంగల్ జీఆర్‌పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అదే మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన కల్వల సంజీవ్ ప్రేమ వివాహం చేసుకుని భార్య డైజి, సంవత్సరం వయస్సు కలిగిన కుమారుడితో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. హోంకేర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఫోన్‌లో సమాచారం రాగానే వెళ్లి హోంకేర్ పనులు చేసి ఇంటికి చేరుకునేవాడు. రెండు రోజుల కిందట వరంగల్‌కు వచ్చిన సంజీవ్ సోమవారం హనుమకొండలోని అమ్మ హోంకేర్ సర్వీసుకు వెళ్లగా పనిలేదని చెప్పడంతో పెద్దపల్లికి వెళ్లేందుకు రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత డోర్నకల్ నుంచి కాజీపేట వెళ్తున్న పుష్‌పుల్ రైలు 3 నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వచ్చింది. సంజీవ్ కదులుతున్న రైలు ఎక్కబోయి పట్టుతప్పి ప్లాట్‌ఫామ్ రైలుకు మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన బ్యాగులోని ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని అదే అర్ధరాత్రి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సంజీవ్ బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న లలితాదేవి

వరంగల్ మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిన హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేశ్ కుమార్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సుమారు 70 మంది మిత్రులు ఆర్థికసాయం పోగు చేశారు. సుమారు రూ. 1లక్ష నగదును బాధిత కుటుంబానికి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు చేతులమీదుగా మంగళవారం అందజేశారు.



కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఓటరు నమోదు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

పీఆర్టీయూ ద్వారానే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శ్రీపాల్‌రెడ్డి మంగళవారం కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కేడీసీ, పింగిళి మహిళా డిగ్రీ కళాశాల, కిట్స్, ఆశ్రమ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యారంగ సమస్యల పరిష్కారంపై అవగాహన ఉందన్నారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరించిన అనుభవం ఉందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన ఘనత పీఆర్టీయూదేనన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.తిరుపతిరెడ్డి, పి.శ్రీహరి, గఫార్, మాలకొండారెడ్డి, కోమల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, భానుప్రసాద్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 25న హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను వాయిదా వేస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 కార్యదర్శి, డీవైఎస్‌వో అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలబాలికల విభాగాల్లో నిర్వహించనున్న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను తిరిగి త్వరలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మహిళా కండక్టర్‌పై దాడి

కాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ మహిళా కండక్టర్, డ్రైవర్‌పై ఓ యువకుడు మద్యం మత్తులో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం వరంగల్ నుంచి కాజీపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు కాజీపేట చౌరస్తాకు రాగానే మడికొండకు చెందిన ఎం.సంగీత్ బస్సుకు అడ్డంగా నిలిచాడు. ఎంతకు తప్పుకోకపోవడంతో డ్రైవర్ హారన్ కొట్టడంతో కోపంతో ఆ యువకుడు బస్సులోకి వెళ్లి మహిళా కండక్టర్ శోభారాణిపై దాడిచేశారు. శోభారాణి పోలీసులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక వేత్త చంటి ముదిరాజ్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక వేత్త, ఆర్టీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్‌కు సోషల్ సర్వీస్ విభాగంలో చేసిన సేవలకు గుర్తింపుగా యూఎస్ఏలోని డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చంటి ముదిరాజ్‌కు అభినందనలు తెలిపారు. డాక్టరేట్ పొందిన చంటి ముదిరాజ్‌ను వరప్రసాద్, ఆర్టీఐ ఉపాధ్యక్షుడు సురా స్రవంతి, కిశోర్ వర్మ, సృజన, గుండెల రాయుడు తదితరులు అభినందించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2420	2080
పల్లికాయ (సూక)	4400	4000
పల్లికాయ (పచ్చిది)	4650	4000
కందులు	---	---
పెసళ్లు	6030	4052
పత్తి	7010	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	12000	10000
పసుపు (గోల)	11500	10000
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	17500	12000
వండర్‌హాట్ ఏసీ	16000	11000
యూఎస్341ఏసీ	16500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

న్యూస్ బాక్స్

ఇద్దరు ఎస్‌ఐల బదిలీలు

హనుమకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ అయ్యారు. పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న డి.పవన్‌కుమార్ పాలకుర్తి పోలీసు స్టేషన్‌కు బదిలీకాగా, ప్రస్తుతం పాలకుర్తి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సాయి ప్రసన్న కుమార్ వరంగల్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

ఎంజీఎం ఎమర్జెన్సీ వద్ద రోగుల ఆందోళన

వరంగల్ మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మందులు ఇవ్వడం లేదంటూ ఎంజీఎం ఆస్పత్రి అత్యవసర సేవల విభాగం వద్ద రోగులు ఆందోళనకు దిగారు. మంగళవారం సాయంత్రం ఎమర్జెన్సీ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. విధుల్లో ఉండాల్సిన ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్టు లేకపోవడంతో రోగులు ఆందోళనకు దిగారు. ఆశతో పేదల ఆస్పత్రికి వస్తే మందులు ఇచ్చే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఎంజీఎంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్టులకు సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో నిరసనకు దిగారు. ఈ విషయంపై ఎంజీఎం అధికారులపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లారు. దీంతో ఆస్పత్రిలో మందులు ఇచ్చే వారు కరువయ్యారు.

బల్దియాలో 10 మంది అధికారుల బదిలీ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పదిమంది జూనియర్ అసిస్టెంట్లను వార్డు అధికారులుగా నియమించి టాక్స్ సెక్షన్‌కు బదిలీ చేస్తూ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో సాయిని ముత్యం, సీహెచ్ అజయ్‌కుమార్, డి.రవి, ఎం.మానస, సీహెచ్ శ్రీశైలం, ఎ.కృష్ణారావు, ఎ.శివరాజ్, పి.మల్లయ్య, ఎ.సందీప్, పి.ప్రవీణ్‌కుమార్‌లున్నారు. కాగా, జూనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్న తమను తక్కువ చేసి వార్డు అధికారులుగా కేటాయించడం ఏమిటని కొందరు మండిపడుతున్నారు. బల్దియా అధికారులు తీసుకున్న ఈ నిర్ణయంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. తమకు జరిగిన అన్యాయంపై బల్దియా జాక్ నాయకులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. మంగళవారం తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో 13 జిల్లాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హనుమకొండ, వరంగల్ తేజస్వి పబ్లిక్ స్కూల్, కాజీపేటకు చెందిన విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా ప్రాథమస్థానంలో నిలిచి రీజినల్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి విజేతలకు టీజీఎస్ఏసీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి చేతులమీదుగా రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. విజేతలను డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి స్వప్న మాధురి, రామకృష్ణ పాల్గొన్నారు.

స్వదేశీ మేళాను విజయవంతం చేయాలి

మట్టెవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జాగరణ్‌మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో స్వదేశీ మేళాను విజయవంతం చేయాలని ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ భగవాన్‌దాస్ ముందడా, స్వదేశీ జాగరణ్ మంచ్ అభియాన్ జిల్లా కన్వీనర్ ఉల్లి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం వరంగల్‌లో స్వదేశీ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 23 నుంచి 27 వరకు పీపుల్స్ ప్లాజా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న స్వదేశీమేళాకు వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, యువత పాల్గొని ప్రయోజనం పొందాలన్నారు. 23న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవ్వా బద్రినాథ్, శ్రీరామోజు శ్రీనివాస్, హరీష్, ఎర్రం శ్రీనివాసులు, శ్రీరామోజు గిరిప్రసాద్, లలిత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై ప్రజల్లో అవగాహన

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పది రూపాయల నాణాల చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ ఆర్బీఐ హైదరాబాద్ శాఖ వారు రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. వరంగల్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పనిచేస్తున్న 46 బ్యాంకుల బ్రాంచ్ శాఖల్లో ఈ నెల 21, 22న ప్రజలు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో వివిధ కార్యాలయాల సిబ్బంది వ్యాపారులు, ప్రజలకు రూ.10 నాణాలు చెలామణిలో ఉన్నట్లు తెలిపారు. వాటిపై ఎవరికి ఎలాంటి అపోహ ఉండనక్కరలేదని స్పష్టం చేశారు. వ్యాపారులకు బ్యాంకు అధికారులు నాణాలను అందించారు.

యువత దేశం, సమాజం కోసం పని చేయాలి

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మడికొండలో మెగా రక్త దాన శిబిరం

మడికొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దేశం కోసం, సమాజం కోసం యువత నిజాయితీగా పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మడికొండలోని రాజరాజేశ్వరిగార్డెన్స్‌లో ఎంజీఎం రక్తనిధి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సీపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. రక్తదానంపై అవగాహన పెంచుకుని ప్రజలు పెద్దఎత్తున ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. యువత ఎంచుకున్న లక్ష్యం కోసి నిజాయితీగా కృషి చేస్తే



రక్త దాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

తప్పకుండా విజయం వరిస్తుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా 57 సార్లు రక్తదానం చేసిన రామక్రిష్ణ, 35 సార్లు రక్తదానం చేసిన హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌ను సీపీ శాలువా కప్పి సన్మానించారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసులను సీపీ అభినందించారు. కాజీపేట ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలు అపోహపడవద్దని, రక్తదానం చేయడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంజీఎం రక్తనిధి ఇన్‌చార్జి డాక్టర్ ఆశాదేవి మాట్లాడుతూ.. రక్తదానం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, కొత్త రక్తకణాలు పుట్టుకొచ్చి మరింత ఉత్తేజంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిబిరంలో పోలీసులు, ప్రజలు 300 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయగా వారికి సీపీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, పులి రమేష్, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఎంజీఎం రక్తనిధి ఇంచార్జి ఆశాదేవి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నర్మెట వెంకటరమణాగౌడ్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, బిల్ల రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ పోరుబిడ్డ కొమురం భీం

జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

బాలసముద్రం, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరుచేసిన ఆదివాసీ పోరుబిడ్డ కొమురం భీం అని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కొమురం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వినయ్‌భాస్కర్ హాజరై కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీంకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సముచిత గౌరవం ఇచ్చామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొమురంభీం పేరిట జిల్లా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



కుమరంభీం, నాయిని నర్సింహారెడ్డిల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 'కుడా' మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్లు జనార్ధన్‌గౌడ్, రజినీకాంత్, సుంచు కృష్ణ, జానకిరాములు, యాకుబ్, కోటేశ్వర్‌రావు, విజయ్ పాల్గొన్నారు.

కొమురం భీంకు మంత్రి సురేఖ నివాళులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : కొమురం భీమ్ జయంతి సందర్భంగా సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం మంత్రి కొండా సురేఖ కొమురం భీమ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఆత్మగౌరవ పోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు కొమురం భీమ్ గొప్ప స్ఫూర్తినిచ్చాడని మంత్రి సురేఖ తెలిపారు. కొమురం భీం ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే తెలంగాణ లోని సబ్బండ వర్గాలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమించేలా ప్రేరణనిచ్చాయని అన్నారు. కొమురం భీమ్ త్యాగాలకు గుర్తుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు పూర్వమే పెదవాగు నదిపై ప్రాజెక్టును చేపట్టి, ఆయన త్యాగాలను గుర్తించిందని గుర్తు చేశారు. కొమురం భీమ్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ గొప్ప పోరాటం చేసి, నియంతృత్వాన్ని తుదముట్టించి, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కొమురం భీమ్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ అంకితభావంతో పని చేస్తున్నదని మంత్రి సురేఖ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం నయీంనగర్ లోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో మహిళల చట్టాలు, సఖి సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవితోపాటు కేసు వర్కర్ వినీల మాట్లాడుతూ.. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు లాంటి వాటి నుంచి రక్షణ కల్పించడానికి సఖి అండగా నిలబడుతుందన్నారు. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని, సమస్య ఉన్నప్పుడు 181 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం అందుతుందన్నారు. అదే విధంగా 0870 2452112 నెంబర్‌కు కాల్‌చేసిన బాధిత మహిళకు సత్వరమే సహాయం అందుతుందన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాధిత మహిళలకు తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్, పోలీసు, వైద్య సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ సీఎంకు సమస్యలు విన్నవిస్తున్న ఇనుగాల శ్రీధర్

హనుమకొండ టౌన్, అక్టోబరు 22,(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం త్వరలోనే సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఇనుగాల శ్రీధర్ వెల్లడించారు.

బాణసంచా దుకాణాలపై టాస్క్‌ఫోర్సు దాడులు

మట్టెవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా దుకాణాలపై మంగళవారం రాత్రి కమిషనరేట్ పరిధిలోని టాస్క్ ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. షాపుల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.కోటీ 80 లక్షల విలువ గల బాణసంచాను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్సు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మంగళవారం రాత్రి మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు బాణసంచా దుకాణాల్లో పోలీసులు తనిఖీ చేశారు. దీపావళి పండుగ వేళ బాణసంచా అక్రమ దందా జోరుగా నడుస్తోంది. పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా తెచ్చి గోదాముల్లో నిల్వ చేశారు. అనుమతులతో పాటు కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా నిల్వ చేశారు. పక్కా సమాచారంతో వరంగల్ టాస్క్‌ఫోర్సు పోలీసుల తనిఖీల్లో బాణసంచా అక్రమ నిల్వలు బయటపడ్డాయి. ఓల్డ్ బీటు బజారులోని వజినెపల్లి రమేష్ అండ్ బ్రదర్స్ శ్రీసాయి క్రాకర్స్ దుకాణాలపై దాడులు చేసి బాణసంచాను సీజ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. బాణసంచాను సీజ్ చేసిన పోలీసులను, ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్‌కుమార్, సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

బోడగుట్టలో విద్యుదాఘాతం

కాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో విద్యుదాఘాతం జరగడంతో వస్తువులు కాలి బుడిదయ్యాయి. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోడగుట్టలో కొరివి కళ్యాన్ భార్య, కుమారుడితో కలిసి ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నాడు. సోమవారం రాత్రి కల్యాణ్ ఊరికివెళ్లాడు. కల్యాన్ భార్య తన కుమారుడి కొంత దూరంలో ఉన్న తల్లిగారింట్లో వదిలి ఇంటికి వచ్చి పడుకుంది. అనంతరం ఇంట్లో ఒక్కసారిగా విద్యుదాఘాతంతో పొగలు రావడంతో భయబ్రాంతులకు గురై పరుగులు తీసి స్థానికులకు తెలిపారు. ఈ ఘటనలో ఇంట్లో వస్తువులు, బట్టలు కాలి బుడిదయ్యాయి. మంగళవారం ఉదయం స్థానిక కాంగ్రెస్ నాయకులు దొంగల కుమార్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఎమ్మెల్యే నాయిని తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎల్.బావుసింగ్, ఆర్ఐ శివకుమార్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితులకు 75 కిలోల బియ్యం, రూ.5 వేల నగదు అందించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీకాంత్, షేక్ అజ్గర్, సిరిల్‌లారెన్స్ సాయినాథ్, విజయ్ భాస్కర్‌లు ఎమ్మెల్యేతో ఫోన్ మాట్లాడి ప్రభుత్వం తరుపున సహాయం అందించాలని కోరారు. ఈఘటనలో సుమారు 2 లక్షలు నష్టం జరిగి ఉంటుందని రెవెన్యూ సిబ్బంది అంచనా వేశారు.

నిర్లక్ష్యపు తీగల తొలగింపు



తీగలు తొలగించిన కరెంట్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సోమిడి 62వ డివిజన్ హనుమాన్ జంక్షన్ వద్ద విద్యుత్ తీగలకు మొక్కల తీగలు అల్లుకున్నాయి. దీంతో గాలి, వర్షం వస్తే విద్యుత్ తీగలు తాకి మెరుపులు మెరిసి నివాస గృహాల్లో ప్యూజ్‌లు కొట్టేస్తున్నాయి. ఆరునెలలుగా స్థానికులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అల్లుకున్న నిర్లక్ష్యపు తీగలు' అనే కథనాన్ని ప్రచురితం చేసింది. దీంతో మంగళవాం ఉదయం 12 మంది విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేసి ఎక్స్‌కవేటర్ తెప్పించి తీగలను తొలగించారు. సుమారు రెండు గంటల పైగా ఆ పనులు చేపట్టి సమస్య పరిష్కరించారు. దీంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నరకాసుర వధ వేడుకలకు బందోబస్తు ఏర్పాటు చేయాలి

కరీమాబాద్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్‌ను కలిశారు. పోలీసు బందోబస్తు విషయం, బారికేడ్ల ఏర్పాటు, వీఐపీల రాక విషయాలపై మాట్లాడారు. నరకాసుర వధ వేడుకలకు సుమారు 20వేల మంది ప్రజలు హాజరవుతారని, వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, మరుపల్ల శివ, కొమ్మురాజు, మంద పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యకు ఉజ్వల భవిష్యత్



ప్రిన్సిపాల్ డాక్టర్ బాబురావు

కాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్య అభ్యసించిన విద్యార్థులకు జీవితంలో స్థిరపడటానికి ఉజ్వల భవిష్యత్ అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యం కలిగిన ఫార్మసిస్టులకు పెద్దఎత్తున డిమాండ్ ఉందని కాజీపేట సోమిడి నేతాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ బాబురావు తెలిపారు. ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, ఫార్మసీ కోర్సు ప్రాముఖ్యంపై పలు విషయాలు వెల్లడించారు. రిటైల్, ఆస్పత్రి, ఫార్మసీ, పరిశోధన, పరిశ్రమలో కేరీర్‌లకు దారితీసే అవకాశాలు ఉన్నాయన్నారు. భారతదేశం ఫార్మసీ విద్యకు కేంద్రం అవుతుందన్నారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీతో సహ డిప్లొమా, అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉన్నాయని పరిశోధన, అభివృద్ధి, తయారీ, నాణ్యత నియంత్రణ, మార్కెటింగ్, అమ్మకాలలో మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఫార్మసీ గ్రాడ్యుయేట్‌లు సురక్షితమైన, సమర్థవంతమైన మందుల వాడకాన్ని నిర్ధారించడం ద్వారా రోగి ఫలితాలను మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మందుల వాడకాన్ని మెరుగుపర్చడం, ఔషధ సంబంధిత లోపాలను నివారించడం, ఆరోగ్య ఫలితాలను మెరుగుపర్చడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలమన్నారు.

ఘనంగా ఏవీ రంగనాథ్ జన్మదిన వేడుకలు



ఏవీ రంగనాథ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న కొక్కిరాల రవీందర్‌రావు, సంపత్‌రావు

బాలసముద్రం, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని రంగనాథ్ నివాసంలో సంజన కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలపర్స్ అధినేత, టీఎన్జీవోఎస్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల రవీందర్‌రావు, ఎస్ఎస్ ఆర్ గ్రూప్ అధినేత సంపత్‌రావు, వ్యాపార వేత్తలు వెంకటేశ్వర్‌రావు, పితంబరం రాజేష్(రాయల్, బెంగళూర్) పాల్గొని రంగనాథ్‌తో కేక్ కట్ చేయించారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మడికొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయులను కలిసి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రిన్సిపాల్‌లు కుమారస్వామి, మాలిక, టీఎస్‌యూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రవిందర్, రాజు, జిల్లా కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

కేయూ వీసీని కలిసిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని మంగళవారం కేయూ పరిపాలన భవనంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి వర్సిటీ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అలాగే కేయూ వీసీని ఉద్యోగ సంఘాల నేతలు, అధ్యాపకులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

చెస్ దిగ్గజం అర్జున్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): చెస్ గ్రాండ్ మాస్టర్, హనుమకొండకు చెందిన ఇరిగేసి అర్జున్‌ను నేటి క్రీడాకారులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ టోర్నీని ఈవీ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో విద్యార్థులు రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యుడు రాజ్‌కుమార్, ఆర్బిటర్లు సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

తల్వార్ తిప్పిన హోంగార్డు.. అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి రోడ్డుపై తల్వార్‌తో హోంగార్డు హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం కాశిబుగ్గలో చోటు చేసుకుంది. తల్వార్ పట్టుకుని రోడ్డుపై తిరుగుతున్న హోంగార్డును అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ షుకూర్ తెలిపారు. ధర్మారానికి చెందిన సుకుమార్ అనే హోంగార్డు సొసైటీకాలనీలో నివాసముంటున్నాడు. అతిగా మద్యం తాగి ఓసిటీ జంక్షన్ వద్ద రోడ్డుపై తల్వార్ పట్టుకుని తిరుగుతుండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, అతడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చైతన్య వర్సిటీ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో యూనివర్సిటీ ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి) : టీసీఎస్‌లో ఉద్యోగాలు సాధించిన చైతన్య డీమ్డ్‌టూబీ యూనివర్శిటీ కిషన్‌పుర విద్యార్థులను యూనివర్శిటీ చాన్స్‌లర్ సీహెచ్.పురుషోత్తంరెడ్డి అభినందించారు. 215మంది డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా, 180మంది విద్యార్థులు ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుతం ఉన్న ఉత్తమ అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ కులపతి ప్రొఫెసర్ గుర్రపు దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ అధికారి ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

సాయి సేవా ట్రస్టు ఆర్థికాభివృద్ధికి కృషి

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాయి సేవా ట్రస్టు ఆర్థికాభివృద్ధికి తమ సంస్థ ద్వారా కృషిస్తానని క్రెడాయ్ వరంగల్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, సెక్రటరి మనోహర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ వడ్డెపల్లి పూరిగుట్ట తండా ప్రాంతంలోని సాయిసేవా ట్రస్టు అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమానికి క్రెడాయ్ సంస్థ నుంచి 10కేవీ సోలార్ ప్లాంటును బహూకరించి మంగళవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి, సాయి సేవా ట్రస్టు చైర్మన్ చిన్నాల రంగయ్య, వాసుదేవరెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్ డీఈ సాంబరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పోలీసు కుటుంబాలు

- రంగశాయిపేట జంక్షన్‌లో కానిస్టేబుళ్ల భార్యల ధర్నా
- విశ్రాంతి దినాలు తగ్గించడంతో ఆందోళన
- ఒకే పోలీసింగ్ వ్యవస్థ కావాలని నినాదాలు
- మామునూరు టీజీఎస్పీలో చర్చలు జరిపిన అధికారులు



ధర్నా చేస్తున్న పోలీసు కుటుంబాల మహిళలు




శంభునిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసింగ్ వ్యవస్థ కావాలంటూ మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో విధులు నిర్వహించే టీజీఎస్పీ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కాయి. వరంగల్‌లోని రంగశాయిపేట జంక్షన్‌లో మంగళవారం నిరసనకు దిగారు. తమ భర్తలు శారీరక శ్రమకు గురవుతున్నారని కానిస్టేబుళ్ల భార్యలు ప్లకార్డులతో వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించారు. రాష్ట్రం అంతా ఒకే పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నినదించారు. సివిల్, ఏఆర్ విభాగాల వలే టీజీఎస్పీలో సంక్షేమాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం ఐదేళ్లయినా బదిలీ లేకుండా ఒకేచోట డ్యూటీలు వేయాలని కోరారు. స్థిరత్వం లేని ఉద్యోగం వల్ల కష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీఎస్పీ కానిస్టేబుల్ అంటే పిల్లను సైతం ఇవ్వడం లేదని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, టీజీఎస్పీ కానిస్టేబుళ్ల కుటుంబాలకు చెందిన మహిళలు ధర్నా చేపట్టనున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో ఆర్టీఏ జంక్షన్‌లో పెద్దసంఖ్యలో పోలీసులను మోహరించారు. దీంతో బాధితులు నిరసనను రంగశాయిపేట జంక్షన్‌కు మార్చారు. దీంతో అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఘటనాస్థలాని కి స్థానిక మిల్స్‌కాలనీతో పాటు మామునూరు సబ్ డివిజన్‌లోని పలు పోలీసు స్టేషన్ల సిబ్బంది హుటాహుటి న వచ్చి బాధితులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా మహిళలు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ మహిళలతో మాట్లాడారు. అన్నీ విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని కమాండెంట్ రామ్‌ప్రకాశ్ హామీ ఇచ్చారు. మహిళలను ప్రత్యేక వాహనంలో బెటాలియన్‌కు తరలించారు. బెటాలియన్‌లో కమాండెంట్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ల వారి కుటుంబ సభ్యులతో చర్చలు జరిపినట్లు సమాచారం.

నిరంతర విధులతో సతమతం

తెలంగాణ ప్రత్యేక పోలీసు విభాగం పేరుతో రాష్ట్రంలో మొత్తం 13 బెటాలియన్లు ఉన్నాయి. ఈ బెటాయన్ల ద్వారా వివిధ ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడడంతో పాటు భద్రతాపరమైన విధులు నిర్వహించటానికి సిబ్బందిని నియమిస్తారు. వారిని నియంత్రించేందుకు ఆర్ఎస్‌లు, ఆర్ఐలు, అసిస్టెంట్ కమాండెంట్లు ఉంటారు. వారికి పోలీసు స్టేషన్లు, సీఎం, వివిధ ప్రముఖుల సెక్యూరిటీ, జాతరలు, ఇతర రాష్ట్రాల్లోనూ జరిగే ఎన్నికల విధుల్లో డ్యూటీలు వేస్తుంటారు. రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా అక్కడే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. గతంలో పోలీసు ఉన్నతాధికారులు టీజీఎస్పీ సిబ్బంది సంక్షేమం కోసం అడిషనల్ డీజీపీ నేతృత్వంలో ఒక కమిటీ వేశారు. సిబ్బందికి సరైన విశ్రాంతి దినాలు కల్పించాలని ప్రధాన డిమాండ్‌కు ఉన్నతాధికారులు అంగీకరించారు. 14 రోజులు విధులు నిర్వహించి 4 రోజులు విశ్రాంతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఎన్నికలు, జాతరలు, అత్యవసర పరిస్థితుల్లో ఈ సమయ పాలనను పరిగణలోకి తీసుకోరు. అయితే ఇటీవల టీఎస్ఎస్పీలో కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. 14 రోజులు ఉండే పనిదినాలను 26 రోజులు క్రమం తప్పకుండా చేయాలని, తరువాత 4 రోజులు సెలవు తీసుకోవాలని నిబంధన పెట్టారు. దీనిపై కానిస్టేబుళ్లకు పనిఒత్తిడి పెరగగా, వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.


గుంటి చెరువులో ఏర్పాటు చేసిన ఉయ్యాలలు


గుంటి చెరువు వద్ద గొల్లరాజుల విగ్రహాలు


శివాలయంలో పేర్చిన నాటి విగ్రహాలు


ఇనుగుర్తి హైస్కూల్ గేటు పక్కన పడేసిన అమూల్యమైన శిల్ప సంపద

చరిత్ర

కాలగర్భంలో కలిసిన నగరం

కాకతీయుల కాలం నాటి సామంతుల రాజధాని కూడా ఇదే

- గ్రంథస్థం కాని ఇనుగుర్తి చరిత్ర
- చెత్తకుప్పను తలపిస్తున్న నాటి ఆధారాలు


ఇనుగుర్తి గుట్టపైనున్న లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

మహబూబాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాలగర్భంలో కలిసిపోయిన ఒక 'నగర' చరిత్ర ఇది. 12 శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యంలోని సామంత రాజులైన నతవాడి వంశస్థులు రాజధానిగా పరిపాలన కొనసాగించారు. నాటి రాజరికపు పరిపాలనకు సజీవసాక్ష్యాలుగా గ్రామంలో ధ్వంసమైన రాతిశిల్పాలు నిలుస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో కొద్దికాలం కిందటే మండల కేంద్రంగా గుర్తింపు పొందిన ఇనుగుర్తి గ్రామం ఇది. ఈ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ అద్భుతమైన శిల్పాలు సాక్షాత్కరిస్తుంటాయి. కాకతీయుల కళాపిపాసకు నిలుస్తున్న ఓరుగల్లు వేయిస్తంభాల గుడి, ములుగు రామప్ప దేవాలయాలకు ఉపయోగించిన రాళ్లతో చేసిన శిల్పాల శకలాలు అనేకం ఇనుగుర్తిలో ఉన్నాయి. కాకతీయుల చరిత్రలో ఇనుగుర్తి పాత్ర ఏంటనేది ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఈ విషయంలో 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం మేరకు కాకతీయుల కాలంలో 'నగరం'గా.. ఇనుగుర్తి ప్రాశస్త్యం పొందింది.

రెండు గుడుల 'ఇనుగుర్తి'

11వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో గొప్ప సామ్రాజ్యమైన కాకతీయుల అవశేషాలు ఈ గ్రామంలో ఉన్నాయి. ఇనుగుర్తి అనే పదం 'ఇనుగుడి' అనే పదం నుంచి వచ్చింది. ఇనుగుడి అంటే రెండు గుడులు అని అర్థం. 11వ శతాబ్దంలో ఇక్కడ రెండు గుళ్లుండేవని, గ్రామంలోని గుట్టపై లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, గుట్టకింద మరో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, గణపతిదేవ చక్రవర్తి సోదరి మైలమ భర్త రుద్రుడు 1206లో ఇక్కడ శివాలయాన్ని కట్టించినట్టు శాసనం ద్వారా తెలుస్తోంది. గుట్టకుపైన జలంధరభైరవ విగ్రహం చెక్కబడి ఉంది. దాని పక్కనే యాదవరాజుల నిలువెత్తు విగ్రహాలున్నాయి. ఇవి కాకతీయుల అనంతరం యాదవుల పాలనా కాలంలో చెక్కబడి ఉంటాయని తెలుస్తోంది. ఈ విగ్రహాలను 50 ఏళ్ల క్రితం మాధవరావు కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఇక్కడ్నుంచి తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం గొల్లరాజుల విగ్రహాలతో గుడిని నిర్మించారు.


కాకతీయులతో వైవాహిక సంబంధాలు..

ఇనుగుర్తిని పాలించిన నతవాడీ వంశస్థులు తొలుత చాళుక్యులకు ఆ తర్వాత కాకతీయులకు విధేయ సామంతులుగా వైవాహిక సంబంధాలు కలిగి ఉన్నారట. వీరెప్పుడూ స్వతంత్రరాజ్యాలను స్థాపించేందుకు యత్నించలేదు. నతవాడీ వంశంలో ఆద్యుడు నతవాడీ బేతరాజు, ఆయన కుమారుడు దుర్గరాజు కాకతి ప్రోలమదేవిని వివాహం చేసుకోగా, కూతురు కుప్పాంబికను కాకతి ప్రోలరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఇక దుర్గరాజు కొడుకు బుద్ధరాజు, ఆయన కొడుకు రుద్రసేనాని. కాకతీయ రాజు మహదేవుడి కూతురు, గణపతిదేవుని సోదరి మైలమను నతవాడీ రుద్రసేనానికి ఇచ్చి వివాహం చేశారని చరిత్ర చెబుతోంది.


కాకతీయుల శిలాశాసనం
ఇనుగుర్తి స్కూల్ ఆవరణలో కాకతీయుల పాలనకు సాక్ష్యంగా నిలుస్తున్న నంది

ఇనుగుర్తే కేంద్ర పట్టణం..

నతవాడీ వంశం మొదట ఖమ్మం జిల్లాలోని మేడిపల్లిని కేంద్రంగా చేసుకుని సామంత రాజ్యాన్ని పాలించారు. ఆ తర్వాత కాకతి గణపతి దేవుని కాలంలో వీరు తమ రాజధానిని ఇనుగుర్తికి మార్చుకున్నారు. ఈ వంశీయులు 1104 నుంచి 1269 వరకు పాలించినట్లు శాసనాధారాలున్నాయి. వీరి శాసనాలను నిడిగొండ, కుందవరం, నర్సంపేట, త్రిపురాంతకం, బయ్యారం, ద్రాక్షారామం, సింహాచలం ప్రాంతాల్లో చరిత్రకారులు గుర్తించారు. అప్పట్లోనే ఇక్కడ కాకతి ప్రోలరాజు 1117లో తవ్వించిన గుంటి చెరువు ఉంది. ఈ చెరువు వద్ద కాకతీయుల నాటి శిల్పాలు ఎన్నో ఉండేవి. వరంగల్ కోటలోని గుంటి చెరువులో నిమ్మకాయ వేస్తే ఆ నిమ్మకాయ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ద్వారా కల్లెడ, బూరుగుమళ్ల ప్రాంతాల మీదుగా ఉన్న చెరువులను కలుపుతూ 'రాజుకాల్వ' నుంచి ఇనుగుర్తి గుంటిచెరువులో తేలేదని పూర్వీకులు చెబుతుంటారు. కాకతీయుల అద్భుత నీటి పారుదల వ్యవస్థకు ఇదో నిదర్శనం. గుంటి చెరువు మధ్యలో కాకతీయులనాటి శిల్పాలతో చేసిన ఉయ్యాలలు ఉన్నాయి. అయితే ఇవి చెరువు పూర్తిగా ఎండిపోతేనే కనిపిస్తాయి.



వృథాగా పడి ఉన్న అమూల్య శిల్ప సంపద...

హైస్కూల్ ఉన్న ప్రాంతంలో నాలుగు బురుజులతో కోట ఉండేదని, అందులో మూడు ధ్వంసమై కనుమరుగు కాగా ఒక బురుజు శిథిలావస్థలో ఉంది. 1952లో హైస్కూల్ భవన నిర్మాణం సందర్భంగా చేసిన తవ్వకాల్లో చాలా శిల్పాలు బయటపడ్డాయి. బ్రహ్మంగారి గుడికి వెళ్లే వీధిలో నిర్లక్ష్యంగా పడి ఒక నంది విగ్రహం ఉండేది. ఆ నంది విగ్రహాన్ని గుప్తనిధుల కోసం దుండగులు ధ్వంసం చేశారు. 2001లో నంది విగ్రహానికి మరమ్మతులు చేసి జడ్పీ హైస్కూల్ ఆవరణలో నెలకొల్పారు. శివాలయానికి సంబంధించిన శిలాశాసనం లభించగా, దాన్ని నందిపక్కనే ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం పాతవేదిక కూల్చి కొత్తది నిర్మించే సమయంలో వేదికకు అమర్చిన శిల్పాలు హైస్కూల్ గేటు వెంట పడేశారు. ఇప్పటికి అక్కడక్కడా శిల్పాల భాగాలు కనిపిస్తాయి. ఈ శిల్పాల అవశేషాలను భద్రపర్చాలని పలువురు కోరుతున్నారు. ఇనుగుర్తిలో కాకతీయులకాలంలో ఏం ఉండేదనేది మిస్టరీగానే మిగిలింది. కాకతీయులతో ఇంతగా ముడిపడి ఉన్న ఇనుగుర్తిని పాలకులు చరిత్రకెక్కించడంలో విస్మరించారని గ్రామస్థులు వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ చరిత్ర మరుగున పడగా తెలంగాణ రాష్ట్రంలోనైనా గ్రంథాల్లోకి ఎక్కుతుందా అని గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా కాకతీయుల చరిత్రలో ఇనుగుర్తి పాత్ర ఏమిటనేది పరిశోధించి ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కళ


సీనియర్ నటుడు వీకే నరేశ్‌తో ఓ సీరియల్ సన్నివేశ చిత్రీకరణలో మారబోయిన స్వప్న (ఫైల్)

అడవి నుంచి రంగుల ప్రపంచంలోకి..

- వెండితెర, బుల్లితెరపై రాణిస్తున్న మాజీ నక్సలైట్ స్వప్న



మంగపేట, అక్టోబరు, 22:(ఆంధ్రజ్యోతి) : ఆమె ఓ మాజీ నక్సలైట్. చిన్న వయసులోనే పోరుబాట పట్టి అజ్ఞాత దళాల్లో ఐదేళ్ల పాటు పనిచేసి తుపాకీ చేతపట్టి అడవుల్లో తిరిగింది. ఆ తర్వాత ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో జనజీవన స్రవంతిలో కలిసి ఇప్పుడు పలు సినిమాలు, సీరియళ్లలో నటిస్తూ రంగులప్రపంచంలో రాణిస్తూ ఔరా అనిపించుకుంటోంది ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరుకు చెందిన మారబోయిన స్వప్న. సీపీఐ(ఎంఎల్) ప్రజాప్రతిఘటనలో పనిచేసిన స్వప్న 2005లో ఖమ్మం డీఎస్పీ ఎదుట లొంగిపోయి జనజీవనస్రవంతిలో కలిసి నాడు ప్రభుత్వం నుంచి రూ.50వేల నగదు పారితోషికాన్ని పొందింది. ఆ తర్వాత పెళ్లి చేసుకున్న ఆమె అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. కానీ కష్టాలకు కుంగిపోకుండా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి తెలుగుదేశం మహిళ విభాగం మండల అధ్యక్షురాలిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేసింది. మారిన పరిస్థితుల దృష్ట్యా సాంకేతికంగా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోషల్‌మీడియా వేదికగా టిక్‌టాక్‌లో 'స్మైలీస్వప్న'గా తన చిన్నచిన్న వీడియోలతో నటనలో ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలోనే ఓ మిత్రుడి సహకారంతో టెలివిజన్ రంగంలోకి వెళ్లగా క్రమంగా పలు సీరియళ్లలో నటిగా అవకాశాలు పొందింది. ఇటీవల ఓ సినిమాలో హీరోయిన్ తల్లిగా కూడా నటిస్తున్న ఆమె మరో రెండు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఒకప్పుడు తుపాకీ పట్టి అడవిలో తిరిగిన ఆమె.. జనజీవనస్రవంతిలో కలిసి రాజకీయ నాయకురాలిగా మారి.. ఇప్పుడు వెండితెర, బుల్లితెరపై నటిగా ఎదుగుతున్నారు.

ఎంపిక



జాతీయస్థాయి యోగా పోటీలకు అభినవ నేతాజీ

శంభునిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న 49వ జాతీయస్థాయి యోగా పోటీలకు నగరంలోని రంగశాయిపేటకు చెందిన అభినవ నేతాజీ ఎంపికైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో 16-18 ఏళ్ల విభాగంలో అభినవ నేతాజీ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అక్టోబరు 24 నుంచి 27వరకు హిమాచల్ ప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొననున్నాడు. యోగా అసోసియేషన్ బాధ్యులు, పలువురు ప్రముఖులు అభినవ నేతాజీని అభినందించారు.

నేడు ఓరుగల్లు కళాకారుల ప్రేరణ

- తొలి నృత్యరూప ప్రదర్శనకు శ్రీకారం
- హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలంనాడు యుద్ధరంగానికి వెళ్లే సైనికులకు వీరరసం ప్రబోధింపజేసే పేరిణి శివ తాండవం స్ఫూర్తితో ఓరుగల్లు కళాకారులు, పేరిణి నాట్యాచార్యులు గజ్జెల రంజిత్‌కుమార్ - నవ్యజ ఆధ్వర్యంలో అద్వితీయ ప్రేరణ నృత్యరూపకాన్ని రూపొందించారు. గంటన్నర నిడివితో సుమారు 45 మంది కళాకారులతో రిటైర్డ్ తెలుగు పండిట్ డాక్టర్ పురుషోత్తమాచార్య రచించిన ప్రేరణ నృత్యరూపక ప్రదర్శనకు బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిలువనుంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వరంగల్‌లోని నటరాజ కళాకృష్ణ, నృత్యజ్యోతి అకాడమీ సమర్పణలో అనేకమంది ప్రముఖుల సమక్షంలో ఈ నృత్యరూపకం ప్రదర్శనకు సిద్ధమైంది. రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, తదితర అనేకమంది ప్రముఖుల సమక్షంలో ప్రేరణ తొలి ప్రదర్శనను నిర్వహించనున్నారు.

కాకతీయుల కాలంలో గొప్పగా ఆదరణకు నోచుకున్న పేరిణి స్ఫూర్తితో ఆధ్యాత్మిక అనుభూతితో పాటు శక్తివంతమైన రౌద్రపరమైన, ముఖ్యంగా నేటి మహిళాలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా ప్రేరణ నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ఆలోచనలకు ప్రతిరూపకంగా సుమారు మూడేళ్ల కృషి ఫలితంగా అన్ని హంగులతో డాక్టర్ రంజిత్‌కుమార్ - నవ్యజ దంపతులు ఈ ప్రదర్శనకు శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల కాలంలో ముష్కరులచేతిలో దాడికి గురైన నిర్భయ యథార్థ సంఘటన నేపథ్యంలో మాళవిక పాత్రద్వారా ఈ నృత్య రూపకంలో మహిళలు ఎలాంటి అరాచక సంఘటనలైనా నిర్భయంగా ఎదుర్కొనేలా సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక మేళవింపులతో కాకతీయ వారసత్వ పేరిణికి ప్రతిరూపకంగా ప్రేరణ నృత్యం నిలిచేలా రూపొందింప చేయడం విశేషం. తొలి ప్రదర్శన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ముఖ్య పట్టణాలలోనూ ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రేరణ నృత్యరూపకాన్ని ప్రదర్శించేందుకు చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందింప చేశారు. కాకతీయ గణపతి దేవుడి ఆరాధన నృత్యంతో పాటు సామాజిక అంశాల ఇతివృత్తంతో ప్రేరణ రూపొందింప చేశారు. రాయబారపు శ్రవణ్‌రాజ్ ఈ బ్యాలేకు సంగీతాన్ని రూపొందింప చేశారు.

ఈ నృత్యంలో ఓరుగల్లుకు చెందిన పల్నాటి శ్రీజ, వైష్ణవి, తేజస్విని, గడ్డం విద్యశ్రీ, బైరి వందన, సూరం శ్రేయారెడ్డి, ప్రజ్ఞా, ఎం.లోహిత్, టి.గురుదేవ్, వడ్నాల ప్రశాంత్, సాయికపిలతేజ, రేగుల చందు తదితర అనేక మంది ఓరుగల్లు కళాకారుల ప్రతిభ జాతీయ స్థాయి వేదికలపైన కూడా గుభాళించేలా రూపొందింపచేశారు. ఓరుగల్లు నుంచి ఈ ప్రదర్శనకు ప్రముఖులు తరలి వెళ్లనున్నారు.


ప్రేరణ నృత్యరూపకంలో పాల్గొనే కళాకారులు వీరే..


సినిమా వివరాలు వెల్లడిస్తున్న హీరో, హీరోయిన్లు అనన్య, యువ చంద్రశేఖర్


ఓరుగల్లులో పొట్టేలు సందడి

- స్టెప్పులేసిన హీరో, యువ చంద్రశేఖర్


డ్యాన్స్ చేస్తున్న సినీ హీరో యువ చంద్రశేఖర్

కాశిబుగ్గ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో పొట్టేలు సినిమా తారలు మంగళవారం సందడి చేశారు. ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా వెంకట్రామ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినిమా యూనిట్ పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లకు యువ హీరో స్టెప్పులేసి ఉత్సాహపర్చారు. అనంతరం హీరో, హీరోయిన్లు యువ చంద్రశేఖర్, అనన్య నాగళ్ల సినిమా వివరాలను వెల్లడించారు. మంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విజయవంతంగా సినిమా నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సినిమా తప్పకుండా ప్రజల ఆదరణ పొందుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వదులుకొని ఈ సినిమా చేసినట్లు వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారు హీరో, హీరోయిన్లతో ఫొటోలు దిగడానికి ఆసక్తి కనబర్చారు.

మీ కోసం..



తపాలా బీమా.. అందరికీ అండగా..

తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజీ • సద్వినియోగం చేసుకోవాలంటూ విస్తృత ప్రచారం

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుకోని ప్రమాదాల్లో ఎవరైన చనిపోతే వారిపై ఆధారపడిన ఆ కుటుంబాల పరిస్థితి దయనీయం. పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో అందరికీ అండగా ఉండేలా తపాలా శాఖ తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రమాద బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చింది. రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు ప్రయోజనం అందేలా హెల్త్‌ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రవేశపెట్టింది. వీటిని సద్వినియోగం చేసుకుంటే తమపై ఆధారపడిన కుటుంబాలకు అండగా ఉండొచ్చంటూ తపాలాశాఖ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

బీమా సదుపాయాలు..

నివా హెల్త్ ఇన్సూరెన్స్, తపాలా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తక్కువ ప్రీమియంతో రూ. 10లక్షల రూ.15లక్షల ప్రమాద బీమా అందిస్తోంది. 18 నుంచి 65 ఏళ్ల లోపు వారు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి ఒకేసారి రూ.549 ప్రీమియంతో రూ. 10లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల ప్రయోజనం పొందవచ్చు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో మాత్రమే వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఈ బీమా ప్రయోజనం అందుతుంది. ఇన్‌ష్యూర్డ్ వ్యక్తికి సమగ్ర ప్లాన్, శాశ్వత పూర్తి వైకల్యం(పీటీడీ నుండి రక్షణ), శాశ్వత పాక్షిత వైకల్యం(పీటీడీ) నుండి రక్షణ, బర్త్ బెన్‌ఫెట్, పిల్లల విద్యకు నిధులు లాంటి సదుపాయాలున్నాయి.

మరెన్నో ప్రయోజనాలు...

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ ఇన్సురెన్స్ స్కీంలతో పాటు ప్రమాదవశాత్తు మృతిచెందినా, ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం కలిగినా, కాలు, చేయి కోల్పోయినా, పక్షవాతం సంభవించినా బీమా డబ్బు మొత్తం చెల్లిస్తారు. అలాగే పాలసీ గడువు కాలంలో ఒకసారి ఆరోగ్య తనిఖీ, అపరిమిత టెలీ కన్సల్టెన్సీ ప్రయోజనాలు పొందవచ్చు. యాక్సిడెంటల్‌లో చనిపోయినా, శాశ్వత వైకల్యమైనా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షల నుంచి రూ.15లక్షలు చెల్లిస్తారు. ఇక వైద్యఖర్చులు అవసరమైన వారికి రూ.30వేలు, యాక్సిడెంటల్ ఇన్ పేషంట్ రూ.60వేలు, విద్య ప్రయోజనం గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు రూ.లక్ష, కోమటోస్ బెనిఫిట్ రూ.లక్ష, కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25 వేలు, అంత్యక్రియల ప్రయోజనం రూ.5వేలు, విరిగిన ఎముకలకు చికిత్స కోసం రూ.లక్ష, న్యూట్రీషనల్, మానసిక ఆరోగ్యం కోసం కన్సల్టెంట్, అన్‌లిమిటెడ్ టెలీకన్సల్టెన్సీ-ఓపీడీ సౌకర్యాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి...

- లావురి సైదా నాయక్, సబ్‌డివిజన్ ఇన్స్‌పెక్టర్, వరంగల్



ఆదిత్య బిర్లా కాపిటల్ హెల్త్ ఇన్సూరెన్స్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రీమియం ప్రారంభించిన 15రోజుల తర్వాత నుంచి బీమా వర్తిస్తుంది. పాలసీదారుడు మృతిచెందితే ఎఫ్ఐఆర్ కాపీ, ఇతర ధ్రువపత్రాలతో క్లెయిమ్ చేసుకున్న నెలరోజుల్లో బీమా ప్రయోజనం అందుతుంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

వినూత్నం

ఆర్కిడ్స్‌తో అందలానికి

కేరళకు చెందిన సబీరా మొహమ్మద్, కాలక్షేపం కోసం మొదలుపెట్టిన పూల మొక్కల పెంపకం, కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉద్యాన వన శ్రేష్ఠ' పురస్కారాన్ని అందుకునే స్థాయికి ఎదిగింది. విదేశాల నుంచి ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకుంటూ, నెలకు నాలుగు లక్షలు ఆర్జిస్తున్న సబీరా ఆసక్తికరమైన కథనమిది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఏడేళ్ల పాటు జీవించి, స్వస్థలమైన కేరళలోని పాలక్కాడ్‌కు తిరిగొచ్చినప్పుడు సబీనాకు రోజులు గడవడం కష్టంగా మారింది. భర్త పనికీ, పిల్లలు బడికీ వెళ్లిపోయాక, ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో ఆమెకు అర్థమయ్యేది కాదు. దాంతో తనకెంతో ఇష్టమైన గార్డెనింగ్‌తో కాలక్షేపం చేయాలని నిర్ణయించుకుంది సబీరా. అందుకోసం తన టెర్రస్‌నే తగిన ప్రదేశంగా ఎంచుకుంది. అలా 1998లో మల్లె, జాజి పూల మొక్కల పెంపకంతో మొదలైన సబీరా పూల మొక్కల పెంపకం ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ... "నేను దేశం నలుమూలల నుంచీ పూల మొక్కలను సేకరించేదాన్ని. కొరియర్ ద్వారా కొన్ని మొక్కలనూ, స్వయంగా నర్సరీలను సందర్శించడం ద్వారా ఇంకొన్ని మొక్కలనూ సేకరించేదాన్ని. మొక్కలు దొరకని సందర్భాల్లో విత్తనాలనూ, మొక్కల నమూనాలనూ సేకరించి పెంచుతూ ఉండేదాన్ని. క్రమేపీ నా టెర్రస్ మొత్తం రకరకాల పూల మొక్కలతో నిండిపోయింది. ఆ



తర్వాత నా ఆసక్తి ఆర్కిడ్ ప్లాంటేషన్ మీదకు మళ్లింది." అంటూ పూల మొక్కల పట్ల తన ఆసక్తిని పంచుకుంది సబీరా.

ఉద్యాన శ్రేష్ఠ అవార్డు అందుకుని...

సబీరా, ఆర్కిడ్ ప్లాంటేషన్ కోసం పాలక్కాడ్‌లోని కృష్ణ భవన్ నుంచి శాంప్లింగ్స్‌ను సేకరించింది. ఆర్కిడ్ కల్టివేషన్ గురించి లోతుగా అధ్యయనం చేసి, లెక్కలేనన్ని కొత్త వంగడాలనూ సేకరించింది. అలా ఆర్కిడ్ ప్లాంటేషన్‌లో ప్రత్యేకమైన గుర్తింపు పొందినందుకు గాను, 2006లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం 'ఉద్యాన శ్రేష్ఠ' పురస్కారంతో సత్కరించడం విశేషం. ఆ అవార్డుతో సబీరా పూల తోట ఎంతోమంది దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రవ్యాప్త పూల ప్రియులందరూ ఆమె టెర్రస్‌ను సందర్శించడం మొదలుపెట్టారు. ఆమె భర్త మొహమ్మద్ మూసా కూడా భార్యను ప్రోత్సహిస్తూ ఆర్కిడ్స్ పెంపకంలో సహాయపడడం మొదలుపెట్టాడు. అలా సబీరా థాయిల్యాండ్ నుంచి కూడా కొత్త రకం ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆమె దగ్గర 1300 రకాల ఆర్కిడ్స్ ఉన్నాయి.



టెర్రస్ నుంచి నర్సరీ వరకూ...

టెర్రస్ మొత్తం మొక్కలతో నిండిపోవడంతో, సబీరా తన మొట్టమొదటి నర్సరీ కోసం ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసింది. "నేను మొదట థాయిల్యాండ్ నుంచి, తర్వాత చైనా, తైవాన్, ఆగ్నేయాసియా దేశాల నుంచి ఆర్కిడ్ మొక్కలను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టాను" అంటూ ఆర్కిడ్ మొక్కల పట్ల తనకున్న ఆసక్తి గురించి వివరించింది. సబీరా ఆ ఒక్క నర్సరీతో ఆగిపోకుండా, పాలక్కాడ్ జిల్లాలోనే రెండో నర్సరీ మొదలుపెట్టి, దానికి పర్ల్ ఆర్కిడ్స్ అనే పేరు పెట్టింది. "ఆర్కిడ్స్‌ను పెంచడం కాస్త కష్టమైన పనే! అయినా టిష్యూ కల్చర్ ద్వారా నేను వాటిని సమర్థంగా పెంచగలిగాను.

మంచి బ్రీడర్ నుంచి టిష్యూ కల్చర్ సహాయంతో పెరిగిన ఆర్కిడ్స్‌ను కూడా కొనుగోలు చేశాను. వాణిజ్యపరమైన సాగుకు ఇలాంటి మొక్కలే ఉపయోగకరంగా ఉంటాయి" అని వివరిస్తున్న సబీరా నాణ్యమైన మొక్కల కోసం పేరున్న బ్రీడర్స్‌నే ఎంచుకుంటూ ఉంటుంది. అలాగే కస్టమర్లకు విక్రయించే ముందు, మొక్కల ఎదుగుదలను పరిశీలిచడానికి వీలుగా 50 వేల మొక్కలు ఉంచే ఒక క్వారంటీన్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా నెలకొల్పింది.

ఏడాదికి నాలుగు లక్షలు...

ఔషధాల తయారీ కోసం, అలంకరణ ప్రయోజనాల కోసం ఆర్కిడ్స్ వాడకం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. కాబట్టి సబీరా తన పెర్ల్ ఆర్కిడ్స్ నర్సరీ సహాయంతో ఒక్కొక సీడ్లింగ్‌ను రకాన్ని బట్టి, 80 నుంచి 100 రూపాయలకు విక్రయిస్తోంది. ఎదిగిన మొక్కలను 250 నుంచి 350 రూపాయలకు విక్రయిస్తోంది. మొక్కలను సేకరించే అభిరుచి కలిగినవాళ్లు, గార్డెనర్లు, రైతులు, హోల్‌సేల్ నర్సరీలు సబీరా నుంచి ఆర్కిడ్స్‌ను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఆ మొక్కల పెంపకం గురించి వివరిస్తూ... "పాటింగ్ మిక్స్‌ను తెప్పించుకుని, హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో దాన్ని శుభ్రపరిచి, వారం రోజుల పాటు నీళ్లతో కడిగి, తర్వాత ఎండలో ఆరబెట్టి వాడుకుంటామనీ, ఆ ప్రక్రియ మొత్తానికీ 8 నుంచి 9 రోజుల సమయం పడుతుంది" అంటూ వివరిస్తోంది సబీరా. శుభ్రం చేయని మిక్స్‌ను కిలోకు 100 రూపాయల చొప్పున, శుభ్రం చేసిన మిక్స్‌ను కిలోకు 150 రూపాయల చొప్పున విక్రయిస్తూ అదనపు ఆదాయాన్ని కూడా ఆర్జిస్తోందామె. ఇలా మొక్కల ద్వారా నెలకు దాదాపు నాలుగు లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్టు కూడా వివరించింది.

అభిరుచి





ఈ మామ్.. డిజిటల్ స్టార్

బడికి వెళ్లే తన పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనుకున్నారు. అదీ వారు ఇష్టంగా తినేలా..! దాని కోసం రోజుకొక వెరైటీ చేసి స్కూల్ లంచ్ బాక్స్‌లో సర్దేవారు. అవి సూపర్‌హిట్ అయ్యాయి. తమకూ ఆ రెసిపీ చెప్పమని విద్యార్థుల తల్లితండ్రులు వరుస కట్టారు. అలా అనుకోకుండా మొదలై... ఇప్పుడు 'మాస్టర్ చెఫ్ మామ్'గా లక్షల మందికి చేరువ అయ్యారు. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా టాప్-100 డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు దక్కించుకున్న ఫుడ్ బ్లాగర్, చెఫ్, రచయిత... ఉమా రఘురామన్ జర్నీ ఇది.

"అనుకున్నామని జరగవు అన్నీ. అనుకోలేదని ఆగవు కొన్ని. ఇన్నేళ్ల ప్రయాణంలో ఇదే నాకు బోధ పడిన జీవితం. నేనూ అందరిలాంటి అమ్మాయినే. చిన్నప్పటి నుంచీ వంటలపై ఆసక్తి. చదువుతో పాటు ఇంట్లో అమ్మతో కలిసి గరిట తిప్పడం నేర్చుకున్నా. మా స్వస్థలం చెన్నై. అక్కడి 'అన్నా యూనివర్సిటీ'లో బీకాం చదివాను. 'అన్నామలై విశ్వవిద్యాలయం' నుంచి ఎంకాం పట్టా పొందాను. ఆ తరువాత ఐదేళ్లకు పైగా కిండర్ గార్డెన్ టీచర్‌గా పని చేశాను. అదే సమయంలో నాకు రఘురామన్‌తో పెళ్లయింది. దాంతో మా నివాసం ఢిల్లీకి మారింది. మాకు ఇద్దరు పిల్లలు. వాళ్ల కోసం 2014లో ఉద్యోగం మానేశాను.

అత్తగారి స్ఫూర్తితో...

ఢిల్లీకి రావడంతో నాకు ఉత్తరాది రుచులు ఎన్నో పరిచయమయ్యాయి. ముఖ్యంగా మావారు రఘురామన్‌కు నార్త్‌ఇండియన్ డిషెస్‌పై అవగాహన ఎక్కువ. ఆయన ఏవేవో వంటల పేర్లు చెబుతుంటే... ఆసక్తిగా వినేదాన్ని వాటి ప్రత్యేకతల గురించి తెలుసుకొనే ప్రయత్నం చేసేదాన్ని. వారాంతాల్లో కుటుంబ సభ్యులు అందరూ ఒక చోట చేరినప్పుడు కలిసి వంట చేయడం ఒక ఆనవాయితీగా మారింది. అక్కడ ఎవరికి నచ్చిన వెరైటీలు వారు వండి వార్చేవారు. ఇక పెళ్లయ్యాక మా అత్తగారి దగ్గర ఎన్నో వెరైటీలు నేర్చుకున్నా. విభిన్న రుచుల్లో రసం, సాంబార్, స్వీట్స్ శ్నాక్స్‌తో పాటు పండుగల్లో ప్రత్యేక వంటలు ఆమె అద్భుతంగా వండుతారు. అంతేకాదు... మట్టి కుండలు, సంప్రదాయికమైన గిన్నెల్లో వంట చేయడం వారివల్లే నాకు అలవాటు అయింది. మా అత్తమ్మ స్ఫూర్తితో నేనూ కొత్త కొత్త వంటలు ప్రయత్నించేదాన్ని. చిన్నప్పుడు కూడా ఇడ్లీలు, శాండ్‌విచ్‌ల వంటివి తయారు చేసేదాన్ని. గులాబ్‌జామ్, మోదకం తయారీలో అమ్మమ్మకు సాయపడేదాన్ని. చపాతీలు, పూరీలకు కలిపిన పిండితో ఆడుకోవడమంటే నాకు మహా సరదా. మా అమ్మయితే ఉడకబెట్టిన బేబీ పొటాటోస్ తొక్కు తీసే పని ఎప్పుడూ నాకే అప్పజెప్పేది. అది నాకు ఇష్టమైన కూరగాయ.

అలా మొదలైంది...

ఉద్యోగం మానేశాక ఇంట్లో కాస్త ఖాళీ సమయం లభించేది. పిల్లలు బడి వయసుకు వచ్చారు. ఇడ్లీలు, దోశలు చేసి వారి లంచ్ బాక్స్‌లో పెట్టేదాన్ని. కొన్నాళ్లకు పిల్లలు... 'అమ్మా... ఎప్పుడూ ఇవేనా' అనేవారు. మేం స్కూలుకు వెళ్లే రోజుల్లో డబ్బాలో పెరుగు అన్నంతో పాటు పచ్చడి వేసి ఇచ్చేవారు. అలాగే రసం, సాంబారు లేదా బంగాళదుంప కూర అన్నం తీసుకువెళ్లేవాళ్లం. ఎంతో ఇష్టంగా తినేవాళ్లం. కానీ ఇప్పుడు పిల్లలకు ఎప్పటికప్పుడు వెరైటీలు కావాలి. కాలం మారింది. మనమూ మారాలని అర్థం చేసుకున్నాను. నాకు తెలిసి 'రేపటి టిఫిన్ బాక్స్ కోసం ఏం వండాలి' అని రాత్రి నిద్రపోయే ముందు ప్రతి తల్లీ ఆలోచిస్తుంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పిల్లలు ఇష్టపడేలా... సులువుగా తినేలా... పోషకాలు నిండిన వెరైటీలు వండిపెట్టాను. అవి మా పిల్లలకే కాదు, తోటివారికి కూడా బాగా నచ్చాయి. నా ప్రయత్నం ఫలించినందుకు ఎంతో సంతోషించాను. అదే సమయంలో నాలాంటి తల్లుల కోసం నా రెసిపీలన్నీ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను. 'మాస్టర్ చెఫ్ మామ్' పేరిట ఒక బ్లాగ్ తెరిచి... రెండు దశాబ్దాలుగా మా అమ్మ, అత్త, స్నేహితుల వద్ద నేర్చుకున్న వివిధ రకాల వంటలు అందరికీ పరిచయం చేశాను.



> పిల్లలు ఇష్టపడేలా... సులువుగా తినేలా... పోషకాలు నిండిన వెరైటీలు వండిపెట్టాను. అవి మా పిల్లలకే కాదు, తోటివారికి కూడా బాగా నచ్చాయి. నా ప్రయత్నం ఫలించినందుకు ఎంతో సంతోషించాను. అదే సమయంలో నాలాంటి తల్లుల కోసం నా రెసిపీలన్నీ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను.

వెయ్యికి పైగా రుచులు...

'మాస్టర్ చెఫ్ మామ్' ద్వారా ఇప్పటికి వెయ్యికి పైగా వంటల వీడియోలు అప్‌లోడ్ చేశాను. కుకింగ్, డెకరేటింగ్, షూటింగ్, ఎడిటింగ్... అన్నీ నేనే చూసుకొంటాను. అదికూడా మొబైల్ ఫోన్‌తో. ఒక్కో వీడియో రూపొందించి, అప్‌లోడ్ చేయడానికి పన్నెండు నుంచి పద్నాలుగు గంటల సమయం పడుతుంది. ఇది నా దినచర్యలో భాగం అయిపోయింది. ప్రధానంగా భారతీయ సంప్రదాయ వంటలను నేటితరానికి అందించేందుకు కృషి చేస్తున్నాను. అలాగే నవతరం తల్లులు తమ పిల్లలకు రుచితోపాటు బలవర్థకమైన ఆహారం ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నాను. ఇన్‌స్టాగ్రామ్‌లో పది లక్షలమంది నన్ను ఫాలో అవుతున్నారు. వారిలో సెలబ్రిటీలు కూడా ఉన్నారు. మా యూట్యూబ్ చానల్‌ను మూడున్నర లక్షల మంది సబ్‌స్క్రైబ్ చేశారు. అందులో మూడు లక్షల వ్యూస్ దాటిన వీడియోలు చాలానే ఉన్నాయి. అవకాడో కా మీఠా, దిల్ చెట్నీ, వాల్నట్ చాట్, పైనాపిల్ కేసరీ, పారుప్పు పాయసం, కలాకండ్, తోటకూర పప్పు, సాంబార్ పొడి... ఇలా ఎన్నో రకాల వంటలు క్రమంత తప్పకుండా సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నాను. కొన్ని చిట్కాలు కూడా అందిస్తున్నాను. ఒక్కో పోస్టుకు వేలల్లో లైక్‌లు వస్తున్నాయి. దానికంటే నా వంటలు ప్రయత్నించి, బాగున్నాయంటూ కొందరు కామెంట్ చేస్తుంటారు. అవి నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తాయి.

'ఫోర్బ్స్' డిజిటల్ స్టార్...

పదేళ్లగా ఫుడ్ బ్లాగింగ్‌లో ఉన్న నన్ను పలు అవార్డులు వరించాయి. ప్రముఖుల ప్రశంసలు ఎన్నో లభించాయి. 'నెట్‌ఫ్లిక్స్ ఆసియాస్ మై చెఫ్స్ టేబుల్ ఇన్‌స్టాగ్రామ్' పోటీలో విన్నర్‌గా నిలిచాను. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ చెఫ్ నాన్సీ సెల్వర్టన్‌ను కలవడం నా జీవితంలోనే ఓ మధురానుభూతి. వంటలకు సంబంధించి 'మై జీనియస్ లంచ్ బాక్స్' పేరుతో ఒక పుస్తకం కూడా రాశాను. 'పెంగ్విన్ రాండమ్ హౌస్' దాన్ని ప్రచురించింది. ఫ్లిప్‌కార్ట్, వావ్ మోమోస్, యూనిలివర్, మదర్ డైరీ అండ్ ఐటీసీ తదితర ప్రముఖ బ్రాండ్స్‌తో కలిసి పని చేశాను. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు దక్కింది. ఈ జాబితాలో నా పేరు చూసుకోవడం ఇది రెండోసారి. ఇద్దరు పిల్లల తల్లిగా... ఇంట్లో కూర్చొనే నేను ఇంత సాధించానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. స్మార్ట్‌ఫోన్ల యుగంలో నాలాంటి గృహిణులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అదికూడా తక్కువ ఖర్చుతో. కాలంతో పరుగెత్తే ఉత్సాహం, మారుతున్న పరిస్థితులను అంచనా వేయగల సామర్థ్యం, సృజనాత్మకంగా ఆలోచించడం... ఇవి ఉంటే కంటెంట్ క్రియేటర్‌గా రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు నేనే ప్రత్యక్ష సాక్ష్యం."

ఇంట్లో అమ్మ దగ్గర నేర్చుకున్న పాకశాస్త్ర నైపుణ్యమే! ఎక్కడా చెఫ్‌గా పనిచేసిన అనుభవం కూడా లేదు. అయితేనేం... మాస్టర్ చెఫ్ ఇండియా పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. ఇండియాలో మొదటి మాస్టర్ చెఫ్‌గా గుర్తింపు సాధించారు పంకజ్ భదౌరియా. స్కూల్ టీచర్ నుంచి మాస్టర్ చెఫ్‌గా ఆమె ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆ విశేషాలు ఇవి...

అమ్మే నాకు గురువు

అమ్మ వంట చేస్తున్నప్పుడు కిచెన్‌లో నుంచి వచ్చే మసాలా ఘుమఘుమలు ఆమెను కుదురుగా కూర్చోనిచ్చేవి కాదు. ఆ సువాసనలే కుకింగ్‌పై ఇష్టాన్ని పెంచేలా చేశాయి. గంటల కొద్దీ అమ్మతో పాటు కిచెన్‌లో గడిపేవారు. రకరకాల వంటలు ఎలా చేయాలో నేర్చుకున్నారు. వంటలు రుచిగా రావడానికి కీలకమైన మసాలాల తయారీలో నైపుణ్యం సంపాదించారు. అదే ఆమెను ఇండియా ఫస్ట్ మాస్టర్ చెఫ్‌గా నిలబెట్టింది. ఆమె పేరు పంకజ్ భదౌరియా. లక్నోకు చెందిన పంకజ్ మొదట ఈ రంగం వైపు రాలేదు. పదహారేళ్ల పాటు టీచర్‌గా పనిచేశారు. హైస్కూల్ విద్యార్థులకు చదువు చెబుతున్న మనసులో ఏదో వెలితి. తన కలను సాకారం చేసుకోవడానికి ఏదైనా చేయాలని, అది ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదని అనుకున్నారు. వెంటనే టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

మొదటి అడుగుతోనే విజయం

ఉద్యోగానికి రాజీనామా చేసిన తరువాత మాస్టర్ చెఫ్ ఇండియా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు పంకజ్. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆ పోటీ సాధారణమైనది కాదు. దేశవ్యాప్తంగా ఎంతో అనుభవం ఉన్న చెఫ్‌లు బరిలో ఉంటారు. అలాంటి కాంపిటీషన్‌లోకి ఎంట్రీ అయ్యాక ఆమె ఎన్నో సవాళ్లను, అడ్డంకులను ఎదుర్కొన్నారు. అయితే ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి అద్భుతమైన సహకారం లభించింది. పోటీల్లో వంటలను సరికొత్త పద్ధతుల్లో తయారుచేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించారు. సంప్రదాయ భారతీయ ఫ్లేవర్లకు ఆధునిక టెక్నిక్స్‌ను జోడించి న్యాయనిర్ణేతల దృష్టిలో పడ్డారు. అదే సమయంలో ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. ఎప్పటికప్పుడు తన నైపుణ్యాలను మెరుగుపరుకుంటూ పంకజ్ ముందుకెళ్లారు. కొన్ని వారాల పాటు సాగిన పోటీల్లో చివరకు పంకజ్ విజేతగా నిలిచారు. మాస్టర్ చెఫ్ ఇండియాగా టైటిల్



అందుకున్నారు. "మా పేరెంట్స్ ఇద్దరూ అద్భుతంగా వంట చేస్తారు. మా అమ్మ పెళ్లయిన తరువాతే నానమ్మ దగ్గర వంట నేర్చుకుందట. మా ఇంట్లో ఏదైనా ఫంక్షన్స్ జరిగితే రుచికరమైన కొత్త కొత్త వంటలు తయారుచేశారు. వాటిని రుచి చూసేందుకు స్నేహితులు, బంధువులు ఆసక్తిగా ఉండేవారు. అది నాకు స్ఫూర్తిని చ్చేది. అమ్మే నాకు గురువు" అంటారు పంకజ్.


అశేష అభిమాన గణం

ఆ విజయం తరువాత పంకజ్‌కు వెనుదిరిగి చూసుకునే అవకాశం రాలేదు. ఆ రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగారు. టెలివిజన్ షోలు చేశారు. వంటలకు సంబంధించి పుస్తకాలు రాశారు. 'మాస్టర్ చెఫ్ ఇండియా కుక్‌బుక్', 'చికెన్ ఫ్రం మై కిచెన్' పుస్తకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించిపెట్టాయి. 'కేఫ్ బై డీఫాల్ట్' పేరుతో లక్నోల్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. రుచికరమైన ఆహారం లభించే రెస్టారెంట్‌గా ఇది గుర్తింపు పొందింది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, న్యూయార్క్‌లోని వర్ల్డ్ ఫుడ్ ఫెస్టివల్, బీబీసీ సిరీస్ వంటి ప్లాట్‌ఫామ్స్ నుంచి అందిన ఆహ్వానం మేరకు వాటిలో పాల్గొన్నారు. ఈవెంట్లు, సెమినార్లు, టెడెక్స్ సెషన్లతో బిజీబిజీగా గడిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ఫుడ్ వర్క్‌షాపుల్లో, సెమినార్లలో, ఫుడ్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్నారు. "మా ఆయన సపోర్టు లేకుంటే ఈ విజయం సాధించేదాన్ని కాదు" అని అంటారు పంకజ్. సామాజిక కార్యక్రమాల్లోనూ పంకజ్ ఎప్పుడూ ముందు ఉంటారు. యునిసెఫ్‌తో, స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. ఎన్‌జీఓలతో కలిసి ఫండ్ రైజింగ్ వర్క్‌షాపుల్లో పాల్గొన్నారు. రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. చెఫ్‌లు ఎదగాలనుకుంటున్న ఎంతో మందికి ఆమె స్ఫూర్తిగా నిలిచారు. "హార్డ్‌వర్క్‌తోనే ఈ స్థానానికి చేరుకున్నాను" అని వినమ్రంగా అంటారామె. అంకితభావం, పట్టుదల, సృజనాత్మకత ఉంటే విజయం సాధించవచ్చని నిరూపించారు పంకజ్ భదౌరియా.

ఫ్యాషన్

స్వర్ణ కాంతులు కేవలం పట్టు చీరలకే పరిమితం కాదు. ధగధగలు చిందించే వేరే చీరలూ ఉన్నాయి. అవే 'గోల్డ్ లైక్రా' శారీస్. ఈవెంట్స్, పార్టీలు, ఫంక్షన్లలో స్వర్ణకాంతులతో వెలిగిపోవాలంటే ఇవిగో ఈ గోల్డ్ లైక్రా చీరలే కట్టుకోవాలి!

లవ్లీ లైక్రా





- ఎలాస్టిక్‌లా సాగుతూ, మెత్తగా, ఒంటికి హత్తుకుపోయేలా ఉంటాయి లైక్రా చీరలు. ప్లెయిన్ లైక్రా చీరలను సెక్విన్ వర్క్ ఉన్న బ్లౌజ్‌తో మ్యాచ్ చేసి కట్టుకుంటే స్టయిలిష్‌గా కనిపిస్తారు!
- నెటెడ్ మెటీరియల్‌తో జోడించి, బార్డర్‌లో మెరుపులీనే అటాచ్‌మెంట్స్‌తో కూడా లైక్రా చీరలను డిజైన్ చేసుకోవచ్చు. ఇలాంటివి ధరిస్తే పార్టీల్లో ప్రత్యేకంగా కనిపిస్తారు.
- ఎరుపు, బంగారు వర్ణాల కలబోత ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కాబట్టి రెడ్ అండ్ గోల్డ్ లైక్రా చీరలను కూడా ఎంచుకుంటూ ఉండాలి. ఈ వెరైటీ చీరల ముందు పట్టు చీరలు కూడా వెలవెలపోతాయి.

హుందాగా, స్టైల్‌గా... మెరుపులీనే లైక్రా చీరలు అవసరానికి మించి ఆకట్టుకుంటూ, ఎబ్బెట్టుగా కనిపిస్తాయని భయపడవలసిన అవసరం లేదు. నిజానికి సరిజోడుగా ఉండే జ్యువెలరీ, ఇతరత్రా యాక్సెసరీస్‌ను జోడిస్తే, లైక్రా చీరల్లో కచ్చితంగా లవ్లీగా కనిపించవచ్చు. ఇందుకోసం టెంపుల్ జ్యువెలరీ లేదా యాంటిక్ జ్యువెలరీ ఎంచుకోవాలి. సందర్భానికి తగినట్టు మిగతా యాక్సెసరీస్‌ను కూడా ఎంచుకోవాలి. భారీ నగలకు బదులుగా వీలైనంత సింపుల్ నగలనే ధరించాలి. రాళ్లు పొదిగిన నగలైతే చాలా బాగుంటాయి. చేతిలో స్టోన్ స్టడెడ్ పర్స్, పాదాలకు హైహీల్స్ లేదా వెడ్జెడ్ హీల్స్ నప్పుతాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 23 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

రావణుడిగా నటిస్తున్నా



కేజీఎఫ్ స్టార్ యశ్ హిందీ 'రామాయణ్'లో రావణుడి పాత్రను పోషిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇందులో రాముడి పాత్రను రణబీర్ కపూర్, సీత పాత్రను సాయిపల్లవి చేస్తున్నారని తెలిపారు. నితిశ్ తివారీ భారీ స్థాయిలో రూపొందిస్తున్న 'రామాయణ్' నిర్మాణంలో తను కూడా ఉన్నాననీ, అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను తీయాలనుకుంటున్నట్లు యశ్ వెల్లడించారు. 'ద హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'రామాయణ్' చిత్రానికి సంబంధించిన అనేక విషయాలు వెల్లడించారు. 'లాస్ ఏంజెల్స్‌లో టాక్సిక్ చిత్రం వీఎఫెక్స్ వర్క్ కోసం ఉన్నప్పుడు డీఎన్ఈజీ విఫెక్స్ కంపెనీ అధినేత నమిత్ మల్హోత్రా నన్ను కలిసి 'రామాయణ్' చిత్రం గురించి చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా ఆ ప్రాజెక్ట్ మీద వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. అప్పుడే రావణుడి పాత్ర చేయమని నన్ను అడిగారు. ఆ పాత్రను పాత్రగానే తీస్తే నేను తప్పకుండా నటిస్తానని చెప్పా. ఆ తర్వాత నితీశ్ తివారీని కలిశా. ఆయనతో మాట్లాడిన తర్వాత నేను కూడా నిర్మాణంలో భాగస్వామినయ్యా. రణబీర్‌ను రాముడిగా అనుకున్నారు. సీతగా సాయిపల్లవిని తీసుకోవాలని అనుకున్నట్లు చెప్పగానే మంచి సెలెక్షన్ అని చెప్పా' అన్నారు.

యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ



కన్నడ నటుడు, 'ఉగ్రమ్' ఫేమ్ శ్రీమురళీ నటించిన చిత్రం 'బఘీరా'. డాక్టర్ సూరి దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించారు. ప్రశాంత్ నీల్ అందించిన కథతో తెరకెక్కిందీ చిత్రం. ఈ నెల 31న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా శ్రీమురళి మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నాది లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్. ఈ సినిమాలో లుక్ కోసం మూడేళ్లు కష్టపడ్డాను. ప్రశాంత్ నీల్ ఇచ్చిన కథకు దర్శకుడు సూరి 100 శాతం న్యాయం చేశారు. ఆయన దర్శకత్వ ప్రతిభ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. ఇది యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ. ఈ సినిమా యాక్షన్ ప్రియులకు ఫుల్ మీల్స్‌లా ఉండనుంది. ఇందులో ప్రకాశ్‌రాజ్ ఓ కీలక పాత్ర పోషించారు. ఆయనతో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. హీరోయిన్ రుక్మిణీ వసంత్ తన నటనతో కట్టిపడేస్తారు. సంగీతం, విజువల్స్ ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.



ఆర్ఆర్ఆర్... అంతకుమించి

మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. దీని వర్కింగ్ టైటిల్ ఎస్ఎస్ఎంబీ29. శ్రీ దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై డాక్టర్ కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులపైనే మేకర్స్ దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. ఇటీవల అంతర్జాతీయ జర్నలిస్టులతో ఆయన మాట్లాడారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతోపాటు జంతువులు పాల్గొన్న యాక్షన్ సన్నివేశం సినిమాకు హైలెట్‌గా నిలిచింది. అంతర్జాతీయంగా రాజమౌళికి ఇది మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు మహేశ్‌బాబుతో తీయబోయే సినిమాలో కూడా జంతువుల సీక్వెన్సులు ఉంటాయని రాజమౌళి తెలిపారు. ఈ మూవీ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విషయాలను అధ్యయనం చేసేందుకు పలు తరగతులకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మూవీని రెండు భాగాలుగా తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు కూడా చెప్పారు. కాగా, ఈ మూవీ షూట్ జనవరి నుంచి ప్రారంభం కానుంది.

మసాలా చిత్రాల్లో నటించను

తమిళ చిత్రం 'తిరుచిత్రంబలం'కి గాను ఉత్తమ నటిగా నేషనల్ అవార్డు అందుకొని ఫుల్ జోష్‌లో ఉన్నారు నిత్యామీనన్ . ప్రస్తుతం 'కాదలిక్క నేరమిల్లై', 'డియర్ ఎక్సెస్', ధనుశ్‌తో 'డీడీ4' (వర్కింగ్ టైటిల్) చిత్రాల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా మీడియాతో ముచ్చటించిన ఆమె కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "ఉత్తమ నటిగా జాతీయ అవార్డును అందుకుంటానని కలలో కూడా ఊహించలేదు. నేను పోషించే ప్రతీ పాత్రకూ గుర్తింపు రావాలని కోరుకునే మనస్తత్వం కాదు నాది. నాకు సంతృప్తినిచ్చే పాత్రలనే ఎన్నుకోవడానికి ఇష్టపడతా. భారీ బడ్జెట్‌తో తీసే మసాలా చిత్రాల్లో ఎంత పెద్ద అవకాశం వచ్చినా నో చెప్పేస్తా. అలాంటి పాత్రలు పోషించడం నాకు ఇష్టం లేదు. పాత్ర మంచిదైతే అది చిన్న సినిమా అయినా వెంటనే అంగీకరిస్తాను. మంచి కథలు రాసి.. నాలోని నటికి సవాలు విసిరే పాత్రలను సృష్టించే దర్శకులతో పనిచేయాలని ఉంది. ఇన్నాళ్ల నా కెరీర్‌లో నేను ఇప్పటిదాకా చేసింది చాలా తక్కువ.. సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. బాలీవుడ్‌లో ప్రతిభావంతులైన దర్శకులు ఎంతో మంది ఉన్నారు. నాకు దర్శకుడు విక్రమాదిత్య మోత్వానే చిత్రాలంటే చాలా ఇష్టం. ఆయన తెరకెక్కించిన 'లూటేరా' చిత్రం నా ఆల్‌టైమ్ ఫేవరెట్ ఫిల్మ్. ఆయన సినిమా తీసే విధానం అద్భుతంగా ఉంటుంది. ఆయనతో కలసి ఓ సినిమా చేయాలనుంది" అని చెప్పారు.



పోలీసులు నవ్వారు




'కార్తికేయ-2', 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాల్లో నటించి, మెప్పించిన బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్. ఇటీవల ఆయన ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఓ సారి తన కారు చోరీకి గురికాగా ఫిర్యాదు చేస్తుంటే పోలీసులు నవ్వారని నాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. 'నాకు డ్రైవ్ చేయడం నచ్చదు. కానీ, ఓ రోజు ముంబయిలో అమ్మవారి దేవాలయానికి నేనే కారు డ్రైవ్ చేస్తూ వెళ్లా. కారును పార్క్ చేసి ఆలయ ప్రాంగణంలోకి చేరుకున్నా. అక్కడి నుంచి చూస్తుంటే.. నా కారును ఓ వ్యక్తి తీసుకెళ్లడం కనిపించింది. వెంటనే కిందికి వచ్చి ఆటో ఎక్కి.. ఆ కారును ఫాలో అవ్వమని డ్రైవర్‌కు చెప్పా. మేం అతడిని పట్టుకోలేకపోయాం. ఫిర్యాదు చేద్దామని సమీప పోలీసుస్టేషన్‌కు వెళ్లా. నా వాహనం ఎలా పోయిందో పోలీసులకు వివరిస్తుంటే.. వారు పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు' అని అనుపమ్ ఖేర్ నాటి సంఘటనను వివరించారు.

'రంగస్థలం' తర్వాత.. అంత బాగా తీసిన చిత్రమిదే



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ "ఈ సినిమా చూశాను. దర్శకుడు సాహిత్ అద్భుతంగా తెరకెక్కించారు. 'రంగస్థలం' తర్వాత.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో అంత బాగా తీసిన చిత్రమిదే" అని చెప్పారు. "ఈ సినిమా మీకు మునుపెన్నడూ చూడని అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాను" అని దర్శకుడు సాహిత్ మోత్కూరి అన్నారు. "ఈ సినిమాలో భాగమైనందుకు గర్వపడుతున్నా" అని హీరోయిన్ అనన్య నాగళ్ల తెలిపారు.

ఎనభై రెండేళ్ల వయసులోనూ.. అదే ఉత్సాహం!



హాలీవుడ్ నటుడు హారిసన్ ఫోర్డ్ పేరు వినగానే ఆయన నటించిన 'స్టార్ వార్స్', 'ఇండియానా జోన్స్' వంటి చిత్రాలు వెంటనే గుర్తుకు వస్తాయి. ఈ ఎనభై రెండేళ్ల నట శిఖరంకు ఇప్పటికీ నటన అంటే ఎంతో ఇష్టం. చిత్ర పరిశ్రమలోకి నూతన దర్శకులు వస్తున్నారు, కొత్త ఆలోచనలతో సినిమాలు తీస్తున్నారు. అటువంటి వాళ్లతో పని చేయడం నాకు ఎప్పుడూ ఆనందమే. ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హారిసన్ మాట్లాడుతూ 'నాకు హాస్యం అంటే ఇష్టం. జోక్స్ వెయ్యడం, ఎంజాయ్ చేయడం చేస్తుంటాను. కామెడీతో కూడిన ఎమోషనల్ డ్రామా కథలను ఎక్కువగా ఇష్టపడతాను. వాటినే ఎన్నుకుంటాను' అని చెప్పారు. ఈ నెల 16న ప్రారంభమైన కామెడీ సిరీస్ 'ష్రింకింగ్' సీజన్ 2లో హారిసన్ ఫోర్డ్ నటిస్తున్నారు.

అరుదైన ఘనత

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పొలిటికల్ థ్రిల్లర్ గేమ్‌చేంజర్ వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదలవుతోంది. మరోవైపు, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న 'ఆర్‌సీ 16' గురించి ఓ కీలక అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలాఖరు నుంచి మైసూరులో ప్రారంభం అవుతుంది. మైసూరులో 15 రోజుల పాటు షూట్ జరుపుతారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఓ భారీ సెట్ వేసి షూటింగ్‌ను కొనసాగిస్తారు.



క్వీన్ ఎలిజిబెత్ తర్వాత...

సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహం ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది వేసవి నుంచి ఈ విగ్రహం సందర్శకులకు అందుబాటులోకి రానుంది. ఈ విగ్రహంలో రామ్‌చరణ్‌తో పాటు తన పెంపుడు కుక్క రైమీ కూడా కనువిందు చేయనుంది. క్వీన్ ఎలిజిబెత్ తర్వాత పెంపుడు కుక్కతో మైనపు విగ్రహంలో కనిపించే రెండో వ్యక్తి రామ్‌చరణే అట. ఈ అరుదైన గౌరవం తమ అభిమాన హీరోకి దక్కడంతో, రామ్‌చరణ్ అభిమానులు ఆనందంలో తేలిపోతున్నారు.

రూ. పది కోట్ల కొత్త కారు...



రామ్‌చరణ్ గ్యారేజ్‌లో కొత్త కారు చేరింది. దాదాపు రూ. పది కోట్ల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఇంపోర్టెడ్ కారును ఆయన ఇటీవలే కొనుగోలు చేశారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం తన కారును రిజిస్ట్రేషన్ చేయించారు. రోల్స్ రాయిస్ నుంచి వెలువడిన మొదటి ఎలక్ట్రిక్ కారు ఇదే.

అన్యోన్యతను చూసి ఓర్వలేక..

శ్రీనివాస్ ఉలిశెట్టి, శాంతిప్రియ హీరో హీరోయిన్లుగా ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన చిత్రం 'ఎంత పని చేశావ్ చంటి'. ఈ నెల 25న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నరసాపురం వైఎన్ఎం కళాశాలలో ఆడియో ఫంక్షన్ నిర్వహించారు. 'భార్యా భర్తల అన్యోన్యతను చూసి ఓర్వలేక ఒక అమ్మాయి వాళ్ల జీవితంలోకి వస్తుంది. దాంతో కథంతా మారుతుంది. ఆ అమ్మాయి కూడా తన జీవితంలో ఓ మగాడి చేతిలో మోసపోతుంది. ఈ మగాడూ అలాంటి వాడే అనుకొని ఆ అమ్మాయి వాళ్ల జీవితంలోకి వచ్చి ఇబ్బంది పెడుతుంది. ఈ కథ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని మేకర్స్ తెలిపారు.



ప్రజా సమస్యలపై పోరాటం



రాకేశ్ వర్రే టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి క్రియేషన్స్‌పై ముదుగంటి రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఉయ్యాలా జంపాల', 'మజ్ను' సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1980 కాలంలో జగిత్యాల చుట్టు పక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ఈ సినిమాలో చూపించినట్లు చిత్రబృందం తెలిపింది. వైశాలి రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషించారు.

ఒకేసారి రెండు సినిమాలు



'కాఫీ విత్ ఏ కిల్లర్, 'సోలో బాయ్' సినిమాల అప్డేట్స్ ఇచ్చారు ప్రముఖ నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్. 'గతంలో నేను తీసిన 'బట్టల రామస్వామి' బయోపిక్, 'అందరి బంధువయా' మంచి పేరును తీసుకొచ్చాయి. కొవిడ్ టైమ్‌లో కూడా బట్టల రామస్వామిని ప్రజలు ఆదరించారు. అలాగే 'కాఫీ విత్ ఏ కిల్లర్, 'సోలో బాయ్' సినిమాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి అని మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'కంటెంట్ ఉంటే సినిమాని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. నా గత సినిమాల మాదిరిగానే ఈ రెండు సినిమాలనూ డిఫరెంట్ జానర్‌లో చేశాము. 'సోలో బాయ్' సినిమా ద్వారా నవీన్ కుమార్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం.' అని సతీష్ తెలిపారు.







అదానీ చేతికి ఓరియెంట్ సిమెంట్

డీల్ విలువ రూ.8,100 కోట్లు.. ఒక్కో షేరుకు రూ.395.40 చొప్పున చెల్లింపు



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో టేకోవర్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా అదానీ గ్రూప్ కంపెనీ అంబుజా సిమెంట్.. సీకే బిర్లా గ్రూప్ కంపెనీ 'ఓరియంట్ సిమెంట్'ను కొనుగోలు చేసింది. ఇందుకోసం ముందుగా ప్రమోటర్లు సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 46.8 శాతం ఈక్విటీ వాటాను ఒక్కో షేరుకు రూ.395.40 చొప్పున మొత్తం రూ.3,791 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మరో 26 శాతం వాటా కోసం త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలు కోసం అంబుజా సిమెంట్ మొత్తంగా రూ.8,100 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఇందుకు అవసరమైన నిధులను అదానీ గ్రూప్ పూర్తిగా అంతర్గత వనరుల ద్వారా సమీకరించనుంది.

85 లక్షల టన్నుల సామర్థ్యం: ఓరియెంట్ సిమెంట్ కంపెనీకి ప్రస్తుతం 85 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో మూడు సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో ఒక ప్లాంటు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్ వద్ద, మరో ప్లాంటు కర్ణాటక, గుల్బర్గా సమీపంలోని చిత్తాపూర్ వద్ద ఉన్నాయి. ఇంకో ప్లాంటు ఉత్తర భారత్‌లోని రాజస్థాన్‌లో ఉంది. ఇవికాకుండా ఓరియెంట్ సిమెంట్ మరో 81 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. కాగా ఓరియెంట్ సిమెంట్ టేకోవర్‌తో అంబుజా సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 9.74 కోట్ల టన్నులకు చేరనుంది. ఈ కొనుగోళ్లతో 2028 నాటికి సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకోవాలన్న లక్ష్యానికి దోహదం చేస్తాయని గ్రూప్ భావిస్తోంది.

ఈ ఏడాది రెండో కొనుగోలు: సిమెంట్ రంగంలో మార్కెట్ లీడర్, ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ కంపెనీ అల్ట్రాటెక్‌తో పోటీపడాలన్నది అదానీ గ్రూప్ లక్ష్యం. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబరులో సంఘీ ఇండస్ట్రీస్‌ను రూ.5,185 కోట్లకు, ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పెన్నా సిమెంట్‌ను రూ.10,422 కోట్లకు అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. ఇదే సమయంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దక్షిణ భారత మార్కెట్‌పై మంచి పట్టున్న ఇండియా సిమెంట్ కంపెనీని ఈ ఏడాది జూలైలో రూ.3,945 కోట్లకు కొనుగోలు చేసింది.

షేర్.. బేజార్!

స్టాక్ మార్కెట్ భారీ పతనం

- సెన్సెక్స్ 930 పాయింట్లు డౌన్
- 2 వారాల కనిష్ఠ స్థాయికి సూచీ
- 24,500 దిగువకు జారిన నిఫ్టీ
- రూ.9.19 లక్షల కోట్ల సంపద ఫట్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ పతనాన్ని చవిచూశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,000 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివరికి 930.55 పాయింట్ల (1.15 శాతం) నష్టంతో 80,220.72 వద్ద స్థిరపడింది. ఆగస్టు 14 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ 309 పాయింట్లు (1.25 శాతం) కోల్పోయి 24,472.10 వద్ద ముగిసింది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు అన్ని రంగాల, విభాగాల షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఇందుకు తోడు, అమెరికాలో బాండ్ల రేట్లు పెరుగుతుండటం, చైనా వడ్డీ రేట్లు తగ్గించిన నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి మరిన్ని పెట్టుబడులను ఉపసంహరించడం మార్కెట్‌ను మరింత కుంగదీసింది.

అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.19 లక్షల కోట్లు తగ్గి రూ.444.45 లక్షల కోట్లకు (5.29 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో ఐసీఐసీఐ బ్యాంక్ వినహా అన్నీ నష్టపోయాయి.

హ్యుండయ్..ఫ్చ్

- తొలిరోజే 7.12 శాతం క్షీణించిన షేరు ధర



వాహన తయారీ సంస్థ హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) లిస్టింగ్ ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. మంగళవారం కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1960తో పోలిస్తే, బీఎస్ఈలో సంస్థ షేరు 1.47 శాతం తగ్గుదలతో రూ.1,931 వద్ద లిస్టయింది. ప్రారంభ ట్రేడింగ్‌లో కొద్దిగా తేరుకుని మళ్లీ 1,968.80 వద్దకు చేరిప్పటికీ, మళ్లీ భారీగా పతనమైంది. ఒక దశలో 7.80 శాతం క్షీణించి రూ.1,807.058 వద్దకు జారిన షేరు ధర.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 7.12 శాతం నష్టంతో రూ.1,820.40 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలోనూ హ్యుండయ్ షేరు 7.16 శాతం నష్టంతో రూ.1,819.60 వద్ద క్లోజైంది. బీఎస్ఈలో 15.87 లక్షల షేర్లు ట్రేడవగా.. ఎన్ఎస్ఈలో 286.20 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ ఐపీఓ భారత మార్కెట్ పట్ల తమ కమిట్‌మెంట్‌కు నిదర్శనమని షేర్ల లిస్టింగ్ కార్యక్రమంలో హ్యుండయ్ మోటార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యుయిసున్ చంగ్ అన్నారు.

ఐదో అత్యంత విలువైన వాహన సంస్థ: తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి, హ్యుండయ్ మోటార్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) దాదాపు రూ.1.48 లక్షల కోట్లకు చేరుకుంది. దాంతో దేశంలోనే ఐదో అత్యంత విలువైన వాహన కంపెనీగా హ్యుండయ్ అవతరించింది.

అమ్మకానికి జీవీకే పవర్ ఆస్తులు

- ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ కోరిన సీఓసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకేపీఐఎల్)పై దివాలా ప్రక్రియ వేగం పుంజుకుంది. కంపెనీ నుంచి రావాల్సిన రూ.18,000 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ నేతృత్వంలోని ఐదు బ్యాంకుల రుణదాతల కమిటీ (సీఓసీ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంపెనీ ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్స్‌ను ఆహ్వానించాయి. సీఓసీ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. తమ బకాయిల వసూలు కోసం ఈ బ్యాంకులు ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. రుణాలు, హామీల రూపంలో జీవీకే పవర్.. బ్యాంకులకు ఈ మొత్తం చెల్లించాల్సి ఉంది. ఈ రుణాలు, హామీలను జీవీకే గ్రూప్ విదేశాల్లోని ఈ బ్యాంకుల శాఖల నుంచి తీసుకుంది. దీంతో ఈ బ్యాంకులకు తమపై ఎన్‌సీఎల్‌టీకి వెళ్లే అధికారం లేదని జీవీకే పవర్ చేసిన వాదనను ఎన్‌సీఎల్‌టీ ఇప్పటికే తిరస్కరించింది.

ఒలెక్ట్రా లాభంలో 156% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా 156 శాతం వృద్ధి చెంది రూ.47.65 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.18.58 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 70 శాతం వృద్ధితో రూ.523.67 కోట్లకు చేరుకుంది.

కొత్త లోగోతో బీఎస్ఎన్ఎల్‌కు కళ

7 కొత్త సర్వీసులు ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పూర్వ వైభవం పునరుద్ధరించుకునేందుకు కొత్త హంగులతో ప్రజల ముందుకు వస్తోంది. అందులో ఒకటి కొత్త లోగో విడుదల చేయడం కాగా మంగళవారం 7 కొత్త సేవలను ప్రారంభించింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ సేవలను ప్రారంభించారు. వాటిలో స్పామ్ బ్లాకర్, సిమ్ కియోస్కులు, దేశంలోనే ప్రప్రథమంగా డైరెక్ట్ టు డివైస్ సర్వీసు ఉన్నాయి. అలాగే సీడాక్ భాగస్వామ్యంతో పూర్తిగా దేశీయంగా తయారైన పరికరాలను ఉపయోగించి మైనింగ్ కార్యక్రమాల్లో ఉన్న వారు క్షణాల్లో సమాచారం అందుకునేందుకు వీలుగా 5జీ కనెక్టివిటీని కూడా కల్పించింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా విడుదల చేసిన 4జీ సర్వీసులను త్వరలో పూర్తిస్థాయి 4జీ సర్వీసులుగా విస్తరిస్తారు. ప్రస్తుతం మార్కెట్ వాటా విషయంలో ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల కన్నా బీఎస్ఎన్ఎల్ చాలా వెనుకబడి ఉంది.

ఢిల్లీ, ముంబై నగరాల్లో "నెట్‌వర్క్ యాజ్ ఏ సర్వీస్" పేరిట కొత్త ఫైనాన్సింగ్ మోడల్‌ను కూడా ప్రారంభించనుంది. దేశంలోనే తొలి డైరెక్ట్ టు డివైస్ కనెక్టివిటీ సొల్యూషన్ ఉపగ్రహ, కేబుల్ మొబైల్ నెట్‌వర్క్‌లు రెండింటినీ అనుసంధానం చేస్తుంది. అలాగే ఫైబర్ టు ద హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) కస్టమర్లకు వైఫై రోమింగ్ సర్వీసును ప్రవేశపెట్టింది. దీని వల్ల వారికి ఎలాంటి అదనపు చార్జి లేకుండానే బీఎస్ఎన్ఎల్ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో హై స్పీడ్ ఇంటర్నెట్ యాక్సెస్ లభిస్తుంది.

- టయోటా కిర్లోస్కర్ మోటార్ మార్కెట్లోకి ఫెస్టివల్ ఎడిషన్ రుమియాన్ విడుదల చేసింది. టయోటా జెన్యూన్ యాక్సెసరీస్ ప్యాకేజీ (టీజీఏ)తో దీన్ని తీసుకువచ్చింది. ఈ ప్యాకేజీ విలువ రూ.20,608. కాంప్లిమెంటరీ యాక్సెసరీస్ ప్యాకేజీతో అన్ని టయోటా డీలర్‌షిప్‌ల్లో రుమియాన్ ఈ నెల 31 వరకు అందుబాటులో ఉంటుంది.
- సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పీసీ జువెలర్స్ రూ.505 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.124 కోట్ల పన్ను చెల్లింపునకు ముందు (పీబీటీ)ని ఆర్జించింది. కాగా సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధానికి గాను కంపెనీ రెవెన్యూ 797 శాతం వృద్ధి చెంది రూ.906 కోట్లుగా నమోదైంది
- ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఇండెల్ మనీ.. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ.150 కోట్లు సమీకరించేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా రూ.1,000 ముఖ విలువతో ఒక్కో షేరును జారీ చేయనుంది. ఈ ఇష్యూ నవంబరు 4న ముగియనుంది. వ్యాపార విస్తరణ కోసం ఈ మొత్తాలను వినియోగించనుంది.
- మహీంద్రా ఫస్ట్ చాయిస్..హైదరాబాద్‌లో కొత్త ప్రీ-ఓన్డ్ కార్ స్టోర్‌ను ప్రారంభించింది. వీవీసీ మోటార్స్ భాగస్వామ్యంలో ఆటోనగర్‌లో దీన్ని ఏర్పాటు చేసింది.

వెండి.. బంగారమాయెనే



- రూ.లక్ష దాటిన కేజీ సిల్వర్ రేటు
- తులం బంగారం @ రూ.81,000

న్యూఢిల్లీ: బులియన్ ధరలు మరింత ఎగబాకి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం మరో రూ.350 పెరిగి రూ.81,000కు చేరుకుంది. కిలో వెండి ఏకంగా రూ.1,500 పెరుగదలతో రూ.1.01 లక్షలు పలికింది. వెండి రేటు పెరగడం వరుసగా ఇది ఐదో రోజు. అంతేకాదు, ఢిల్లీ మార్కెట్లో వెండి రూ.లక్ష మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లోనూ వీటి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠానికి పెరగడంతో పాటు పండగ సీజన్ నేపథ్యంలో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు బులియన్ కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 0.53 శాతం పెరుగుదలతో 2,753.30 డాలర్లు, సిల్వర్ 1.74 శాతం వృద్ధితో 34.675 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

దేశమంతటా ఒకే రేటు: దేశవ్యాప్తంగా ఒకే బంగారం రేటును అమలు చేసేందుకు కృషిచేస్తున్నట్లు ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) వెల్లడించింది. ప్రస్తుతం రేటు నగరాన్ని బట్టి మారుతుంటుంది. మనం బంగారాన్ని ఒకే రేటుకు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, విక్రయ ధర మాత్రం. నగరాన్ని బట్టి మారుతోంది. ఇకపై దేశమంతా ఒకే రేటును అమలు చేసేందుకు బులియన్ మార్కెట్ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జీజేసీ కార్యదర్శి మితేశ్ ధోర్డ తెలిపారు.

రికార్డు ధరలతో పండగ గిరాకీకి గండి

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరగడం పండగ సీజన్‌లో ఆభరణ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని జువెలర్లు వాపోతున్నారు. ఈ ధనత్రయోదశి, దీపావళికి ఆభరణాలకు గిరాకీ గణనీయంగా తగ్గవచ్చని వారంటున్నారు. ధరలు పెరిగిన కారణంగా ఈసారి సేల్స్ విలువ పరంగా 12-15 శాతం పెరిగే అవకాశమున్నప్పటికీ, విక్రయాల పరిమాణం 10-12 శాతం వరకు తగ్గవచ్చని సెన్‌కో గోల్డ్ ఎండీ, సువంకర్ సేన్ అంచనా వేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,700 ▲	73,050 ▲	1,10,000 ▲
ముంబై	78,251 ▲	71,678 ▲	98,372 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	530
చిత్తూరు	568	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	135
వరంగల్	125	గుంటూరు	133
కరీంనగర్	125	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	122
విశాఖపట్నం	120	అనంతపురం	122
గోదావరి	135		

స్పోర్ట్స్

హాకీ కుర్రాళ్ల హ్యాట్రిక్

భారత్‌కు వరుసగా మూడో గెలుపు

సుల్తాన్ జొహర్ కప్

జొహర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్ జూనియర్ టోర్నమెంట్‌లో భారత హాకీ కుర్రాళ్ల జోరు కొనసాగుతోంది. మూడుసార్లు చాంపియన్ భారత్ టోర్నీలో ఓటమన్నదే లేకుండా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 4-2 గోల్స్ తేడాతో ఆతిథ్య మలేసియాను చిత్తు చేసింది. టోర్నీలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లాడి మూడు విజయాలతో ఉన్న భారత్ ఓవరాల్‌గా 9 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. న్యూజిలాండ్ 5 పాయింట్లతో రెండో స్థానంలో, ఆస్ట్రేలియా (4) మూడో స్థానంలో ఉన్నాయి. భారత్ తన తదుపరి మ్యాచ్‌ను బుధవారం ఆస్ట్రేలియాతో ఆడనుంది.

సాక్షి వ్యాఖ్యలు వ్యక్తిగతం

- వినేశ్ ఫొగట్



చండీగఢ్: ఆసియా క్రీడల సెలెక్షన్ నుంచి మినహాయింపు కోరి స్వార్థపూరితంగా వ్యవహరించినట్టు సాక్షి మాలిక్ చేసిన ఆరోపణలపై మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగట్ స్పందించింది. 'అది ఆమె వ్యక్తిగత అభిప్రాయం. నేను చేసిందాంట్లో స్వార్థమెక్కడుంది? ఒకవేళ ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం తేవాలనుకోవడం కూడా స్వార్థమే అయితే జీవితాంతం అలాగే బతికేస్తా. తోటి సోదరిల కోసం గళమెత్తడం కూడా స్వార్థమే అయితే అలాగే భరిస్తాను. ఏదేమైనా సాక్షిని ఇప్పటికీ స్నేహితురాలిగానే భావిస్తున్నా' అని తాజాగా ఎమ్మెల్యే కూడా అయిన వినేశ్ పేర్కొంది. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా గతేడాది సాక్షి, బజరంగ్, వినేశ్ తదితర రెజ్లర్లు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే సాక్షి తన బయోగ్రఫీ 'విట్‌నెస్'లో వినేశ్‌పై ఆరోపణలు గుప్పించింది.

పృథ్వీ షాపై వేటు

- ముంబై రంజీ టీమ్ నుంచి అవుట్



ముంబై: టాపార్డర్ బ్యాటర్ పృథ్వీ షాకు షాక్ తగిలింది. త్రిపురతో శనివారం నుంచి జరిగే రంజీ మ్యాచ్ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో షాకు చోటు దక్కలేదు. క్రమశిక్షణా రాహిత్యంతోపాటు అధిక బరువు కారణంగానే అతడిని సెలెక్టర్లు తప్పించినట్టు తెలుస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో కూడా షా పేలవ ప్రదర్శన చేశాడు. నెట్ ప్రాక్టీస్ విషయంలో అతడు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడని ఎంసీఏ అధికారి తెలిపాడు. షా ఫీల్డింగ్ చూస్తే అతడి ఫిట్‌నెస్ ఏపాటిదో అర్థమవుతుందన్నాడు.



భారత పతక వేటకు విఘాతం

2026 కామన్వెల్త్ గేమ్స్‌లో 10 క్రీడాంశాలే

హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, టీటీ అవుట్

వ్యయం తగ్గించేందుకే ఈ నిర్ణయం

లండన్: కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేటకు గట్టిదెబ్బ తగిలింది. 2026 గ్లాస్గో (స్కాట్లాండ్)లో జరిగే క్రీడల నుంచి హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్‌లను తొలగించారు. మంగళవారం విడుదల చేసిన రోస్టర్‌లో క్రీడా విభాగాల సంఖ్యను 19 నుంచి 10కి కుదించారు. తొలగించిన క్రీడల్లో భారత్ పతకాలు సాధించేవే ఎక్కువగా ఉండడంతో మన అథ్లెట్లు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడం కోసం క్రీడాంశాల సంఖ్యను కుదించినట్టు కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో 19 క్రీడాంశాలకు చోటు కల్పించారు. కానీ, గ్లాస్గోలో ఆ సంఖ్యను దాదాపుగా సగానికి తగ్గించారు. టేబుల్ టెన్నిస్, స్క్వాష్, ట్రయాథ్లాన్, బీచ్ వాలీబాల్, రగ్బీలను కూడా రోస్టర్ నుంచి తొలగించారు. మొత్తంగా రాకెట్ స్పోర్ట్స్‌ను ఈ క్రీడల్లో కనిపించకుండా చేశారు. గత క్రీడల్లోనే షూటింగ్‌కు చోటు కల్పించకపోవడంతో.. ఈ క్రీడాంశాన్ని కొత్తగా చేర్చే విషయంలో ముందుగానే ఆశలు వదులుకొన్నారు. 'అథ్లెటిక్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్), స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, లాన్ బౌల్స్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, నెట్‌బాల్, బాక్సింగ్, జూడోలను నిర్వహించనున్నామ'ని సీడబ్ల్యూఎఫ్ తెలిపింది. నాలుగు వేదికల్లో నిర్వహించే ఈ పోటీల్లో 74 దేశాలకు చెందిన 3వేల మంది అథ్లెట్లు పాల్గొంటారని చెప్పింది. ఆటగాళ్లకు వసతి సౌకర్యాలను హోటళ్లలోనే కల్పించనున్నట్టు పేర్కొంది. పారా క్రీడలను కూడా నిర్వహించనున్నట్టు పేర్కొంది. 23వ కామన్వెల్త్ క్రీడలు 2026 జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్నాయి. బర్మింగ్‌హామ్ క్రీడల్లో భారత్ 22 స్వర్ణాలు సహా 61 పతకాలు సాధించింది. వాస్తవంగా 2026 క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియా సిటీలో జరగాల్సి ఉండగా.. వ్యయ భారం కారణంగా ఆ నగరం తప్పుకొంది. దీంతో క్రీడల నిర్వహణ కోసం గ్లాస్గో ముందుకొచ్చింది. ఎక్కువ సమయం లేకపోవడంతో కొత్తగా స్టేడియాలు నిర్మించకుండా.. ఉన్న వాటితోనే ఈవెంట్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు.

షాక్‌కు గురిచేసింది..

కామన్వెల్త్ క్రీడలనుంచి హాకీ, రెజ్లింగ్, క్రికెట్, టీటీలను తొలగించడం షాక్‌కు గురి చేసిందని పలువురు అథ్లెట్లు చెప్పారు. 'తీవ్రంగా నిరాశపడ్డా. కానీ మన చేతుల్లో ఏమీ లేదు' అని హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. ఇది చాలా దురదృష్టకరమని టీటీ వెటరన్ శరత్‌కమల్ చెప్పాడు. దీంతో భారత పతకాలు సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. కాగా, స్క్వాష్ ప్లేయర్ దీపిక పల్లికల్ కూడా రాకెట్ క్రీడలను తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేసింది. 'ఒక్క అడుగు ముందుకేస్తే.. రెండడుగులు వెనక్కి లాగుతున్నట్టుంది. స్క్వాష్ క్రీడకు ఈ నిర్ణయం ఎంతో నష్టదాయకమ'ని పల్లికల్ చెప్పింది.

పునరాలోచన చేయాలి




బ్యాడ్మింటన్‌ను తొలగించడం తీవ్ర ఆందోళనకు, నిరాశకు గురి చేసింది. బలమైన శక్తులుగా ఎదుగుతున్న భారత్ లాంటి దేశాలే లక్ష్యంగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారేమోనని అనిపిస్తోంది. సరైన కారణాలు లేకుండా క్రీడాంశాలను తప్పించడం క్రీడల వృద్ధికి శరాఘాతం. దీనిపై భారత్ గొంతు విప్పాలి. - కోచ్ పుల్లెల గోపీచంద్

కామన్వెల్త్‌కు క్రేజ్ లేదు

కామన్వెల్త్ క్రీడల క్రేజ్ తగ్గుతోంది. ఇన్ని క్రీడల్ని తొలగించడం అందుకు బలాన్ని చేకూరుస్తోంది. అసలు ఈ క్రీడలు నిర్వహించాల్సిన అవసరం లేదు. భారత్ కూడా తమ బృందాన్ని పంపకూడదని భావిస్తున్నా.

-మాజీ కోచ్ విమల్ కుమార్

తండ్రి చేసిన పనితో.. జెమీమా సభ్యత్వం రద్దు!



ముంబై: భారత మహిళల జట్టు బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ సభ్యత్వాన్ని ముంబై ప్రసిద్ధ క్లబ్ ఖర్ జింఖానా రద్దు చేసింది. క్లబ్ పరిసరాలను ఆమె తండ్రి ఇవాన్ మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగించుకోవడమే అందుకు కారణంగా తెలుస్తోంది. క్లబ్‌కు సంబంధించిన హాల్‌ను బుక్ చేసుకొని అందులో మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు మతమార్పిడులకు పాల్పడుతున్నట్టు కొందరు మేనేజ్‌మెంట్ దృష్టికి తెచ్చారు. క్లబ్ బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరించడంతో జెమీమాకు ఇచ్చిన మూడేళ్ల గౌరవ సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు ఖర్ జింఖానా అధ్యక్షుడు వివేక్ తెలిపాడు.

పట్టుబిగించిన దక్షిణాఫ్రికా

ఢాకా: కైల్ వెరైనా (114) శతకంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 140/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌతాఫ్రికా 308 పరుగులకు ఆలౌటైంది. తైజుల్ ఇస్లాం 5 వికెట్లు తీశాడు. బంగ్లా తొలి ఇన్నింగ్స్ స్కోరు 106 పరుగులకు దక్షిణాఫ్రికా 202 రన్స్ ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా 101/3తో కష్టాల్లో పడింది.

రెండో టెస్టుకూ కేన్ దూరం



పుణె: న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ రెండో టెస్టుకు కూడా అందుబాటులో ఉండడం లేదు. గజ్జల్లో గాయం కారణంగా బెంగళూరు టెస్టుకు దూరమైనా.. రెండో టెస్టువరకల్లా ఫిట్‌గా ఉంటాడని భావించారు. కానీ అతనింకా న్యూజిలాండ్‌లోనే ఉన్నాడు. కేన్ స్థానంలో జట్టులోకి వచ్చిన విల్ యంగ్ 33, 48 పరుగులతో ఆకట్టుకున్నాడు. కేన్ వంద శాతం ఫిట్‌గా లేడని, చివరి టెస్టుకైనా కోలుకోవాలని ఆశిస్తున్నామని కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు.

ఒక్క ఫోన్ చేయండి.. వచ్చేస్తా!

- భారత్‌తో సిరీస్ కోసం వార్నర్

మెల్‌బోర్న్: ఈ ఏడాది జనవరిలో అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు తిరిగి ఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నట్టున్నాడు. ఎందుకంటే.. భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు తన సేవలు అవసరమనుకుంటే.. కచ్చితంగా అందుబాటులో ఉంటానని ప్రకటించాడు. 'జట్టు కోసం నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటా. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు. ఆసీస్ ఆటగాళ్లు ఫిబ్రవరిలో టెస్టు తర్వాత షెఫీల్డ్ షీల్డ్‌లో ఓ మ్యాచ్ మాత్రమే ఆడారు. ఒకవేళ భారత్‌తో సిరీస్‌కు నేను కావాలనుకుంటే తదుపరి షీల్డ్ గేమ్ ఆడి సిద్ధంగా ఉంటాను' అని వార్నర్ తెలిపాడు.

పంత్, గిల్ ఆడతారు

- రాహుల్‌పై నమ్మకముంది
- అసిస్టెంట్ కోచ్ టెన్‌డష్కాటే



పుణె: న్యూజిలాండ్ చేతిలో తొలి టెస్టు పరాభవం తర్వాత భారత జట్టు తుది కూర్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మెడ కండరాలు పట్టేయడంతో శుభ్‌మన్ గిల్ ఆ మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే. అలాగే వికెట్ కీపర్ రిషబ్ పంత్ మోకాలికి బంతి బలంగా తాకడంతో మైదానం వీడాల్సి వచ్చింది. తిరిగి బ్యాటింగ్ చేసినా కీపింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఈనేపథ్యంలో గురువారం నుంచి పుణెలో జరిగే రెండో టెస్టులో వీరిద్దరూ ఆడతారా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. అయితే జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డష్కాటే ఈ ఊహాగానాలకు తెరదించాడు. కివీస్‌తో రెండో టెస్టులో గిల్, పంత్ ఆడతారని తేల్చాడు. 'పంత్ బాగానే ఉన్నాడు. మోకాలు కదిలించడంలో కాస్త అసౌకర్యానికి గురైనా ప్రస్తుతం కోలుకున్నాడు. రెండో టెస్టు ఆడతాడనే భావిస్తున్నాం. ఇక గిల్ బెంగళూరు నెట్స్‌లో కూడా పాల్గొని బ్యాటింగ్ చేశాడు. కాస్త అసౌకర్యంగా కనిపిస్తున్నా మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగానే ఉన్నాడు' అని టెన్‌డష్కాటే తెలిపాడు. మరోవైపు పంత్ విషయంలో ఎలాంటి రిస్కూ తీసుకోకూడదన్న భావనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. రెండేళ్ల క్రితం కారు ప్రమాదంలో అతడి మోకాలికి తీవ్ర గాయమైంది. ఇప్పుడు అక్కడే బంతి తాకడంతో ముందు జాగ్రత్తగా విశ్రాంతినిస్తే బావుంటుందన్న ఆలోచనలో ఉన్నారు. ఒకవేళ ఆడించినా బ్యాటింగ్ మాత్రమే చేయించి కీపింగ్ బాధ్యతలు జురెల్‌కు అప్పగించే అవకాశముంది. మంగళవారం నెట్స్‌లో జురెల్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. మరోవైపు పంత్ స్పిన్ బౌలింగ్‌లో బ్యాటింగ్ సాధన కొనసాగించాడు.

డబ్ల్యూటీసీలో కనీసం 3 టెస్టులు

ఐసీసీ క్రికెట్ కమిటీ సూచన

దుబాయ్: టెస్టు, వన్డే ఫార్మాట్లను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఐసీసీ నడుం బిగించింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ క్రికెట్ కమిటీ పలు సూచనలను ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వచ్చే అంచె నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో కనీసం మూడు టెస్టుల సిరీస్‌ను ఆడించాల్సి ఉంటుంది. కొన్ని దేశాలు రెండు టెస్టుల సిరీస్‌కే పరిమితమవుతున్నాయని ఐసీసీ భావిస్తోంది. అలాగే ఆతిథ్యమిచ్చే జట్లు మరిన్ని డే/నైట్ టెస్టులు నిర్వహించేలా చూడాలని కోరింది. ఇక, వన్డేల్లో తొలి 25 ఓవర్లలో రెండు కొత్త బంతులను, ఆ తర్వాత ఒక్క బంతిని మాత్రమే వాడాలని క్రికెట్ కమిటీ సూచించింది. దీంతో పేసర్లకు రివర్స్‌స్వింగ్‌తో పాటు స్పిన్నర్లకు కూడా ప్రయోజకరంగా ఉంటుందని భావిస్తోంది. అలాగే ఐసీసీ చైర్మన్ పదవి కూడా ఇకనుంచి మూడేళ్లపాటు ఉండనుంది.



నిరాశపర్చిన టైటాన్స్

- బెంగళూరు హ్యాట్రిక్ ఓటమి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 52-22తో టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 19 రైడ్ పాయింట్లతో చెలరేగాడు. టైటాన్స్ జట్టు కెప్టెన్ పవన్ (7 పాయింట్లు) మినహా మిగిలిన ప్లేయర్లంతా ఘోరంగా విఫలమయ్యారు. టైటాన్స్ పేలవ డిఫెన్స్ కారణంగా ఈ మ్యాచ్‌లో ఏకంగా నాలుగుసార్లు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57-36తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. బుల్స్‌కు ఇది హ్యాట్రిక్ పరాజయం.



డిప్యూటీ సీఎం భట్టికి చెక్కును అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సీఎం సహాయనిధికి రూ.18.69 కోట్లు

» డిప్యూటీ సీఎంకు చెక్ అందించిన విద్యుత్ ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితుల సహాయార్థం రూ.18.69 కోట్ల సహాయాన్ని విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వానికి అందించారు. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం కలిసి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు విద్యుత్ సంస్థల్లో ఉన్న 70 వేలమంది ఉద్యోగులకు చెందిన ఒక రోజు మూలవేతనం రూ.18.69 కోట్లను చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో/జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు, విద్యుత్ సంఘాల ప్రతినిధులు సాయిబాబు, శ్రీధర్, శివాజీ, రత్నాకర్‌రావు, సచ్చిదానందం తదితరులు ఉన్నారు.

సర్కార్ నిర్లక్ష్యం..
గురుకుల విద్యార్థులకు శాపం: హరీశ్‌రావు

రాష్ట్రంలోని గురుకులాలపట్ల సర్కారు నిర్లక్ష్యం.. అక్కడి విద్యార్థులకు శాపంగా మారిందని, తాజాగా నలుగురు విద్యార్థులు కరెంట్ షాక్‌కు గురి కావడం తనను కలచివేసిందని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో పాము కాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, ఫుడ్‌పాయిజన్ కేసులు సర్వసాధారణమయ్యాయన్నారు. ఇప్పుడు మెదక్ జిల్లా హవేలిఘనపూర్‌లో నలుగురు విద్యార్థులు కరెంట్ షాక్‌కు గురై గాయాలపాలు కావడం దురదృష్టకరమని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పట్టింపు లేనితనం, దీనికి తోడు గురుకులాల్లోని సిబ్బంది నిర్లక్ష్యం పిల్లల ప్రాణాల మీదకు తెస్తోందని ఆరోపించారు. విద్యుత్ షాక్‌కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది

» కాంగ్రెస్ నేతల ఆదాయం పెరుగుతోంది

» కొండా సురేఖపై రూ.100 కోట్ల పరువునష్టం:కేటీఆర్

"పదేళ్లపాటు బుల్లెట్ వేగంతో.. పరుగులు పెట్టిన తెలంగాణకు అసమర్థ, అవినీతిపాలన శాపంగా మారింది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది. ఆ పార్టీ నాయకుల ఆదాయం మాత్రం అమాంతం పెరుగుతోంది" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తప్పులమీద తప్పులుచేసి తీరా.. తగ్గిన ఆదాయంపై అధ్యయనం కోసం ఇతర రాష్ట్రాలకు బృందాలను పంపించడం.. వారి అజ్ఞానానికి సజీవ సాక్ష్యమని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. పది నెలల పాలనలో అన్ని రంగాలను ఆగం చేశారని, కూల్చివేతల మనస్తత్వంతో రియల్ ఎస్టేట్ కుదేలైందని విమర్శించారు. మరోవైపు.. తన వ్యక్తిత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని, మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి నీచమైన ప్రయత్నాలకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రాజకీయ విమర్శల పేరిట నీచమైన వ్యాఖ్యలు చేసేవారికి కొండా సురేఖపై వేసిన రూ.100 కోట్ల పరువునష్టం దావా ఒకగుణపాఠం కావాలని కేటీఆర్ హెచ్చరించారు.

ధర్నా ఢిల్లీలో చేపట్టండి

» కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సూచించిన సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో మూసీ ప్రక్షాళన కోసం, ఆ ప్రాంత ప్రజల సంక్షేమం, ఉపాధి కోసం నయాపైసా కేటాయించని ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం ఎదుట ధర్నా చేపట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. సొంత నియోజకవర్గం గుండా మూసీ పారుతున్నా ఏనాడు కేంద్రం నుంచి నిధులు తీసుకురాని కిషన్ రెడ్డి, ఇప్పుడు మూసీ ప్రాంత ప్రజల తరుఫున ధర్నాకు పిలుపునివ్వడం ఎందుకని ప్రశ్నించారు. మూసీ ప్రాంత ప్రజల పక్షాన ఈ నెల 25న ఇందిరాపార్క్ వద్ద బీజేపీ తలపెట్టిన ధర్నాను విరమించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ముగ్గురు బీజేపీ ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నందున.. కేంద్రంతో చర్చించి రూ.10 వేల కోట్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.

వైద్య విధాన పరిషత్ బలోపేతానికి చర్యలు

» మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆస్పత్రుల పనితీరు, టీవీవీపీని సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా బలోపేతం చేయడానికి రూపొందించిన ప్రతిపాదనలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష చేశారు. ఆస్కీ రూపొందించిన ఈ ప్రతిపాదనలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని సూచించారు. అదనపు పోస్టులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డాక్టర్లు, ఇతర ఉద్యోగుల ప్రమోషన్లు, సర్వీసు విషయాల్లో సమస్యలు తలెత్తకుండా ప్రతిపాదనలు ఉండాలన్నారు. 39,980 మిలియన్ యూనిట్లుగా ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి.

కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రాణహాని !

» ముఖ్యమంత్రిపై పోలీసులకు బీఆర్ఎస్ శ్రేణుల ఫిర్యాదు

బంజారాహిల్స్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను చూస్తుంటే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రాణహాని ఉందని ఆ పార్టీ శ్రేణులు బంజారాహిల్స్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాయి. ముఖ్యమంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు కలిసి ఈ ఫిర్యాదు అందజేశారు.

తొమ్మిదో అంతస్తు నుంచి దూకి యువతి మృతి

» ఉప్పల్‌లో ఘోరం.. మృతురాలు అక్కడే ఉద్యోగిని

» సోమవారం సాయంత్రం ఐదింటికి విధులకు హాజరు

» తెల్లవారుజామున 2 గంటలకు ఘటన.. పలు అనుమానాలు



మృతురాలు హరిత

ఉప్పల్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ పారిశ్రామిక వాడలోని డీఎస్ఎల్ అబాకస్ భవనం తొమ్మిదో అంతస్తు నుంచి దూకి యువతి మృతిచెందింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పార్శిగుట్టలో నివసించే పిన్నపాటి రమేశ్ రెండో కూతురు హరిత (24) డీఎస్ఎల్ అబాకస్ ఐటీ భవనం తొమ్మిదో అంతస్తులోని సీఎస్ టెక్నాలజీలో కస్టమర్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు విధులకు హాజరయ్యే హారిక మరుసటి రోజు ఉదయం 4 గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వెళతారు. ఎప్పటిలాగే సోమవారం సాయంత్రం డ్యూటీకి వెళ్లిన హారిక మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు తాను పనిచేస్తున్న 9వ అంతస్తు నుంచి కిందకు దూకినట్లు తోటి ఉద్యోగులు గమనించారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అయితే హరిత ఎందుకు భవనంపై నుంచి దూకారన్న విషయం మాత్రం ఎవరూ చెప్పలేక పోతున్నారు. మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అసెంబ్లీ ప్రాంగణంలోకి మండలి భవనం

» మూడు నెలల్లో అందుబాటులోకి తెస్తాం

» మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు వెల్లడి

» భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అసఫ్ జాహీల నిర్మాణశైలితో ఉన్న అసెంబ్లీ పాత భవనాన్ని.. అదే నిర్మాణ కౌశలంతో అద్భుతంగా పునరుద్ధరిస్తున్నామని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ హెరిటేజ్ భవనం అందుబాటులోకి వస్తే శాసనమండలిని అసెంబ్లీ ప్రాంగణంలోకి మార్చవచ్చునన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో ఉన్నట్టుగానే అసెంబ్లీ భవన ప్రాంగణంలో సెంట్రల్ హాల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. పార్లమెంట్ తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు అసెంబ్లీ మరింత చేరువవుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని హెరిటేజ్ భవనమైన పాత అసెంబ్లీ భవన పునర్నిర్మాణం పురోగతిపై మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి స్పీకర్ చాంబర్‌లో మంత్రులు సమీక్ష నిర్వహించారు. భవనాన్ని పునర్నిర్మిస్తున్న ఆగాఖాన్ ప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచార్యులుతో సమావేశం నిర్వహించారు. రెండు, మూడు నెలల్లో భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, చారిత్రక వైభవానికి ఇబ్బంది కలగకుండా భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆగాఖాన్ ప్రతినిధులకు మంత్రులు సూచించారు. భవనానికి కావాల్సిన ఎలక్ట్రిఫికేషన్ వ్యవస్థ, ప్లంబింగ్ పనులపై టెండర్లు పిలవాలని ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ హరిచందనను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. ఆగాఖాన్ ట్రస్ట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.2 కోట్ల నిధులను సమావేశం నుంచే ఉపముఖ్యమంత్రితో మాట్లాడి.. అప్పటికప్పుడే విడుదల చేయించారు. కాగా, పనులు వేగంగా సాగేందుకు ప్రత్యేకంగా ఒక ఎస్ఈ స్థాయి అధికారిని నియమించి పర్యవేక్షించాలని ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు.



అసెంబ్లీ భవన ప్రాంగణంలో ఓల్డ్ బిల్డింగ్ పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

వ్యవసాయ విస్తరణాధికారులపై కొరడా!

రాష్ట్రవ్యాప్తంగా 160 మంది ఏఈవోలపై సస్పెన్షన్ వేటు

» రైతు బీమా మరణాల నమోదులో జాప్యానికి చర్యలు

» రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ

» డైరెక్టరేట్ వద్ద ఏఈవోల ధర్నా.. కక్షసాధింపేనని ఆగ్రహం



వ్యవసాయశాఖ కమిషనరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఈవోలు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 160 మంది వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోల)పై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వారిపై సస్పెన్షన్ వేటు వేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21 తేదీన ఏఈవోలకు వ్యక్తిగతంగా జారీచేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు మంగళవారం వారికి చేరాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతోపాటు కలెక్టర్లకు కూడా ఉత్తర్వులు పంపించారు. రైతుబీమా పోర్టల్‌లో మరణాల నమోదులో ఆలస్యానికిగాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైతు బీమా మార్గదర్శకాల ప్రకారం.. రైతులు ఏ కారణంతో చనిపోయినా, వెంటనే వారి వివరాలు సేకరించి, పోర్టల్‌లో నమోదుచేసి నష్టపరిహారం కోసం ఎల్ఐసీకి పంపించాల్సి ఉండగా, ఏఈవోలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్‌కు గురైన ఏఈవోలు అనుమతి లేనిదే తాము పనిచేసే ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లకూడదని, స్థానికంగా ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొనటం గమనార్హం. కాగా.. ఈ చర్యను నిరసిస్తూ రాష్ట్రం నలుమూలాల నుంచీ పలువురు ఏఈవోలు హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ఉన్నతాధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు వేదికల వద్ద కూడా ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఎలాంటి సంజాయిషీ తీసుకోకుండానే 160 మందిపై ఏకపక్షంగా వేటు వేయడమేంటని ఏఈవోల సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్ బి. రాజ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో ఉన్నతాధికారులతో విభేదించినందుకే, ఏఈవోలను సస్పెండ్ చేసి కక్షసాధిస్తున్నారని ఆరోపించారు. ఏఈవోలపై సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాజ్‌కుమార్ హెచ్చరించారు.

పంటల నమోదు ఏఈవోల ప్రాథమిక బాధ్యత

» రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి

పంటల నమోదు కార్యక్రమం వ్యవసాయ విస్తరణాధికారుల ప్రాథమిక బాధ్యత అని.. కానీ, కొంతమంది ఏఈవోలు పంట పొలాలను సందర్శించకుండానే నమోదు చేసే ఉద్దేశంతో డిజిటల్ క్రాప్ సర్వేను అడ్డుకుంటున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం ఏఈవోలు కమిషనరేట్ ఎదుట ధర్నాకు దిగిన నేపథ్యంలో.. ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మెరుగైన పద్ధతిలో సర్వే నిర్వహించడానికి గాను ఏఈవోలకు ఒక నెల క్రితమే సర్క్యులర్ పంపినట్లు తెలిపారు. ప్రతి గుంటలో సాగైన పంటల వివరాలు ఖచ్చితంగా తెలుసుకోవటం, పంటలకు కావాల్సిన ఉత్పాదకాలను ఖచ్చితంగా అంచనా వేయటం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కొనుగోలు నిర్ణయాలు తీసుకోవటం, పంట బీమా అమలు వంటివాటికి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పొందటానికి, రైతుబీమా రైతుభరోసా పొందడానికి.. పంటల నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని గోపి స్పష్టంచేశారు. పంటల నమోదు అంటే.. చెట్టుకింద, కార్యాలయంలో కూర్చొని చేసే కార్యక్రమం కాదని, ఈ ప్రక్రియను సక్రమంగా నిర్వహించకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని రైతులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన వివరించారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు
96 లక్షల పరిహారం

విడుదల చేసిన విపత్తుల నిర్వహణ శాఖ

» 2022 నుంచి 16 మంది ఎక్స్‌గ్రేషియా పెండింగ్

» ఒక్కొక్కరికి 6 లక్షల చొప్పున మంజూరు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండేళ్లలో పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా విడుదల చేసింది. 2022 నుంచి పిడుగుపాటుకు గురై మృతి చెందిన 16 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున రూ.96 లక్షలను మంజూరు చేసింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. పిడుగుపాటు మృతుల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఐదుగురు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందినవారు ముగ్గురు, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున, భద్రాది కొత్తగూడెం, కామారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాలకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరి కుటుంబాలకు రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి పరిహారం అందడం లేదు. వీరి వివరాలు విపత్తుల నిర్వహణ శాఖకు అందినా సకాలంలో పరిహారం ఇవ్వలేదు. ఈ పరిస్థితిని గుర్తించిన విపత్తుల నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్.. జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను విడుదల చేశారు. వాస్తవానికి పిడుగుపాటు మృతులకు చెలిస్తున్న రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియాలో కేంద్ర ప్రభుత్వమే జాతీయ విపత్తు కింద రూ.4 లక్షలు చెల్లిస్తోంది. 2018 వరకు మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు మాత్రమే చెల్లించేవారు. అయితే.. కేంద్రం ఇస్తున్న ఈ మొత్తం సరిపోవడం లేదంటూ రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అదనంగా మరో రూ.2 లక్షలు కలిపి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం రూ.6 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొంటూ జీవో నంబర్ 1ని తీసుకొచ్చింది.

వయనాడ్ వెళ్లిన రేవంత్, భట్టి

వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు కేరళకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో వెళ్లినవారు.. బుధవారం జరిగే నామినేషన్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం వారు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ కార్యక్రమానికి రాహుల్‌గాంధీ సహా ఏఐసీసీ అగ్రనేతలు హాజరుకానున్నారు.

కేటీఆర్.. నువ్వో బేవకూఫ్

సీఎం రేవంత్‌ను తిడతావా?.. ఆయనను కెలుకుడెందుకు? తిడితే కేసులు పెట్టుడెందుకు?

నీ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం గ్యాంగ్

బుర్రకు తెలివిలేక రేడార్ స్టేషన్‌కు భూమి కేటాయిస్తూ జీవో ఇచ్చినవా?

నేను, సీఎం రేవంత్ నాటుకోడి తీరైతే.. నువ్వు బాయిలర్ కోడి టైపు: జగ్గారెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి.. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై తీవ్రంగా మండిపడ్డారు. కేటీఆర్ ఒక బేవకూఫ్ అని అన్నారు. కేటీఆర్ సోషల్ మీడియా బ్యాచ్.. దండుపాళ్యం గ్యాంగ్‌లా మారిందంటూ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌ని హౌలా అని మాట్లాడుతుంటే తామెందుకు ఊరుకుంటామని ప్రశ్నించారు. సీఎం ఏది మాట్లాడినా వక్రీకరించే పనిలో కేటీఆర్, హరీశ్ ఉన్నారని విమర్శించారు. "సీఎంను తిట్టుడెందుకు? ఆయన తిడితే కేసులు పెట్టుడెందుకు? రేవంత్‌రెడ్డి కేటీఆర్ లెక్క అయ్యపేరు చెప్పుకొని సీఎం కాలేదు. ఆయనకు ఫుట్‌పాత్ నుంచి తెలుసు. నేను కూడా ఫుట్‌పాత్ నుంచి వచ్చినోడినే. కేటీఆర్‌కు ఇవన్నీ తెలియకుండా కేసీఆర్ నాజూకుగా పెంచిండు. నేను, సీఎం రేవంత్‌రెడ్డి నాటుకోడి తీరైతే.. కేటీఆర్ బాయిలర్ కోడి టైపు" అని జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. దామగుండంలో రేడార్ స్టేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ శంకుస్థాపన చేయడంపై కేటీఆర్ చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్నారన్నారు. ఆయనకు రాజకీయ జ్ఞానం ఉందో, లేదో కూడా అర్థం కావట్లేదన్నారు. దామగుండాన్నే నేవీ ఎందుకు ఎంచుకుందో కేటీఆర్‌కు తెలుసా? అని ప్రశ్నించారు. ఈస్టేషన్ నుంచి వెయ్యి కిలోమీటర్ల వరకు నేవీ సిగ్నల్స్ పంపిచే అవకాశం ఉంటుందన్నారు.

చెట్లున్న విషయం అప్పుడు గుర్తులేదా?

దామగుండంలో రేడార్ స్టేషన్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం భూమిని కేటాయించినపుడు అక్కడ 9 లక్షల చెట్లు ఉన్న విషయం కేటీఆర్‌కు గుర్తులేదా? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. అన్ని లక్షల చెట్లు పోతాయని తెలిసి కూడా ఎందుకు జీవో ఇచ్చారని నిలదీశారు. రేడార్ స్టేషన్ కోసం ఎన్ని చెట్లను తొలగిస్తే అంతే సంఖ్యలో చెట్లను పక్కన నాటాలని ఆ జీవోలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. "పదేళ్లపాటు రాజభోగాలు అనుభవించిన కేటీఆర్.. ఇప్పుడవన్నీ దూరం కావడంతో పిచెక్కి మాట్లాడుతున్నడు. మూసీ అక్కడే పుట్టిందంటున్న కేటీఆర్‌కు.. భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పుడు ఆ సంగతి గుర్తుకు రాలేదా?" అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని నాలుగైదు రాష్ట్రాలకు ఎన్నికల ఫండింగ్ చేసిన కేటీఆర్ తమపై నిందలు వేయడమేంటని ప్రశ్నించారు. "కర్ణాటక ఎన్నికల సమయంలో కుమారస్వామికి మీరు డబ్బులు పంపలేదా? నవీన్ పట్నాయక్‌కూ ఫండింగ్ చేయలేదా? కేజ్రీవాల్‌కూ ఫండింగ్ చేసినందుకే కదా మీ చెల్లెల్ని బీజేపీ జైల్లో పెట్టింది? మేము ఎదురుదాడి చేయట్లేదని తమాషా చేస్తున్నవా? కంట్రోల్‌లోనైనా ఉండు.. లేకుంటే బేవకూఫ్ మాటలు బంద్ పెట్టుకో" అంటూ కేటీఆర్‌ను జగ్గారెడ్డి హెచ్చరించారు.

సినీ నిర్మాత శివరామకృష్ణ అరెస్టు

» 84 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన బూరుగుపల్లి

» రాయదుర్గంలోని తెలంగాణ ఆర్కైవ్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ భూమి

» 22 ఏళ్లుగా సుదీర్ఘ న్యాయపోరాటం చేసిన ప్రభుత్వం

» చివరకు శివరామకృష్ణను దోషిగా తేల్చిన సుప్రీం కోర్టు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి, రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన కేసులో ప్రముఖ సినీ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను ఓయూ పోలీసులు అరెస్టు చేశారు. శివరామకృష్ణతోపాటు ఆయనకు సహకరించిన ఆర్కియాలజీ (ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) డిపార్టుమెంట్ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, బిల్డర్ లింగం గౌడ్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రాయదుర్గం పరిధిలోని సర్వే నంబర్ 46లో 83 ఎకరాల భూమిని సినీ నిర్మాత శివరామకృష్ణ కబ్జా చేశారని ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జరీనా పర్వీన్ ఈ ఏడాది ఆగస్టులో సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. భూ కబ్జా కేసు కావడంతో దానిని ఓయూ పీఎస్‌కు బదిలీ చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఓయూ పోలీసులు నిందితులను ఈ నెల 17న అరెస్టు చేశారు. కాగా, ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌లో బహమనీ, దక్కన్ రాజవంశాలతోపాటు.. కుతుబ్‌షాహీ, ఆదిలా షాహీ, షాజహాన్ చక్రవర్తి కాలం నుంచి మొఘలులు, అసఫ్ జాహీల వరకు దాదాపు 43 మిలియన్ల విలువైన రికార్డులను కలిగి ఉంది. రికార్డులను డిజిటలైజేషన్ చేస్తున్న క్రమంలో రాయదుర్గంలోని 83 ఎకరాలు, ఇబ్రహీంపట్నం పరిధిలోని యాచారంలో 10 ఎకరాల భూమికి సంబంధించిన పహాణీ, సేత్వార్‌లు కనిపించకుండా పోయాయి. ఈ భూములను సినీ నిర్మాత శివరామృష్ణ కబ్జా చేసినట్లు గుర్తించారు.

రికార్డ్ అసిస్టెంట్ సహకారంతో..

డిపార్టుమెంట్‌లో 1993 నుంచి రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.చంద్రశేఖర్‌ను శివరామకృష్ణ మచ్చిక చేసుకొని.. అతని సహకారంతో రికార్డుల్లోని పత్రాలను మాయం చేసినట్లు 2003లో గుర్తించారు. దాంతో అప్పటి ప్రభుత్వం చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు.. ఉన్నత న్యాయస్థానంలో కేసు వేసింది. అయితే చంద్రశేఖర్ ద్వారా పత్రాలు కొట్టేసిన శివరామకృష్ణ ప్రముఖ బిల్డర్ అయిన మారగోని లింగం గౌడ్ సహకారంతో వాటిని తన పేరున మార్చుకొని నకిలీ పత్రాలు సృష్టించి ఆ 83 ఎకరాల భూమి తనదేనని పత్రాలను కోర్టుకు సమర్పించాడు. కొన్నేళ్లుగా న్యాయస్థానంలో ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తున్న క్రమంలో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 22 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం దేశ అత్యున్నత న్యాయస్థానం శివరామకృష్ణను దోషిగా తేల్చింది. ఈ నేపథ్యంలో నిందితుడు శివరామకృష్ణను ఓయూ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ప్రస్తుతం అక్కడ భూమి ధర ఎకరం రూ.100 కోట్లు ఉంటుందని అంచనా. ఈ లెక్కన రూ.8,300 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసినట్లు అధికారులు తేల్చారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది. ఈ కబ్జా పథకంలో ఎంతమంది ఉన్నారు? ఎవరెవరి పాత్ర ఏంటి? అని తేల్చే పనిలో ఓయూ పోలీసులు నిమగ్నమయ్యారు. యాచారంలో కబ్జాకు గురైన 10 ఎకరాలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిసింది.

అటవీ భూములకు నకిలీ పట్టాలు

» నర్సంపేట కేంద్రంగా ఓ ముఠా దందా

» వరంగల్‌లోని ఓ ప్రెస్‌లో ముద్రణ

» కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వో, రేంజర్ సంతకాల ఫోర్జరీ.. సూత్రధారి అరెస్టు

» ములుగులో 200 మందికి పైగా బాధితులు



వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన ఓ రైతుకు విక్రయించిన నకిలీ పాస్ పుస్తకం

ములుగు, అక్టోబరు 22: నకిలీ పాస్ పుస్తకాల తయారీ ముఠా గుట్టు రట్టయ్యింది. ఆ ముఠా సభ్యులు అసలు భూమి హక్కు పట్టాలకు అచ్చు గుద్దినట్టు నకిలీవి ముద్రించి రైతులకు అమ్ముతున్నారు. రైతులు బ్యాంకుల్లో పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా ఈ నకిలీ బాగోతం వెలుగు చూసింది. ఈ ముఠా సూత్రధారి వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన చందావత్ భద్రును అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా అనేక విషయాలు బహిర్గతమయ్యాయని ములుగు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన అటవీ హక్కుల కమిటీ అధ్యక్షుడు జాటోతు రాజ్‌కుమార్ ఇచ్చిన ఒరిజనల్ పాస్ పుస్తకాన్ని ఉపయోగించి వరంగల్‌లోని గణేష్ ప్రింటర్స్ యజమాని తాటి పాముల రాజు ద్వారా నకిలీ పాస్ పుస్తకాల తయారీ, కలెక్టర్, డీఎఫ్‌వో, ఐటీడీఏ పీవోల సంతకాలను ఫోర్జరీ చేశారు. భూక్యా వెంకన్న (నర్సంపేట) క్యూఆర్ కోడ్‌లను తయారుచేయగా, బానోతు హరికిషన్ (మహబూబాబాద్) హోలోగ్రామ్‌లు రూపొందించాడు. ప్రైవేటు ఉపాధ్యాయుడు (నర్సంపేట) ధారావత్ కిషన్ ఎఫ్ఆర్వో సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకులకు సిఫారసు లేఖలు తయారుచేశాడు. సాధారణంగా భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. రికార్డులను సరిచూసుకొని బ్యాంకర్లు రుణాలిస్తారు. కానీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాల సమాచారం ఆన్‌లైన్‌లో లేదు. దీంతో నకిలీ సిఫారసు లేఖలు సృష్టించారు.

ఒక్కో నకిలీ పట్టా రూ.50 వేలు!

ములుగు మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులకు గత ప్రభుత్వంలో అటవీ హక్కుల చట్టం-2006 కింద ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు జారీ అయ్యాయి. వేలాది మంది దరఖాస్తు చేసుకుంటే పరిశీలన తర్వాత సుమారు 600 మందికి పట్టాలిచ్చారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం భద్రు అనే వ్యక్తి రంగంలోకి దిగాడు. ఖాసిందేవిపేటకు చెందిన రవి మధ్యవర్తిగా నియమించుకుని దందా మొదలుపెట్టాడు. గిరిజనులు, పలువురు గిరిజనేతరులను మభ్యపెట్టి 4నుంచి 8 ఎకరాల వరకు పట్టాలు చేయిస్తామని నమ్మబలికారు. ఒక్కో పట్టాకు గరిష్ఠంగా రూ.50 వేల వరకు వసూలు చేశారు. ఒక్క ములుగు మండలంలోనే 200కు పైగా పట్టాలు అమ్మినట్టు తెలుస్తోంది. వరంగల్, మహబూబాదాద్ జిల్లాల్లో కూడా ఈ ముఠా నకిలీలను విక్రయించినట్లు సమాచారం. అధికారులు ఇప్పటికే రవిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా నిందితులను కూడా అరెస్టు చేస్తామని ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు.

త్వరలో మీ సేవ ఆపరేటర్ల కమీషన్ పెంపు

» ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మీ సేవ ఫెడరేషన్ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మీసేవ ఆపరేటర్ల కమీషన్ పెంపుపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, త్వరలో కొత్త కమీషన్ విధానం అమల్లోకి వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బైర శంకర్, మొహమ్మద్ మోయిద్ మంగళవారం మంత్రిని కలిసి సమస్యలు ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 వేల మీసేవ కేంద్రాల్లో 3 వేలకు పైగా కేంద్రాల నెలవారీ కమీషన్ రూ.5వేలలోపు ఉంద న్నారు. మీసేవల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తున్నా తక్కువ కమీషన్‌తో ఆపరేటర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో అనేక కేంద్రాలు మూతపడ్డాయన్నారు.

త్వరలో పూర్తి నివేదిక అందిస్తాం

» కాళేశ్వరం కమిషన్‌కు తెలిపిన విజిలెన్స్ డీజీ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నివేదికను త్వరలోనే అందించనున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ (డీజీ) కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్‌ను కలిశారు. విచారణ పూర్తి కావస్తోందని నివేదించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) కూడా త్వరలోనే నివేదిక సమర్పించనున్నట్లు కమిషన్‌కు సమాచారం ఇచ్చింది. బుధవారం నుంచి కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ పునఃప్రారంభించనుంది. ఈ దఫా ఇదివరకే విచారణకు హాజరైన రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుతో పాటు గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్‌ను కూడా పిలిచే అవకాశాలున్నాయి.

యూనిట్‌కు రూ.5.25తో కరెంటు కొనుగోలు

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు వివిధ జెన్‌కోల నుంచి కొంటున్న సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.25 గా నిర్ధారిస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయం తీసుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే ధర ఉండగా.. 2024-25లోనూ దాన్నే కొనసాగిస్తూ ఈఆర్‌సీ మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది.

సీఎం నిధికి సిద్దార్థ లూథ్రా 10 లక్షల సాయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా రూ.10 లక్షల సాయాన్ని అందజేశారు. సీఎంఆర్ఎఫ్ అకౌంట్‌కు ఆ నగదును బదిలీ చేశారు. తెలంగాణలోని వరద బాధితులకు చేయూతనిద్దామంటూ సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్సీఏఓఆర్ఏ) వెల్ఫేర్ మేనేజింగ్ ట్రస్టీ సిద్ధార్థ్ లూథ్రా సభ్యులను కోరారు. తన వాటా కింద తొలుత రూ.10 లక్షల సాయం అందించారు. మరో రూ.10 లక్షలు త్వరలోనే అందించనున్నట్లు సిద్దార్థ లూథ్రా వెల్లడించారు.

'ప్రజావాణి' అద్భుతం

» ఆర్మీ, ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల కితాబు

» ప్రజాభవన్‌ను సందర్శించిన అధికారుల బృందం

హైదరాబాద్, బేగంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా ఉందని భారత ఆర్మీ, నావికా, వైమానిక దళాల అధికారులు, ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారుల బృందం కితాబిచ్చింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సెమినార్‌కు వచ్చిన ఈ అధికారుల బృందం మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌ను సందర్శించి ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో అధికారులు సమావేశమయ్యారు. ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్ వారికి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తూ, అప్పటికప్పుడు వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న 'ప్రజావాణి' అద్భుతంగా ఉందని కొనియాడారు.

వచ్చేనెల 21 నుంచి లోక్ మంథన్- 2024

వచ్చేనెల 21 నుంచి 24 వరకు శిల్పకళా వేదికలో లోక్‌మంథన్-2024 సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ వెల్లడించింది. అందరం ఒకటే జాతి, అందరికీ దేశమే తొలి ప్రాధాన్యం అన్న విశ్వాసం దిశగా నడిపించే శంఖారావంతో ప్రజ్ఞాభారతి, ప్రజ్ఞా ప్రవాహ్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ భారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, మాతా అమృతానందమయి వంటి ప్రముఖులు హాజరై మార్గదర్శనం చేయనున్నారని పేర్కొంది. ఈ సమావేశాలకు హాజరు కాదలచినవారు www.lokmanthan.org లో రిజిస్టర్ చేసుకోవాలని ఆహ్వాన కమిటీ సూచించింది.

ఉపాధి హామీ పనుల్లో తెలంగాణ టాప్

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంలో తెలంగాణ టాప్‌గా నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో జాతీయ స్థాయి సగటుకన్నా.. మన రాష్ట్రంలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించింది. జాతీయస్థాయి ఉపాధి హామీ పనిదినాల సంఖ్య క్షీణించగా... తెలంగాణలో మాత్రం గణనీయంగా పెరిగినట్లు లిబ్‌టెక్ ఇండియా సర్వే సంస్థ తెలిపింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై ఆ సంస్థ జాతీయ స్థాయిలో జరిపిన అధ్యయనం ఆధారంగా మంగళవారం ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జాతీయస్థాయి పనిదినాలు 16.2 శాతం తక్కువ నమోదు కాగా, తెలంగాణలో గతేడాదితో పోల్చితే ఈసారి 27.1 శాతం పెరుగుదలతో 10.35 కోట్ల పనిదినాలు నమోదు చేసుకుంది.

హిందూ సంస్థల కార్యకర్తలపై అక్రమ కేసులు

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వివిధ హిందూ సంస్థల కార్యకర్తలను హింసిస్తూ వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆయన ఎక్స్ వేదికగా ఆరోపించారు. ముందుగా.. కార్యకర్తలపై భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 176, సెక్షన్ 173 నిబంధన కింద మూడు క్రిమినల్ కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు తర్వాత ఆ ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేసి సెక్షన్ 109(హత్యాయత్నం)ను చేర్చారని పేర్కొన్నారు. "ఇది కుట్రా? లేక ద్వేషమా? సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని హిందూ వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి" అని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.


సీఎంను మార్చేందుకు మతకలహాలు సృష్టించిన నీచ సంస్కృతి కాంగ్రెస్‌ది: ఈటల

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిని మార్చాలనుకున్నప్పుడు మత కలహాలు సృష్టించిన నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. మతకలహాలతో చనిపోయిన వారి శవాలపై రాజకీయాలు చేసిన దుర్మార్గపు సంస్కృతి ఆ పార్టీదని దుయ్యబట్టారు. గతంలో మర్రి చెన్నారెడ్డిని, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని సీఎం పదవి నుంచి దించేందుకు కాంగ్రెస్ వాళ్లు మత కలహాలు సృష్టించారని ఆయన ఆరోపించారు. తమది లౌకిక పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు, మతోన్మాదులను పెంచి పోషిస్తున్నవారి గురించి ఎందుకు మాట్లాడరని నిలదీశారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ ప్రేక్షకపాత్ర పోషిస్తోందని, హిందువుల విశ్వాసాన్ని కాపాడటంలో సీఎం రేవంత్ విఫలమయ్యారని విమర్శించారు

అహో.. హన్!

హన్ నదిపై రాత్రి ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో వాటర్ షో

సియోల్ నగరం మధ్యలో 75 కిలోమీటర్ల నది.. దానిపై తేలియాడే బార్జెస్, హోటళ్లు, మాల్స్



అత్యద్భుత పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు

సియోల్ పర్యాటక, ఆర్థికాభివృద్ధికి జీవనాడి

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)


అది సియోల్! ఆ మెట్రోపాలిటన్ నగరం మధ్య నుంచి పారే హన్ నది! అటు నుంచి ఇటుకు ఏకంగా 75 కిలోమీటర్లు! ఒక నగరం మధ్యలో ఇంత పొడవైన నది ప్రపంచంలో ఇక్కడే ఉంది! దీనినే అటు పర్యాటకానికి, ఇటు ఆర్థికాభివృద్ధికి జీవనాడిగా మార్చుకోవాలని దక్షిణ కొరియా భావించింది! హన్ నది అభివృద్ధి ప్రాజెక్టులకు అంకురార్పణ చేసింది! నదిపై తేలియాడే బార్జెస్ ఏర్పాటు చేసింది. వాటిపై ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పద్ధతిలో హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, కన్వెన్షన్ కేంద్రాలు నిర్మించింది. నగర ప్రజల ఆనందం, ఆరోగ్యం కోసం అత్యద్భుత పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేసింది. దీనిని అద్భుతమైన నైట్ లైఫ్‌కు కేంద్రంగా మార్చింది. అంతేనా.. నదికి అటూ ఇటూ 75 కిలోమీటర్ల మేర పెద్ద హైవేను అభివృద్ధి చేశారు. దీనిపై వెళ్తున్న వాహనదారులు 10 నిమిషాల్లోనే నదీ తీరానికి వచ్చేలా రోడ్డు మార్గాలున్నాయి. తద్వారా దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరిగేందుకు ఆస్కారం ఏర్పడింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును రోజుకు సగటున 1.66 లక్షలమంది పర్యాటకులు సందర్శిస్తున్నారు. ఇప్పటికే తొలి దశ ప్రాజెక్టులో కొంత మేర అభివృద్ధి జరిగింది. ఆ దేశ ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ 1.7 ట్రిలియన్ డాలర్లు! భవిష్యత్తులో దీనిని రెట్టింపు చేయడమే లక్ష్యంగా దక్షిణ కొరియా ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. సియోల్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ఎంఆర్‌డీసీఎల్ డైరక్టర్ పి.గౌతమి తదితరుల బృందం మంగళవారం హన్ నది అభివృద్ధి ప్రాజెక్టును సందర్శించింది. ఇక్కడి అధికారులతో భేటీ అయి వివరాలు తెలుసుకుంది. మంత్రుల బృందం ఇప్పటికే చంగ్ ఏ చంగ్ ప్రాజెక్టును సందర్శించిన విషయం తెలిసిందే. మూసీ నది నిజాం రాజుల కాలంలో స్వచ్ఛంగానే ఉండేది. దాని చుట్టూ అనేక గొప్ప కట్టడాల నిర్మాణం జరిగింది. చంగ్ ఏ చంగ్ నది కూడా 600 ఏళ్లపాటు ఇక్కడి హంగ్ రాజుల కాలంలో విరాజిల్లింది. ఈ నేపథ్యంలోనే.. పునరుజ్జీవం విషయంలో చంగ్ ఏ చంగ్.. అభివృద్ధి ప్రణాళికలో హన్ నది బాటలోనే హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఉండనుంది.

ప్రాథమిక ప్రణాళిక నాలుగు నెలల్లోనే

హన్ నది అభివృద్ధి ప్రణాళికకు అయ్యే నిధులను పీపీపీ పద్ధతిలో సమకూరుస్తున్నారు. ఇందుకు 549 బిలియన్ల దక్షిణ కొరియా వన్‌లు (రూ.3500 కోట్లు) ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో ప్రైవేటు సంస్థల వాటా 313.5 బిలియన్ వన్‌లు. ప్రభుత్వ వాటా 173 బిలియన్ వన్‌లు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను కూడా పీపీపీ పద్ధతిలోనే సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో నది ప్రక్షాళన, అభివృద్ధితోపాటు అటూ ఇటూ పెద్ద రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలున్నాయి.

దశలవారీగా...

హన్ నది అభివృద్ధి ప్రాజెక్టును దశలవారీగా చేపట్టారు. తొలి దశలో ఫ్లోటింగ్ హోటళ్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. మలి దశల్లో 12 హ్యాంగింగ్ పార్కులు, మరిన్ని తేలియాడే అద్భుత నిర్మాణాలను చేపట్టనున్నారు. వీటిలో కొన్నింటిని 2026 నాటికి, మిగతా వాటిని 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూసీ నదిని కూడా రెండు దశల్లోనే చేపట్టనున్నారు. ఇక, ఇక్కడ పరిశీలన పూర్తయిన తర్వాత మంత్రులు, అధికారుల బృందం దీనిపై చర్చించింది. మూసీ ప్రాజెక్టు ప్రాథమిక ప్రణాళికను కూడా నాలుగు నెలల్లోనే ఇచ్చేలా ఆ బాధ్యతలు అప్పగించిన సంస్థను అడగాలని నిర్ణయించింది. ఆ తర్వాత సమగ్ర ప్రాజెక్టు ప్రణాళిక (డీపీఆర్)ను రూపొందిస్తారు. దాని నిబట్టి దశలవారీగా పనులు చేపడతారు. డీపీఆర్ వచ్చాక తొలి రెండేళ్లలో ప్రతి రెండు, మూడు కిలోమీటర్లకు ఒకటి చొప్పున వంతెనలు, చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రలాజికల్ అధ్యయనం, స్థానిక భౌగోళిక పరిస్థితులు ఇందులో కీలకం. ఎందుకంటే.. ఎక్కడ ఏ ఎత్తులో చెక్‌డ్యాంలు కట్టాలి? మూసీ అంతటా ఎల్లప్పుడూ నీరుండేలా ఎలా చేయాలన్నది ఈ అధ్యయనాన్ని బట్టే నిర్ణయిస్తారు. మరోవైపు, డీపీఆర్‌లో భూ వినియోగ ప్రణాళిక చాలా కీలకం. ఎక్కడ భూమి అందుబాటులో ఉంది? దానిని ఎలా ఉపయోగించాలి? ఎక్కడెక్కడ నదీతీరాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి? తదితర అంశాలన్నీ ఈ భూ వినియోగ ప్రణాళికలోనే ఉంటాయి.



హన్ నదిపై షాపింగ్ మాల్

వరద నీరు, డ్రైనేజీ నీటికి వేర్వేరు వ్యవస్థలు

సియోల్ నగరంలో వరద నీటి నిర్వహణ, డ్రైనేజీ నీటి నిర్వహణకు వేర్వేరు పైప్‌లైన్ వ్యవస్థలున్నాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి వేర్వేరు వ్యవస్థల ఏర్పాటు కోసం రూ.4 వేల కోట్ల అంచనాతో ప్రణాళికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించామని ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ తెలిపారు. మరోవైపు, గోదావరి నుంచి తీసుకొచ్చే 15 టీఎంసీల నీటిలో 10 టీఎంసీలను ఘన్‌పూర్ దగ్గర శుద్ధి చేసి పశ్చిమ హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తారు. 2.5 టీఎంసీలను జంట జలాశయాల్లో నీరు తక్కువ ఉన్నప్పుడు నింపేందుకు ఉపయోగిస్తారు. మరో 2.5 టీఎంసీలను మూసీ నదిలో అన్ని కాలాల్లోనూ నీరుండేలా చేసేందుకు వినియోగిస్తారు.

మూసీ ప్రక్షాళన నూటికి నూరు శాతం చేస్తాం: పొంగులేటి

మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవ ప్రాజెక్టును నూటికి నూరు శాతం చేస్తామని, అక్కడున్న పేద వారందరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. చంగ్ ఏ చంగ్ పునరుజ్జీవ ప్రాజెక్టును సందర్శిస్తే.. పిల్ల కాలువను సందర్శిస్తారా? అని ప్రతిపక్షం విమర్శలు చేసిందని, ఇప్పుడు పెద్ద నది హన్‌ను కూడా సందర్శించి అధ్యయనం చేశామని చెప్పారు. ప్రతిపక్షాలు వీలుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలని, లేదంటే పనికొచ్చే సలహాలు కూడా ఇవ్వొచ్చని, కానీ, బురదజల్లే కార్యక్రమం మాత్రం మానుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఏ ఒక్కరికీ నష్టం కలిగించే పని తమ ప్రభుత్వం చేయబోదని, బాధితులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. అందరినీ ఒప్పించి, మెప్పించి మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. హన్ నది అభివృద్ధి ప్రణాళిక సియోల్‌కు జీవరేఖగా ఎలా మారుతుందన్నది పరిశీలించామని, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కూడా హైదరాబాద్‌కు అన్నిరకాలుగా ఉపకరిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పనుల వల్ల వచ్చే ఫలితాల పట్ల బీఆర్ఎస్ నేతలకు భయం పట్టుకుందన్నారు.

ఎన్ఐసీ చేతికి ధరణి నిర్వహణ

» విదేశీ సర్వీస్ ప్రొవైడర్ టెర్రాసిస్ నుంచి విముక్తి

» ధరణి సమస్యలకు త్వరలోనే పరిష్కారం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ నిర్వహణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల మ్యానిఫెస్టో హామీని అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకూ విదేశీ సంస్థ టెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణ బాధ్యతను స్వదేశీ సంస్థ ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్)కి అప్పగించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబరు ఒకటో తేదీ నుంచి తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణ బాధ్యతను జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ) నిర్వహిస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. త్వరలో ధరణి సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని తెలిపారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు ఎలాంటి ముందుచూపు లేకుండా హడావుడిగా తొందరపాటు నిర్ణయాలతో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణకు చెందిన 1.56 కోట్ల ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు టెర్రాసిస్ అనే విదేశీ సర్వీస్ ప్రొవైడర్‌కు తాకట్టు పెట్టారు. ఈ సంస్థ ఒడిసాలో పని చేసి విఫలమైంది. కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ధరణి పోర్టల్‌ను దానికి అప్పగించారు. లక్షల మంది రైతుల సాగు భూముల రికార్డులను కేసీఆర్, కేటీఆర్ ఏకపక్షంగా విదేశీ కంపెనీ చేతిలో పెట్టారు. దాంతో, ఐదేళ్లపాటు ధరణితో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు" అని మండిపడ్డారు. ధరణి పేరిట జరిగిన దగాతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోయిందని, ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను బీఆర్ఎస్ సర్కారు సమాధి చేసిందని విమర్శించారు. ఆనాటి ప్రభుత్వ పెద్దల దాష్టీకానికి ప్రజలు అనుభవించిన బాధలు అన్నీ ఇన్నీ కావని, కాంగ్రెస్ పాలనలో ఈ సమస్యలకు చరమగీతం పాడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం విదేశీ సర్వీస్ ప్రొవైడర్ చేతిలో ఉన్న ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీకి అప్పగించామన్నారు. తద్వారా, భూములకు పూర్తి రక్షణ లభించినట్లైందన్నారు. లక్షలాది మంది రైతులు సమస్యల నుంచి గట్టున పడతారని, అన్ని సమస్యలకు త్వరలోనే పరిష్కారాలు లభిస్తాయని అన్నారు.

ఫోర్త్ సిటీలో ఫ్యాషన్ వర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఆసక్తి చూపించారు. టెక్స్‌టైల్ రంగంలో వస్తున్న అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా ఈ వర్సిటీ ఉంటుందని, తద్వారా, హైదరాబాద్ కేంద్రంగా భారత వస్త్ర పరిశ్రమ గణనీయమైన వృద్ధి సాధిస్తుందని కిహాక్ సంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రులు.. ఫోర్త్ సిటీలో 20 ఎకరాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఫోర్త్ సిటీ భూ వినియోగంపై త్వరలో కొత్త ల్యాండ్ పాలసీని ప్రకటించనున్నామని, దానికి అనుగుణంగా భూ కేటాయింపు ఉంటుందని తెలిపారు.

మార్చిలోపు మరో నాలుగు యూనిట్లు

టెక్స్‌టైల్ రంగంలో ప్రపంచంలోనే దిగ్గజ వస్త్ర తయారీ కంపెనీగా యంగ్ వన్‌కు పేరుంది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ)లో ఈ సంస్థకు ఇప్పటికే ప్రభుత్వం 298 ఎకరాలు కేటాయించగా.. ఇందులో ఒక యూనిట్ ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. ఇక్కడ తయారవుతున్న ట్రెక్కింగ్ స్పోర్ట్స్‌వేర్ టీ షర్టులు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయి. రూ.840 కోట్లతో మొత్తం 11 యూనిట్లు ఏర్పాటు చేస్తామని కంపెనీ గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. మిగతా యూనిట్ల ప్రారంభం గురించి సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు. దీంతో, వచ్చే ఏడాది మార్చిలోపు మరో నాలుగు యూనిట్లు ఏర్పాటు చేస్తామని కిహాక్ సంగ్ చెప్పారు. మిగతా యూనిట్లను ఆ తర్వాత ప్రారంభిస్తామన్నారు. వరంగల్ కేంద్రంగా కేఎంటీపీ నుంచి ఉత్పత్తి అవుతున్న తమ వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని యూనిట్లు వస్తే వ్యాపారం మరింత పెరుగుతుందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే తమకు అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని, పారిశ్రామికంగా జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. దీనికి స్పందించిన మంత్రులు.. మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఏడాదిన్నరలో అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. కొత్త యూనిట్ల శంకుస్థాపనకు తెలంగాణకు రావాలని మంత్రులు ఆహ్వానించారు. వచ్చే ఏడాది ప్రారంభంలో కేఎంటీపీ కొత్త యూనిట్ల ప్రారంభానికి త్వరలో యంగ్ వన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న తన కుమార్తె రే యున్ సంగ్ వస్తారని కిహాక్ మంత్రులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆమె కార్పొరేషన్‌కు ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశంలో ఆమె కూడా పాల్గొన్నారు. తమ రాష్ట్రానికి వచ్చినప్పుడు తెలంగాణ చేనేత కార్మికులు రూపొందించే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి పట్టుచీరను బహుమతిగా ఇస్తామని మంత్రులు సరదాగా వ్యాఖ్యానించారు. తెలంగాణ చేనేత కార్మికుల సృజనాత్మకత గురించి కాబోయే చైర్మన్‌కు మంత్రులు వివరించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

» రూ.4.19 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎం. వెంకట భూపాల్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. ఆయనతోపాటు ఆయన బంధువులు, కుటుంబసభ్యుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించి రూ.5.05 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. ఇందులో రూ.4.19 కోట్ల విలువైన అక్రమాస్తులు ఉన్నట్టు లెక్కతేల్చి ఆయనపై కేసు నమోదు చేశారు. కాగా, నిషేధిత జాబితాలోని భూమిని తొలగించేందుకు రూ.8లక్షలు లంచం తీసుకుంటూ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఆగస్టు 14న ఏసీబీకి పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నాగోల్‌లోని ఆయన నివాసంలో సోదాలు చేసిన ఏసీబీ అధికారులు రూ.16 లక్షల నగదు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

ఏసీబీకి చిక్కిన పెబ్బేరు మునిసిపల్ కమిషనర్

» 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

పెబ్బేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను విడుదల చేసేందుకు ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 20 వేలు లంచం తీసుకుంటున్న వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపల్ కమిషనర్ కందికట్ల ఆదిశేషును ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. గత ఏడాది మునిసిపల్ వార్డులలో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు గాను దాదాపు రూ.2.6 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉండగా వాటిని మంజూరు చేయాలని వెంకటేశ్ అనే కాంట్రాక్టర్ కమిషనర్‌ను కోరాడు. అయితే తనకు 10 శాతం లంచం ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బాధితుడు ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి కమిషనర్ రూ. 20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుడిని బుధవారం నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు.

నాగారం భూములపై ఈడీ నజర్!

» 50 ఎకరాల భూదాన్ భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు

» ఇదే విషయంలో అప్పటి తహసీల్దారు జ్యోతిపై కేసు నమోదు

» నేడు ఈడీ విచారణకు అమోయ్ కుమార్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని వివాదాస్పద భూముల వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. ఈ భూములపై నడుస్తున్న రెండు కేసుల్లో ఆర్థిక వ్యవహారాలు ఉండడంతో ఈడీ విచారణకు దిగినట్లు తెలిసింది. నాటి కలెక్టర్‌ను కూడా విచారణకు పిలవడంతో చర్చనీయాంశంగా మారింది. నాగారంలో సర్వే నంబరు 181లోని 92 ఎకరాలు, 182లోని 10.2 ఎకరాలు కలిపి మొత్తం 102.2 ఎకరాలపై కొంత కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఇందులో 50 ఎకరాల భూమి తమదేనంటూ భూదాన్ బోర్డు వాదిస్తోంది. వాస్తవానికి ఈ భూమి మొత్తం గతంలో జబర్దస్త్ ఖాన్ పేరుపై ఉంది. అనంతర కాలంలో ఆయన కుమారుడు నవాబ్ హాజీఖాన్ సర్వే నంబరు 181లోని 50 ఎకరాలను భూదాన్ బోర్డుకు దానం చేశారని బోర్డు వాదిస్తోంది. ఇదిలా ఉండగా 2021లో హాజీఖాన్‌కు తాను వారసురాలినని, 42 ఎకరాలు తనవేనంటూ ఖాదరున్నీసా సక్సేషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఆగమేఘాలపై ఆమె పేరు మీద రికార్డులు మారిపోయాయి. క్షేత్రస్థాయిలో ఆర్డీవో, తహసీల్దారు, స్థానిక ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్ అందరూ ఈమెకు అనుకూలంగా పనిచేశారు. తర్వాత భూమిని ఆమె నుంచి ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేసిన తర్వాత.. రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించారు. దీనిపై ఎన్నికల సమయంలో ఫిర్యాదు రావడంతో అధికారులు విచారణ జరిపి తదుపరి క్రయవిక్రయాలు జరగకుండా ధరణిలో నిషేధిత జాబితాలో చేర్చారు. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై దస్తగిరి షరీఫ్ కోర్టును ఆశ్రయించగా.. 17వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశాల మేరకు మహేశ్వరం పోలీసులు అప్పటి తహసీల్దారు జ్యోతి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్, ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్ యజమాని కొండపల్లి శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

63 గజాల డాక్యుమెంట్‌తో 51.22 ఎకరాలు రిజిస్ట్రేషన్

నాగారంలోని సర్వే నంబర్లు 181, 182లో మిగిలిన 51.22 ఎకరాల భూమి మహ్మద్ అజీజ్‌ఖాన్, ఉన్నీసాబేగం, మున్వార్‌ఖాన్ పేర్లపై కొన్నాళ్లుగా రికార్డుల్లో ఉంది. ఇటీవల ఈ భూమిని మాణిక్యమ్మనగర్‌కు చెందిన చంద్రయ్యగౌడ్ మరికొందరు కలిసి కొనుగోలు చేశారు. విలువైన ఈ భూములపై కన్నేసిన చాంద్రాయణగుట్టకు చెందిన సాహెబ్ జాహేద్ ఖుర్షీఖాన్ కందుకూరు మండలం మహ్మద్‌గూడకు చెందిన మహ్మద్ ఆసిఫ్ జానీ, చార్మినార్‌కు చెందిన మహ్మద్ హసన్, మహ్మద్ అబ్బాస్, అలీమ్‌లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. హైదరాబాద్‌లోని శాస్త్రిపురంలో 1976లో చేసుకున్న 63 గజాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను అడ్డుపెట్టుకుని 51.22 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమికి సంబంధించి చంద్రయ్యగౌడ్, ఇతరులపై కోర్టులో కేసు వేశారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను నిర్ధారించాలని కోర్టు అప్పట్లో కలెక్టర్‌ను ఆదేశించింది. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి, అసలు పట్టాదారు చంద్రయ్యగౌడ్ అని నిర్ధారించారు. ఆయన ఫిర్యాదుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన నిందితులను అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాలతో అప్పటి తహసీల్దారు జ్యోతిపై కేసు పెట్టిన తర్వాత ఆమెను విజిలెన్స్ అధికారులు విచారించినట్లు తెలిసింది.ఈ కేసులో ఫిర్యాదులు అందడంతో ఈడీ విచారణ చేపట్టినట్లు సమాచారం. గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్‌కుమార్‌ను విచారణకు పిలిచినట్లు తెలిసింది.ఆయన బుధవారం విచారణకు హాజరు కానున్నారు.

మలేషియాకు మంత్రి తుమ్మల

» 3 రోజులు పర్యటించనున్న మంత్రి, అధికారులు

» ఆయిల్‌పామ్ సాగు విధానంపై మరింత అధ్యయనం



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా పర్యటనకు వెళ్లారు. ఆయిల్‌పామ్ సాగు విధానం, నూనె గింజల ఉత్పత్తి... తదితర అంశాలపై అధ్యయనం చేయటానికి మంగళవారం రాత్రి మలేషియా బయలు దేరివెళ్లారు. మూడు రోజుల పాటు అక్కడ పర్యటించనున్నారు. ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆయిల్‌పామ్ ప్రాజెక్టును మరింత విజయవంతం చేయటానికిగాను తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధ్యయనం చేయనున్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా, అధికారులు సరోజిని, ఓఎస్డీ శ్రీధర్‌లు మంత్రితో పాటు వెళ్లారు.



‘దానా’ గండం..!

» బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. ప్రస్తుతం ఒడిశాలోని పారాదీప్‌కు 690 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడనుంది. దీనికి ఒమన్ దేశం సూచించిన ‘దానా’ పేరు పెట్టనున్నారు. బుధవారం ఉదయం నుంచి వాయవ్యంగా పయనిస్తూ వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో ఈనెల 24న తీవ్ర తుఫాన్‌గా మారుతుంది. తర్వాత అదే దిశలో పయనించి 25వ తేదీ తెల్లవారుజాములోగా ఉత్తర ఒడిశాలోని పారాదీప్ నుంచి బాలాసోర్ మధ్య తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తీవ్ర తుఫాన్ తీరం దాటే సమయంలో 100 నుంచి 110, అప్పుడప్పుడు 120 కి.మీ. వేగంతో పెనుగాలులు వీయనున్నాయి. తుఫాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్యన తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయి.

దానా తుఫాన్ ఎఫెక్ట్.. పలు రైళ్ల రద్దు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి కోల్‌కతా వైపు వెళ్లి వచ్చే పలు రైళ్లను బుధవారం నుంచి ఆదివారం వరకు రద్దు చేసినట్లు అధికారులు చెప్పారు. తుపాను ప్రభావం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం ఓ ప్రకటనలో రైల్వే అధికారులు సూచించారు. మరింత సమాచారం కోసం రైల్వే శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ముగిసిన గ్రూపు-1 జనరల్ ఎస్సే పరీక్ష

హైదరాబాద్/ సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 మెయిన్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన జనరల్ ఎస్సే పరీక్షకు 69.4 శాతం మంది హాజరయ్యారు. 31,403 మందికి గాను 21,817 మందే పరీక్ష రాశారు. పరీక్షలో మొత్తం మూడు ప్రశ్నలకు వ్యాస రూపంలో సమాధానాలు రాయాల్సి ఉంది. ఒక్కో ప్రశ్నకు 50 మార్కులు కేటాయించారు. ప్రశ్నలు సులువుగానే ఉన్నాయని అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. బుధవారం పేపర్-2లో భాగంగా చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ పరీక్ష జరుగనుంది.

జేఎల్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

ఇంటర్మీడియట్ జూనియర్ లెక్చరర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ అధికారులు వెబ్‌సైట్‌లో పెట్టారు.

విగ్రహ ధ్వంసం వీడియోలు తొలగించండి: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం వీడియోలు కలిగి ఉన్న యూఆర్‌ఎల్స్, వెబ్‌సైట్లను తొలగించాలంటూ న్యూఢిల్లీలోని ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్‌కు హైకోర్టు ఆదేశించింది. అలాగే పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మారేడ్‌పల్లి పోలీసులకు సూచించింది. తగిన చర్యలు తీసుకోవడానికి వీలుగా పోలీసులకు ఆధారాలు అందజేయాలని పిటిషనర్‌కు ఆదేశాలిచ్చింది. సదరు వీడియోలను, వాటిని ప్రమోట్ చేస్తున్న వెబ్‌సైట్లను తొలగించాలని పేర్కొంటూ ఫిర్యాదు అందజేసినా ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం చేయడంపై శాంతియుతంగా నిరసన వ్యక్తంచేస్తున్న తమపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను కొట్టేయాలని చిరువ్యాపారులు, స్థానికులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.

‘గుట్ట’ ఆలయంలోకి శునకం

భువనగిరి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి మంగళవారం శునకం ప్రవేశించింది. కొండపైన బస్టాండ్ ప్రాంగణం నుంచి ధర్మదర్శనం క్యూకాంప్లెక్స్, బంగారు క్యూలైన్ ద్వారా తూర్పు రాజగోపురం నుంచి భక్తులతో పాటు ఓ శునకం లోపలికి వచ్చింది. భద్రతా సిబ్బంది దానిని పట్టుకునే ప్రయత్నం చేయగా, త్రితల గోపురం దాటి క్యూలైన్ ద్వారా శునకం ఆలయంలోకి ప్రవేశించింది. దానిని ఆలయంలోని జయ విజయుల విగ్రహాల వద్దకు చేరుకునేలోగా ఒక సంచిలో బంధించి లిఫ్ట్ ద్వారా ఆలయం వెలుపల వదిలేశారు. గుడిలోకి శునకం రావటంతో అర్చకులు అరగంట పాటు సర్వ దర్శనాలు, బ్రేక్ దర్శనాలను నిలిపివేశారు. అనంతరం ఆలయంలో అరగంట పాటు సంప్రోక్షణ చేశారు. దీంతో 2.15 గంటల పాటు భక్తులు క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్నారు.

ఉపాధి పేరిట దోచుకున్నారు!

» ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడెంలో ఘటన

» అక్రమాలపై గతంలో ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన సంచికలో కథనం

కామేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారిన తీరు సామాజిక తనిఖీలో బయటపడింది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, గ్రామం వదిలి వెళ్లినవారు, దూర ప్రాంతంలో స్థిరపడ్డవారు, కూలీ పని ఎరుగనివారు, చనిపోయినవారు, మంచాన పడ్డవారి పేర్లను మస్టర్లలో చేర్చి హాజరు వేస్తూ దోపిడీకి పాల్పడ్డారు. ఈ అవినీతి బాగోతాన్ని సామాజిక తనిఖీలో స్వయంగా వేతనదారులే బయట పెట్టారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడెంలో మంగళవారం సామాజిక తనిఖీ బృందం 2023-24లో జరిగిన ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టింది. ఇందులో నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారాలపై ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన సంచికలో జూలై 8న “ఉపాధి సొమ్ము ఉద్యోగుల ఖాతాల్లోకి” అనే శీర్షికన కథనం ప్రచురించింది. ఆ కథనంతో విచారణ చేపట్టిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను సస్పెండ్ చేశారు. సీనియర్ మేట్లను తొలగించారు.

కుక్కను తరమబోయి.. మూడో అంతస్తు నుంచి కిందపడి..

» యువకుడి దుర్మరణం.. చందానగర్ హోటల్‌లో ఘటన

చందానగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల కోసం ఓ హోటల్లోని మూడో అంతస్తు గదికి వెళ్లిన యువకుడు.. కారిడార్‌లో కుక్క అరుపులు విని గది బయటకొచ్చాడు. దాన్ని తరుముతూ వెళ్లి.. అంతే వేగంగా వెనక్కొచ్చాడు. ఈ క్రమంలో పట్టుతప్పి కారిడార్‌లో ఉన్న పెద్ద కిటికీలోంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చందానగర్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఆర్సీపురం జ్యోతినగర్‌కు చెందిన ఉదయ్ కిరణ్ (22) ఐటీఐ పూర్తి చేసి తండ్రితో కలిసి పెయింటింగ్ పనికి వెళ్తున్నాడు. అశోక్‌నగర్‌లో రంగులు వేసే పని ఉందని చెప్పి ఆదివారంఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రావాలని తల్లి ఫోన్ చేయగా స్నేహితుడి పుట్టిన రోజు వేడుక ఉందని చెప్పాడు. మిత్రులతో కలిసి వీవీ ప్రైడ్ హోటల్‌లోని 304 గదిలో మద్యం తాగాడు. కారిడార్‌లో కుక్క అరుస్తుండటంతో దాన్ని వెళ్లగొట్టేందుకని ఉదయ్ కిరణ్ బయటకొచ్చాడు. కుక్కను తరుముతూ వేగంగా ముందుకు ఉరికాడు. తర్వాత అంతే వేగంతో వెనక్కి వస్తూ పట్టుతప్పి కారిడార్‌లో నుంచి కిందకు పడ్డాడు. మిత్రులు అతడిని దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఉదయ్ కిరణ్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

కృష్ణమ్మ కళకళ



కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఈ ఏడాది రికార్డు వరద

» శ్రీశైలం ప్రాజెక్టుకు ఇప్పటిదాకా 1467 టీఎంసీల రాక

» గతేడాది వచ్చింది కేవలం 145 టీఎంసీలే

» వచ్చే నెలాఖరు దాకా ఇన్‌ఫ్లో

మహబూబ్‌నగర్, గద్వాల, నాగార్జునసాగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కృష్ణమ్మ ఈ ఏడాదిలో ఇప్పటిదాకా కళకళలాడుతూనే ఉంది. రాష్ట్రంలో కురిసిన వర్షాలకు తోడు వరదలతో నిండుకుండలానే ఉంటుంది. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఈ ఏడాది వరద ఉధృతి కొనసాగుతోంది. సీజన్ ప్రారంభం నుంచి ఎగువ నుంచి వరద వస్తుండడంతో ఈ ఏడాది మొదట్లోనే ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయి. నవంబరు నెలాఖరు వరకు వరద కొనసాగే అవకాశం కనిపిస్తుంది. గతేడాది శ్రీశైలం ప్రాజెక్టుకు కేవలం 145 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. కానీ, ఈ ఏడాది ఇప్పటికే 1467 టీఎంసీల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టును చేరింది. జూరాల ప్రాజెక్టుకు ఈ ఏడాది ఇప్పటివరకు 1062.65 టీఎంసీల వరద వచ్చింది. ఆలమట్టి రిజర్వాయర్ ఈ ఏడాది జూలై మొదటి వారంలోనే నిండింది. దీంతో నీటి విడుదల జరిగి దిగువన ఉన్న నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎగువన ఉన్న కర్ణాటకలోనూ వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు గతేడాది అత్యల్పంగా 145 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. ఫలితంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు జూరాల కింద ఆయకట్టుకు క్రాప్ హాలిడే ఇచ్చారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తడంతో వేసవిలో కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 1.90 టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేసుకున్నారు. ఈ ఏడాది ఎగువ నుంచి వరద తక్కువగా వచ్చినప్పటికీ జూరాల, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో అధిక వర్షాలు కురవడంతో ప్రాజెక్టులకు అధికంగా వరద వచ్చి చేరుతోంది. వచ్చే నెలాఖరు వరకు వరద కొనసాగే అవకాశం ఉండడంతో ఈసారి యాసంగి సాగుకు క్రాప్ హాలీడే ప్రకటించాల్సిన అవసరం కనిపించడం లేదు. అలాగే తాగునీటికీ ఇబ్బంది తలెత్తే అవకాశం లేదు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఏపీ వైపు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా, తెలంగాణ వైపు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే ఎడమ, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. వరద నిలిచిన తర్వాత ఇబ్బడిముబ్బడిగా విద్యుదుత్పత్తి చేస్తే తప్ప ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలకు ఢోకా ఉండదు. అలాగే, యాసంగిలో ప్రధాన ప్రాజెక్టులతోపాటు, ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు కూడా ఇబ్బంది ఉండదు.

తుంగభద్రకు భారీగా వరద

తుంగభద్ర నదికి భారీగా వరద వచ్చి చేరుతోంది. మంగళవారం మధ్యాహ్నం 90 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉండగా మరింత వరద వచ్చి చేరుతుండటంతో రాత్రి 9 గంటల ప్రాంతంలో డ్యామ్ గేట్లను ఎత్తి 1,20,000 క్యూసెక్కులను దిగువకు విడిచిపెట్టారు. ఇక, ఆల్మట్టికి 38 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 వేల క్యూసెక్కులను దిగువకు వదలుతున్నారు. నారాయణపూర్‌కు 35 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 30 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 64 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 24,678 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,480 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 94 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు గేట్ల ద్వారా 55 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66 వేల క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

సాగర్ గేట్ల మూసివేత

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గడంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను అధికారులు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు 20 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేయగా వరద తగ్గడంతో మంగళవారం ఉదయం 9 గంటలకు రెండు గేట్లు మూసివేశారు. అక్కడి నుంచి ప్రతీ గంటకు రెండేసి గేట్లు చొప్పున మూసేస్తూ సాయంత్రానికి 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి పది గంటలకు వాటిని కూడా మూసేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 588.90 అడుగులుగా నమోదైంది. మరోపక్క, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకున్నారు. 1,400 మిలియన్ యూనిట్లు లక్ష్యంతో జూలై 24న విద్యుదుత్పత్తి ప్రారంభించగా మంగళవారం మధ్యాహ్నంకు లక్ష్యాన్ని చేరుకున్నామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం

తెలంగాణపై ప్రభావం నిల్

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం సాయంత్రానికి వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది మరింత బలపడి 23 నాటికి తుఫాన్‌గా ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. 24 నాటికి తీవ్ర తుఫాన్‌గా ఉధృతి చెంది ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపింది. అయితే దీని ప్రభావం తెలంగాణ పై ఉండే అవకాశం లేదని వెల్లడించింది. మరోవైపు తెలంగాణలో రాగల రెండు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.



చౌటుప్పల్‌లోని మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకు పోయిన ధాన్యాన్ని చేతులతో తీస్తున్న మహిళా రైతు

పిడుగుపాటుకు ముగ్గురు బలి

ఖమ్మం జిల్లాలో తండ్రీకూతుళ్ల మృతి

ధాన్యం విక్రయానికి వచ్చి కామారెడ్డి జిల్లాలో కొడుకు మృతి, తండ్రికి గాయాలు

కామేపల్లి, నాగిరెడ్డిపేట, చౌటుప్పల్ టౌన్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు మంగళవారం రాష్ట్రంలో ముగ్గురిని బలి తీసుకుంది. మృతుల్లో ఇద్దరు తండ్రీకూతుళ్లు కాగా మరో యువకుడు ఉన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్దులపల్లిలో చింతల లింగస్వామి (38), తన భార్య శైలజ, పెద్ద కుమార్తె కావేరి(17)తో కలిసి మంగళవారం పొలం పనికి వెళ్లారు. వర్షం కురవడంతో సమీపంలోని వేప చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగుపడగా చెట్టు కింద ఉన్న లింగస్వామి, కావేరి ప్రాణాలు కోల్పోయారు. శైలజ అస్వస్థతకు గురైంది. ఇక, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం బొల్లారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై మంద వెంకటేశ్(25) మరణించగా అతని తండ్రి నాగభూషణం, కాశవ్వ అనే మహిళా రైతు గాయపడ్డారు. తాము పండించిన ధాన్యాన్ని కొడుకుతో కలిసి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన నాగభూషణం పిడుగుపాటు వల్ల కొడుకును కోల్పోయాడు. వెంకటేశ్ భార్య ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. మరోపక్క, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం రాత్రి గంట సేపు కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం రాశులు తడిసిపోయాయి. 20నుంచి 30 రాశులకు చెందిన ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోయింది. 99మంది రైతులకు చెందిన సుమారు 30వేల బస్తాల ధాన్యం మార్కెట్‌కు చేరుకోగా, అందులో 60 నుంచి 70 శాతం రాశుల కిందకు వర్షపు నీరు చేరింది. ఇక, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మంగళవారం కురిసిన మోస్తారు వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.

మనీలాండరింగ్ కేసు పేరుతో మహిళను బెదిరించి 43లక్షల దోపిడీ!

ఉరిశిక్ష తప్పదంటూ ఫోన్‌లో సైబర్ నేరగాళ్ల హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎవరో వీడియో కాల్ చేసి.. ఏదో దర్యాప్తు సంస్థ పేరు చెప్పి.. కేసులున్నాయని బెదిరిస్తే స్థిమితంగా ఆలోచించాల్సిపోయి ఉన్నత విద్యావంతులూ హడలిపోతున్నారు. వారు అడిగినంత మొత్తం ఖాతాలకు బదిలీ చేస్తున్నారు! ఆ తర్వాత గానీ తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని తెలుసుకోలేకపోతున్నారు. హైదరాబాద్ వాస్తవ్యురాలు, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న 34 ఏళ్ల మహిళ ఇలానే రూ.43.4 లక్షలు మోసపోయింది. డీసీపీ ధార కవిత వెల్లడించిన వివరాల ప్రకారం.. సదరు మహిళకు ట్రాయ్ (టెలీకమ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి మాట్లాడుతున్నట్లుగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. మాట్లాడుతూనే ఆమె పేరుతో ఉన్న రెండు ఫోన్ నంబర్లు మరో రెండు గంటల్లో బ్లాక్ చేస్తున్నామంటూ ఫోన్లో ఆ వ్యక్తి హెచ్చరించాడు. తర్వాత ఆమెపై సైబర్ క్రైమ్‌లో మనీ ల్యాండరింగ్ కేసులు నమోదైనట్లు తమకు సమాచారం అందిందంటూ కాల్‌ను ముంబైలోని అందేరీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశాడు. అక్కడ పోలీసు యూనిఫాంలో ఉన్న మరో వ్యక్తి మాట్లాడుతూ.. ఆమెను వెంటనే డిజిటల్ అరెస్టు చేయండంటూ బాధితురాలివైపు కోపంగా చూస్తూ సిబ్బందిని హెచ్చరించాడు. ‘మీ ఫోన్ నంబర్ ద్వారా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయి. నరేష్ గోయల్‌కు చెందిన రూ. 6.8 కోట్ల మనీ ల్యాండరింగ్ కేసులో మీ హస్తం ఉందని, మీ మరో ఫోన్ నంబర్‌పై ఇప్పటికే 17 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మీపై అరెస్టు వారెంట్ జారీ అయింది’ అని బెదిరింపులకు గురిచేస్తూ సుప్రీంకోర్టు నుంచి వచ్చిన వారెంట్ లేఖను చూపించాడు. కచ్చితంగా ఉరిశిక్ష తప్పదంటూ బెదిరించారు. తాను ఏ తప్పూ చేయలేదని, తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె చెప్పడంతో మరో అధికారి లైన్‌లోకి వచ్చి, ‘మీరు చెప్తుంటే మీరు ఏ తప్పూ చేయలేదని అర్థం అవుతుంది. కానీ మేం సుప్రీం కోర్టుకు, ఆర్‌బీఐకి సాక్ష్యాధారాలతో మీరు తప్పు చేయలేదని నిరూపించాలి. కాబట్టి మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బంతా ఆర్‌బీఐ ఆధ్వర్యంలోని ఖాతాకు బదిలీ చేయండి. ఆర్థిక లావాదేవీలు పరిశీలించిన తర్వాత మీరు ఏ తప్పూ చేయలేదని నిర్ధారించి మీ డబ్బులు మీ ఖాతాలో జమ చేస్తాం’ అని చెప్పాడు. అయితే ఆమె ఖాతాలో సరిపడా డబ్బులేకపోవడంతో.. మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొత్తం విత్‌డ్రా చేయించి మొత్తం రూ. 43.4 లక్షలు కొల్లగొట్టారు. మరుసటి రోజు వారికి ఫోన్ చేయాలని చూస్తే కాంటాక్టు కట్ చేశారు. అనుమానం వచ్చిన బాధితురాలు కుటుంబసభ్యుల సహకారంతో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘మత్తు’పై ప్రచారాస్త్రం..!

» ప్రతిరోజు 5 వేల మందికి అవగాహన

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ఇప్పటివరకు విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో మాత్రమే చేపట్టిన అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనుంది. ఇందుకుగాను ఎక్కడికక్కడ స్థానిక పోలీసులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఆరోగ్యశాఖ ఇతర ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోల సహకారం సైతం తీసుకుంటున్నారు. ప్రతిరోజు సగటున 5 వేల మందికి మత్తు పదార్థాల వాడకం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, చట్టప్రకారంగా ఎదుర్కొనే ఇబ్బందులపై అవగాహన కల్పించనున్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.